మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

హే రామ్!

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

NAMASTE TELANGANA

గురువారం THURSDAY 3.10.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4

సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 119 ‖ వెల (Price) రూ.6.50

దేవీ నవరాత్రుల ప్రారంభం

గురువారం, సూర్యోదయం: 6-07, సూర్యాస్తమయం: 6-03. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం శరత్ రుతువు ఆశ్వయుజ మాసం శుక్లపక్షం తిథి: పాడ్యమి రాత్రి 2-59 వరకు. నక్షత్రం: హస్త పగలు 3-31 వరకు. వర్జ్యం: రాత్రి 12-35 నుంచి రాత్రి 2-23 వరకు. రాహుకాలం: పగలు 1-34 నుంచి పగలు 3-03 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 10-05 నుంచి ఉదయం 10-53 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 2-51 నుంచి పగలు 3-39 వరకు. అమృతకాలం: ఉదయం 8-44 నుంచి ఉదయం 10-33 వరకు.



- బతుకమ్మ ఆశీస్సులు కావాలని...



ఎంగిలిపూల బతుకమ్మతో సంబురాలు మొదలయ్యాయి. ఊరూరా కొత్త శోభను సంతరించుకున్నది. బుధవారం హన్మకొండ వేయిస్తంభాల ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

- రేవంత్ దృష్టి పడకూడదని...



సామాన్యుడిలో సర్కారు నింపిన భయమిది! ప్రజల్లో గూడుకట్టుకున్న ఆందోళన ఇది! మూసీ తీరంలోని తమ ఇండ్లపై సీఎం రేవంత్, కాంగ్రెస్ దృష్టి పడొద్దని కోరుకుంటూ దిష్టి తీస్తున్న వినాయకనగర్ కాలనీ వాసులు

మూసీని మించి కాంగ్రెస్ కంపు

కూల్చివేతల వ్యతిరేకతను దారి మళ్లించేందుకు డైవర్షన్ పాలిట్రిక్స్

అక్టోబర్ 2 గాంధీ జయంతి..! ఒక మహిళ అర్ధరాత్రి స్వేచ్ఛగా నడిరోడ్డుపై నడిచిన రోజే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు.. అని ప్రవచించిన బాపూజీ పుట్టిన రోజే ఒక మహిళ పట్ల సాటి మహిళే దారుణంగా వ్యవహరించింది. నిత్యం గాంధీ పేరు స్మరించే పార్టీ నుంచి బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్న కొండా సురేఖ, సాటి మహిళ అయిన సినీనటి సమంతను నడిరోడ్డుకీడ్చి అవమానించింది.




నిన్న బతుకమ్మ పండుగకు ఆరంభం! ఒక ఆడబిడ్డను మిగతా ఆడబిడ్డలంతా ఆదరంగా గౌరమ్మగా గౌరవించుకునే ఎంగిలి పూల బతుకమ్మ రోజే మంత్రి కొండా సురేఖ, ప్రముఖ సినీ నటి సమంతను ఎంగిలి మాటలతో కించపరిచింది. అనుచిత ఆరోపణలకు దిగి వ్యక్తిత్వ హననానికి పాల్పడింది.

- మూసీ డైవర్షన్ కోసం.. రేవంత్ రాంగ్ డైరెక్షన్
- సభ్యత మరిచి మంత్రి సురేఖ దిగజారుడు భాష
- గాంధీ జయంతిన.. గాంధీభవన్ వద్ద దుర్మార్గం
- రాజకీయ దురుద్దేశంతో సినీ తారలపై బురద
- వ్యక్తిగత అంశాలను ప్రస్తావిస్తూ శీలహననం
- ఎఫ్‌టీఎల్‌ను దాటి పోర్లిన రాజకీయ మురుగు
- నీళ్ల శుద్ధి తర్వాత.. ముందు నోళ్ల శుద్ధి జరగాలె
- సురేఖ తీరుపై దేశవ్యాప్తంగా విమర్శల వెల్లువ
- పలువురు రాజకీయ, సినీ ప్రముఖుల ఖండన
- పిచ్చాసుపత్రికి పంపాలన్న అక్కినేని అభిమాలు

మహిళై ఉండీ, మంత్రిగా ఉండీ.. సభ్యత, సంస్కారాన్ని మరిచి కొండా సురేఖ సాటి మహిళలపై హీనమైన వ్యాఖ్యలు చేశారు. స్థాయిని, హోదాను మరిచి దిగజారుడు భాష వాడారు. రాజకీయ దురుద్దేశంతో సినీ ప్రముఖులను, వారి వ్యక్తిగత జీవితాలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. సినీ తార సమంతపై సాటి మహిళగా చేయకూడని వ్యాఖ్యలు చేశారు. అవసరం లేకపోయినా వారి వ్యక్తిగత జీవిత అంశాలను ప్రస్తావించి శీలహననానికి పూనుకున్నారు. గాంధీజయంతి రోజున గాంధీభవన్ వేదికగా మంత్రి వాడిన జుగుప్సాకర భాషపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పలువురు రాజకీయ, సినీ ప్రముఖులతోపాటు పౌరసమాజం, కొండా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాయి. రెండురోజుల క్రితం ఎవరో సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే గగ్గోలు పెట్టారు సురేఖ. మహిళలను కించపరుస్తారా.. అంటూ నానాయాగీ చేశారు. బీఆర్ఎస్ నేతలు సైతం ఆమెపై సానుభూతి చూపుతూ ఆ పోస్టును తప్పుపట్టారు. అలాంటిది సాటి మహిళలపై ఆమె స్వయంగా రాయలేని, చెప్పలేని భాషలో వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఆమె ఒక్కరే మహిళ అన్నట్టు.. అటు నాగార్జున › 2వ పేజీలో



కొండా సురేఖకు కేటీఆర్ లీగల్ నోటీసు

తప్పుడు ఆరోపణలపై బహిరంగ క్షమాపణకు డిమాండ్ › 2

24 గంటల్లో చెప్పకపోతే.. చట్టపరంగా చర్యలని హెచ్చరిక

అక్కినేని కుటుంబంపై ఎందుకీ పగ? › 10



సురేఖ వ్యాఖ్యలు అబద్ధం.. అసంబద్ధం

మీ విమర్శలకు సినీ ప్రముఖుల జీవితాలను వాడొద్దు

తక్షణమే ఆ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి: నాగార్జున › 10

సురేఖ క్షమాపణ చెప్పాలి

బాధ్యత గల మంత్రులే నేరస్తుల్లా ప్రవర్తిస్తే ఎట్లా? › 2

రాహుల్ గాంధీకి చేసిన ఫిర్యాదులో అక్కినేని అమల

కొండా వ్యాఖ్యలపై భగ్గుమన్న సినీరంగ ప్రముఖులు

ఏ చెత్త మాట్లాడినా చెల్లుతదా?



ప్రజలపట్ల మీరు బాధ్యతగా ఉంటారనుకోవడం మూర్ఖత్వం

మీలాంటి నాయకులను చూస్తే అసహ్యమేస్తున్నది: నాని › 10

ఇదేం సిగ్గుమాలిన రాజకీయం



సినిమాల్లో నటించే ఆడవాళ్లంటే అంత చిన్న చూపా?: ప్రకాశ్‌రాజ్ › 2

మంత్రి సురేఖ వయసు 59 ఏండ్లు. 30 ఏండ్లపాటు రాజకీయాల్లో నలిగిన అనుభవం. ఏం మాట్లాడాలో, ఏం మాట్లాడొద్దో తెలుసని అందరం అనుకుంటాం. సినీనటి సమంత వయసు కేవలం 37 ఏండ్లు. ఆమె టాలీవుడ్‌కు వచ్చి 14 ఏండ్లు. తెలుగు రాజకీయాల గురించి ఆమెకు పెద్దగా తెలుసని అనుకోలేం. అయితేనేం మంత్రి సురేఖ బుధవారం తనపై చేసిన అసభ్య వ్యాఖ్యల మీద సమంత ఎంతో హుందాగా, మర్యాదగా, గౌరవంగా స్పందించింది. ఆమె ప్రతిస్పందించిన తీరు సున్నితంగా ఉంటూనే వాడిగా జవాబిచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మంత్రి బాధ్యతతో మాట్లాడాలి

విడాకులు వ్యక్తిగత విషయం.. లేని పోనివి ఆపాదించొద్దు

సమ్మతితోనే విడిపోయాం.. రాజకీయాలకేం సంబంధం?

ఇతరులు ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడటం సరికాదు

సమాజంలో ధైర్యంగా నిలబడ్డ.. చిన్నచూపు చూడొద్దు

మీ రాజకీయాల నుంచి నన్ను దూరంగా ఉంచండి

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై నటి సమంత స్పందన

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి చేసిన వ్యాఖ్యలపై సినీ నటి సమంత స్పందించారు. ఓ సామాజిక మాధ్యమంలో ఒక ప్రకటన చేసిన సమంత.. మంత్రి సురేఖను సున్నితంగా మందలించారు. సమాజంలో నిలబడి పోరాడటానికి ఎంతో ధైర్యం, బలం కావాలని, దయచేసి తనను చిన్నచూపు చూడొద్దంటూ ఒకింత హెచ్చరించినంత పనిచేశారు. ఓ మంత్రి మాటలకు విలువ ఉంటుందని › 10వ పేజీలో

మంత్రి వ్యాఖ్యలు సిగ్గుచేటు



మీడియాలో పతాక శీర్షికల కోసం అసత్య వ్యాఖ్యలు చెయ్యొద్దు: నాగచైతన్య › 10

తెలుగు అకాడమీ పుస్తకాలను ప్రామాణికంగా తీసుకోలేం!

అవి రన్నింగ్‌నోట్స్ మాత్రమే.. రెఫరెన్స్ పుస్తకాలేం కావు

హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో టీజీపీఎస్సీ › 11

బిడ్డర్లతో అధికారుల మిలాఖత్?

సివిల్ సప్లయ్‌పై ఆరోపణల వెల్లువ

35 లక్షల టన్నుల ధాన్యంలో బిడ్డర్లు ఎత్తింది 10 లక్షల టన్నులే › 11

అయినా గడువు పెంపు ఎందుకు?

మూసీది లూటిఫికేషన్

కాంగ్రెస్‌కు డబ్బుల కోసమే ప్రాజెక్టు.. రాహుల్ డైరెక్షన్‌లోనే బుల్డోజర్ రాజ్



దేశవ్యాప్తంగా ఎన్నికల్లో పోటీ చేయాలంటే కాంగ్రెస్‌కు డబ్బు కావాలి. కర్ణాటక నుంచి డబ్బు రావడం లేదు కాబట్టి కాంగ్రెస్‌కు మిగిలింది తెలంగాణ ఒక్కటే. ఇది ఆ పార్టీకి బంగారు బాతులా మారింది. అందుకే రిజర్వ్ బ్యాంక్‌గా మార్చుకునేందుకు రాహుల్ బావ రాబర్ట్ వాద్రా కూడా వచ్చి మూసీని చూసిపోయిండు. -కేటీఆర్

- కాంగ్రెస్‌కు బంగారు బాతులా తెలంగాణ
- పర్మిషన్లిచ్చిన అధికారుల తాట తీయాలి
- అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మూసీ అభివృద్ధి, హైడ్రాపై చర్చించాలి
- ప్రతి అంశంపై సీఎం, మంత్రుల తలో మాట
- దమ్మంటే మంత్రులు సెక్యూరిటీ లేకుండా మూసీ పరీవాహకంలో పర్యటించాలి
- కేంద్ర సమ్మతితోనే ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఓకే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ) : మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు కర్త, కర్మ, క్రియ అంతా రాహుల్ గాంధీయేని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. మూసీ బ్యూటిఫికేషన్ రేవంత్‌రెడ్డిది కాదని, ఇది రాహుల్ ప్రాజెక్టు అని, పైసల కోసం 'మూసీమే లూటో.. ఢిల్లీ మే బాంటో' అన్నట్టుగా రాహుల్ డైరెక్షన్‌లోనే నడుస్తున్న డ్రామా ఇదని కుండబద్దలు కొట్టారు. కాంగ్రెస్ పార్టీకి రిజర్వ్ › 3వ పేజీలో

కూల్చివేతల భయంతో ఆగిన గుండె

- ఇల్లు కూలుస్తరేమోనని ఆందోళనతో గుండెపోటు
- గోల్నాక న్యూతులసీ రాంనగర్‌లో వ్యక్తి మృతి
- ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనన్న విపక్షాలు



అంబర్‌పేట, అక్టోబర్ 2: మూసీ కూల్చివేతల భయం ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నది. కుటుంబానికి పెద్ద దిక్కును పొట్టన పెట్టుకున్నది. కూల్చివేతలకు ముందే ఆ కుటుంబం రోడ్డున పడింది. మొన్న కూకట్‌పల్లిలో హైడ్రా కూల్చివేతల భయంతో బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకుంటే.. తాజాగా, ఎక్కడ తన ఇంటిని కూల్చివేస్తారోనని గుండెపోటుతో మరణించాడో వ్యక్తి. అంబర్‌పేట మండల పరిధిలోని మూసీ పరివాహక ప్రాంతమైన న్యూ తులసీరాంనగర్(లంక)కు చెందిన గానద శ్రీకుమార్ (51) మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడికి ముగ్గురు సంతానం. గత కొన్ని రోజులుగా మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న ఇండ్లను › 3వ పేజీలో



గౌతమ్ అదానీతో పొంగులేటి భేటీ

- ఐటీసీ కోహినూర్‌లో మంతనాలు
- 2122రూమ్‌లో సాయంత్రం సమావేశం
- మీటింగ్‌ను గోప్యంగా ఉంచిన సర్కార్
- విడుదల కాని ఫొటోలు, ప్రెస్‌నోట్
- మీటింగ్‌లో పాల్గొన్న రాహుల్ వ్యూహకర్త

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రముఖ వ్యాపారవేత్త, బీజేపీతో సత్సంబంధాల ఆరోపణలున్న గౌతమ్ అదానీతో భేటీ అయినట్టు తెలిసింది. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లోని ప్రెసిడెన్షియల్ సూట్‌లో జరిగిన వీరి సమావేశ వివరాలు మీడియాకు వెల్లడి కాలేదు. అయితే, వీరిద్దరి మధ్య భేటీ జరిగిందని, సాయంత్రం 5:30 గంటలకు వీరిద్దరు సమావేశమైనట్టు సోషల్ మీడియా కోడై కూస్తున్నది. ఇది వ్యక్తిగత › 7వ పేజీలో

ఇల్లు ఖాళీ చేస్తే 25 వేల నజరానా



పారితోషికంతోపాటు డబుల్ బెడ్రూం ఇల్లు

మూసీ నిర్వాసితులకు సర్కార్ దసరా ఆఫర్

ప్రభుత్వమా? ప్రైవేటు సంస్థనా? అంటూ విమర్శలు › 3

ఇజ్రాయెల్ -హెజ్బొల్లా భీకర పోరు



- లెబనాన్ భూభాగంలోకి ఇజ్రాయెల్ సైన్యం
- ఇజ్రాయెల్‌పై 100 రాకెట్లతో హెజ్బొల్లా దాడి
- ఉద్రిక్తతలతో మూడో ప్రపంచ యుద్ధ భయాలు › 6



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్. చిత్రంలో మాలోత్ కవిత, తుల ఉమ

ఖబర్దార్ బిడ్డా.. నోరు జాగ్రత్త

- సురేఖా.. సంస్కారహీనంగా మాట్లాడొద్దు
- మహిళా మంత్రులను అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి దాడి
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఆగ్రహం
- సురేఖ నోటిని యాసిడ్‌తో కడగాలి
- మాజీ ఎంపీ మాలోత్ కవిత ఫైర్
- నువ్వేమైనా బ్రోకర్‌వా?
- బీఆర్ఎస్ నేత తుల ఉమ ధ్వజం

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర మంత్రి హోదాలో ఉన్న కొండా సురేఖ సంస్కారహీనంగా, సినిమా పరిశ్రమను కించపరిచేలా మాట్లాడారని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి బజారు భాషపై పరువునష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ఆమె తీరును మహిళలే అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు. 'ఖబర్దార్ బిడ్డా? నోరు జాగ్రత్త' అని సురేఖను హెచ్చరించారు. మహిళా మంత్రులను శిఖండిలా అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్‌పై రేవంత్‌రెడ్డి దాడి చేస్తున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణభవన్‌లో మాజీ ఎంపీ మాలోత్ కవిత, జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమతో కలిసి బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌ను ఉద్దేశించి మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు చెప్పారు. సినిమా పరిశ్రమలో ఉన్న మహిళలను కేటీఆర్‌కు అంటగడతారా? అని నిలదీశారు. ఇట్లాగే మాట్లాడితే కోర్టుకీడుస్తామని హెచ్చరించారు. సినిమాలు నిర్మించిన సురేఖ, సినీ పరిశ్రమ మహిళలపై చులకనగా మాట్లాడటం తగదని హితవుపలికారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలపై జరుగుతున్న దాడులపై మహిళా మంత్రులు కొండా సురేఖ, సీతక్క ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. హైడ్రా పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి పేదల ఇండ్లను కూలుస్తున్నారని, ప్రజలంతా బీఆర్ఎస్ వద్దకు వచ్చి తమ గోడు వెళ్లబోసుకుంటున్నారని, ఈ క్రమంలో బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణను ఓర్వలేక కేటీఆర్‌పై సురేఖ ఇష్టం వచ్చినట్టు మాట్లాడారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో మానుకోటలో కొండా సురేఖ ఏం మాట్లాడారో అందరికీ తెలుసని, ఆమె వ్యాఖ్యలపై సినిమా ఇండస్ట్రీలో ఉన్న మహిళలు స్పందించాలని కోరారు.అక్కలను నమ్ముకుంటే బతుకు బస్టాండ్ అవుతుందని సీఎం అసెంబ్లీలో అంటే మహిళా మంత్రులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

ఆమె నోటిని యాసిడ్‌తో కడగాలి: కవిత

కొండా సురేఖ వ్యాఖ్యల పట్ల ఓ మహిళగా తాను సిగ్గుపడుతున్నానని మాజీ ఎంపీ మాలోత్ కవిత తెలిపారు. కుటుంబాల మధ్య చిచ్చు పెడుతున్నారని, మంత్రి అహంకారంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నాగార్జున కుటుంబాన్ని, సమంతను ఎన్నిసార్లు రోడ్డున పడేస్తారని ప్రశ్నించారు. సురేఖ నోరును యాసిడ్‌తో కడగాలని విమర్శించారు. కేటీఆర్ గురించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని, ఉరికిచ్చి కొడతామని హెచ్చరించారు. సురేఖపై పరువునష్టం దావా వేస్తామని చెప్పారు. హైడ్రాతో పడిపోతున్న గ్రాఫ్‌ను కాపాడుకోవడం కోసం రేవంత్‌రెడ్డి కొండా సురేఖ, సీతక్కతో మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి గాని, కేటీఆర్‌పై మాట్లాడితే.. నాలుక చీరేస్తామని హెచ్చరించారు.

మహిళవై ఉండి మహిళలను కించపరుస్తవా?: తుల ఉమ

'నువ్వేమైనా బ్రోకర్‌వా? ఓ మహిళవై ఉండి సినిమా పరిశ్రమలోని మహిళలను ఎలా కించపరుస్తవ్? ఇతర మహిళల పేర్లు ఎలా ప్రస్తావిస్తవ్?' అని బీఆర్ఎస్ నాయకురాలు తుల ఉమ నిలదీశారు. కొండా సురేఖ చరిత్ర అందరికీ తెలుసని మండిపడ్డారు. సోషల్ మీడియాలో ఎవరో కామెంట్ పెడితే దొంగ ఏడుపులు ఎందుకు? దానికి కేటీఆర్‌పై ఆరోపణలు చేయడం ఎందుకు? అని నిలదీశారు. ట్రోల్ చేసిన వారిపై మీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. హైడ్రాతో ఇబ్బంది పడుతున్న ఆడబిడ్డల గోస కొండా సురేఖకు, సీతక్కకు కనిపించడం లేదా? అని నిలదీశారు.

కాంగ్రెస్ ఫాల్స్.. ఫ్లాప్ షో!

- పది నెలలుగా డైవర్షన్ రాజకీయం
- అదే కోవలో కొండా సురేఖ వ్యాఖ్యలు
- సర్కార్‌పై విమర్శలు వస్తే కొత్త వివాదం
- హైడ్రాపై వ్యతిరేకత నుంచి తప్పించుకోబోయి... సెల్ఫ్‌గోల్

హైదరాబాద్, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ): 'తప్పు చెయ్. దానిని కప్పి పుచ్చుకోవడానికి అంత కన్నా పెద్ద తప్పు చెయ్'- ఇదీ గత పది నెలలుగా సీఎం రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న పాలసీ. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్మాణాత్మక వైఖరిని కాకుండా డైవర్షన్ పాలిటిక్స్‌ను నమ్ముకొని పాలన సాగిస్తున్నారు. ఒక సమస్య వస్తే దానిని కప్పిపుచ్చేందుకు మరో సమస్యను సృష్టిస్తూ గందరగోళంలో ముంచుతున్నారనే విమర్శను ముఖ్యమంత్రి ఎదుర్కొంటున్నారు. తాజాగా మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కూడా ఈ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమనే వాదన వినిపిస్తున్నది. నిజానికి మంత్రి సురేఖను సోషల్‌మీడియాలో ట్రోల్ చేయడాన్ని మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతిరాథోడ్ సహా పలువురు నేతలు ఖండించారు. అటువంటి వాటిని వ్యక్తిగతంగా, బీఆర్ఎస్ పార్టీ పరంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. అయినా, కేటీఆర్ స్పందించలేదంటూ ఆయనపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యల వెనుక డైవర్షన్ పాలిటిక్స్ వ్యూహం దాగి ఉన్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

తక్షణ డైవర్షన్‌కు కారణమిదేనా?

మూసీ సుందరీకరణ, హైడ్రా కూల్చివేతలతో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. చివరకు పలువులు మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా అసహనం వ్యక్తంచేస్తున్నారు. బయట తిరగలేకపోతున్నామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 'తొందర పడి కూల్చొద్దని కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ చెప్పుండగా, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సైతం హైడ్రా అనంతర పరిణామాలపై సీఎం ఒంటెద్దు నిర్ణయాలు పార్టీకి తీవ్ర నష్టం చేస్తాయని ఆంతరంగిక చర్చల్లో అభిప్రాయపడినట్టు సమాచారం. మరోవైపు ప్రజా వ్యతిరేకతపై నివేదికలు అందుకున్న అధిష్ఠానం.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఢిల్లీకి పిలిపించుకుని మొట్టికాయలు వేసిందని గాంధీభవన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.



కరపత్రం వర్క్‌అవుట్ కాలేదనేనా?

హైడ్రాతో ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ పెద్దల పర్యవేక్షణలో మొన్నటికి మొన్న ఒక ప్రముఖ హీరోయిన్ చేసిన కామెంట్ అంటూ ఒక కరపత్రాన్ని సోషల్ మీడియాలోకి వదిలారు. అది వైరల్ అయినా కావాల్సినంత మైలేజ్ రాలేదు. దీంతో ఈసారి ఏకంగా మహిళా మంత్రినే రంగంలోకి దింపి, సినీ కుటుంబాల వ్యక్తిగత వ్యవహారాలను రాజకీయాల్లోకి లాగారనే చర్చ జరుగుతున్నది.

10 నెలలుగా డైవర్షన్ పాలిటిక్స్‌కు సాక్షాలివిగో..

గత సంవత్సరం డిసెంబర్ 7న కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరిన నాటినుంచి తాజాగా మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల దాకా పది నెలలుగా సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. వాటిలో మచ్చుకు కొన్ని..

- రూ.2 లక్షల రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. నిరసనలకు దిగారు. ఈ నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో ఇద్దరు మహిళా జర్నలిస్టులపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడులకు దిగారు. ఆ తరువాత నటుడు నాగార్జునకు చెందిన 'ఎన్' కన్వేషన్‌ను కూల్చివేశారు.
- బియ్యం కొనుగోలు వ్యవహారంలో రూ.1,100 కోట్ల కుంభకోణం జరిగిందనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఫోన్‌ట్యాపింగ్ కేసులో లీకులు వదిలి హడావుడి చేశారు. సచివాలయం ఎదురుగా తెలంగాణతల్లి విగ్రహం పెట్టాల్సిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీనిని తప్పుబడుతూ తెలంగాణ మేధో సమాజం రాహుల్‌గాంధీకి లేఖ రాసింది.
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా తన సొదరుడికి చెందిన స్వచ్ఛబయో సంస్థతో కుదుర్చుకున్న రూ.1,000 కోట్ల ఒప్పందం దుమారం రేపింది. వీటినుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీఆర్ఎస్ నేతలే టార్గెట్‌గా రాజీవ్‌గాంధీ వర్ధంతినాడు సీఎం అనుచిత వ్యాఖ్యలు చేసి ప్రజల దృష్టిని మళ్లించారు.
- రాష్ట్రంలో మహిళలపై దాడులు జరుగుతున్నాయని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అసెంబ్లీ సాక్షిగా సర్కార్ వైఫల్యాలను ఎండగడితే, వాటిపై సమాధానం చెప్పాల్సిందిపోయి 'ఆ ఇద్దరు అక్కలను నమ్ముకుంటే బతుకు జూబ్లీ బస్టాండే' అంటూ వ్యాఖ్యానించడం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడ్డారు.
- విద్యుత్తు కొనుగోళ్లపై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా 'మోటర్లకు మీటర్లు పెడ్తామని కేసీఆర్ సర్కార్ సంతకాలు చేసింది' అంటూ అసత్యాలు ప్రచారం చేశారు. సంబంధంలేని పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు విషయంలోనూ సభను తప్పుదారి పట్టించారు.


సమంతకు వెల్లువెత్తుతున్న మద్దతు

సినీ నటి సమంత విడాకుల విషయంలో మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. సురేఖ వ్యాఖ్యలను ఖండిస్తూ సమంత సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో పార్టీలకు, భావజాలాలకు అతీతంగా పలువురు సెలబ్రిటీలు, సామాజిక ఉద్యమకారులు సమంతకు మద్దతుగా నిలిచారు. సమంతపై మంత్రి చేసిన వ్యాఖ్యలతో మహిళల హక్కులు, వ్యక్తిగత గోప్యతపై చర్చ మొదలైంది. సమంత సొంత రాష్ట్రమైన తమిళనాడులో ఆమె అభిమానులు సోషల్‌మీడియా వేదికగా సురేఖను తిట్టిపోస్తున్నారు. రాజకీయంగా విభేదాలు ఉంటే ప్రతిపక్షాలతో పోరాడాలని, మధ్యలోకి సినీ నటిని తీసుకొచ్చి ఆమె వ్యక్తిత్వ హననానికి పాల్పడమేమిటని ప్రశ్నిస్తున్నారు. 'హైడ్రా, మూసీ కూల్చివేతలపై దృష్టి మళ్లించడం కోసం ఒక మహిళా మంత్రి.. మరో స్టార్ హీరోయిన్ వ్యక్తిగత జీవితంపై నిరాధారమైన ఆరోపణలు చేసి తన బుద్ధి ఎలాంటిదో మీడియా సాక్షిగా ప్రకటించింది' అని టీజీ సెక్రటేరియట్ మీడియా గ్రూప్‌లో విమర్శించారు. 'ఒక మహిళ అయి ఉండి, మరో మహిళ వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాల్లో లాగడం సిగ్గుమాలిన చర్య. ఆమె వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని సుమంతకు క్షమాపణ చెప్పాలి' అని శోభ అనే నెటిజన్ డిమాండ్ చేశారు.

గురి తప్పిన బాణం

కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్నట్టుగా తయారైంది.. కాంగ్రెస్ ప్రభుత్వ పరిస్థితి. హైడ్రా కూల్చివేతలు, మూసీ విధ్వంసంపై వ్యతిరేకత నుంచి దారి మళ్లించేందుకు చేసిన ప్రయత్నం దేశవ్యాప్త వివాదానికి దారితీసింది. సర్కారు తీరును ప్రశ్నిస్తున్న కేటీఆర్‌ను టార్గెట్ చేస్తే, బాణం గురితప్పి కాంగ్రెస్‌కు గుచ్చుకున్నది. తనను బీఆర్ఎస్ సోషల్‌మీడియాలో ట్రోల్ చేస్తున్నారంటూ రెండ్రోజుల కిందట కంటతడిపెట్టిన కొండా సురేఖ నాటకాన్ని రక్తి కట్టించారు. తాజాగా సమంత వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడటంతో సీన్ రివర్సయింది. సురేఖ తీరు వివాదాస్పదం కావడంతో అధిష్ఠానం సీఎంను వివరణ కోరినట్టు తెలిసింది.

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	39.3°c	23.5°c
మెదక్	39.2°c	20.8°c
ఖమ్మం	35.0°c	26.0°c
హైదరాబాద్	33.0°c	23.0°c
రంగారెడ్డి	32.4°c	24.2°c
కరీంనగర్	32.0°c	26.0°c
వరంగల్	32.0°c	26.0°c
నల్లగొండ	31.5°c	24.4°c
మహబూబ్‌నగర్	31.0°c	23.0°c
నిజామాబాద్	30.4°c	24.3°c

సురేఖ వ్యాఖ్యలపై సర్వత్రా ఆగ్రహం

వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని రాజకీయ, సినీ ప్రముఖుల డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకొని భేషరతుగా క్షమాపణ చెప్పాలనే డిమాండ్ సర్వత్రా వినిపిస్తున్నది. కేటీఆర్‌పై ఆమె చేసిన వ్యాఖ్యలపై ఓవైపు గులాబీ శ్రేణులు మండిపడుతుండగా మరోవైపు సినీ ప్రముఖులు అసహనం వ్యక్తంచేస్తున్నారు.

భేషరతుగా క్షమాపణ చెప్పాలి: హరీశ్‌రావు



కేటీఆర్‌కు మంత్రి కొండా సురేఖ భేషరతుగా క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆమె వ్యాఖ్యలను ఎక్స్‌వేదిగా ఖండించారు. 'వారి వద్ద సరైన సమాధానం లేనప్పుడే వ్యక్తిగత దూషణలకు దిగుతారు' అనే మార్గరెట్ థాచర్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా కోట్ చేశారు.

ఇవేం వ్యాఖ్యలు: ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి



రాష్ట్రమంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఓ ప్రముఖ నటి వ్యక్తిగత జీవితాన్ని ఇలా బజారుకీడ్చేలా మాట్లాడితే ఎలా? అని మంత్రి కొండా సురేఖను ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. 'ఆ సంగతి ఎవరు చెప్పారు? వాళ్ల విడాకుల పత్రంలో ఆ వివరాలున్నాయా?' అని ప్రశ్నించారు. 'ఎవరో ముక్కూముఖం తెలియని వాళ్లు ఏదో రాశారని బాధపడ్డారు. ఆ బాధ సహజమే. కానీ, సాటి మహిళలను మీరే గౌరవించనప్పుడు అదే గౌరవాన్ని ఆశించటం అత్యాశే కదా!' అని పేర్కొన్నారు. ఎవరో గిట్టని వాళ్లు కాదు స్వయంగా కాంగ్రెస్ వాళ్లే ప్రచారం చేయటం ఆశ్చర్యంగా ఉన్నదని, మహిళల శీలహననం ఎవరు చేసినా తప్పేనని స్పష్టంచేశారు. 'అధికార బాధ్యతల్లో ఉండి ఆదర్శంగా ఉండాల్సిన వాళ్లు ఏది మాట్లాడినా ఎదురు మాట్లాడవద్దు అంటే కుదరదు' అని తేల్చిచెప్పారు.

ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి: దేవీప్రసాద్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్



కేటీఆర్‌పై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని మహిళా సమాజానికి భేషరతుగా క్షమాపణ చెప్పాలి. సినీ రంగంలో ఉన్న మహిళా నటులపై మంత్రి కొండా సురేఖ చేసిన ఆరోపణలపై సినీరంగ పెద్దలు స్పందించాలి. మూసీ, హైడ్రా వల్ల వచ్చిన ప్రజా వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు చేస్తున్న ఈ హైడ్రామాను ప్రజలంతా గమనిస్తున్నారు. ఆమెను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి.

మూసీని మించి కాంగ్రెస్ కంపు

మొదటిపేజీ తరువాయి...

కుటుంబంలోకానీ, ఇటు కేటీఆర్ కుటుంబంలో మహిళలే లేనట్టు అత్యంత హీనంగా ఆమె మాట్లాడటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మూసీపాలైన రేవంత్ సర్కారు పరువు

కొండా సురేఖ వ్యాఖ్యలతో జాతీయస్థాయిలో కాంగ్రెస్ పరువు పోయింది. ఇప్పటికే మూసీ కూల్చివేతలతో జాతీయస్థాయిలో అపఖ్యాతిని మూటగట్టుకున్న రేవంత్ సర్కార్.. సురేఖ వ్యాఖ్యలు మరింత పరువును పోగొట్టుకున్నది. పదేండ్లు హుందాగా నడిచిన తెలంగాణ రాజకీయాల్లో.. గత పదినెలలుగా అభ్యంతరకర వ్యాఖ్యలు, జుగుప్సాకర భాష నిత్య కృత్యమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల నోటినుంచే అసహ్యకర వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. చట్టసభల్లోనూ చవకబారు మాటలు వినిపించాయి. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో రౌడీమూకల దాడుల సంస్కృతి, రాజకీయ హింస మొదలైంది. ప్రజాజీవితంలో ఉండీ, ప్రభుత్వ వైఫల్యాలను ధీటుగా ఎదుర్కొంటున్న బీఆర్ఎస్, కేటీఆర్ తదితర నేతలే లక్ష్యంగా ఈ వ్యక్తిగత దాడులు ప్రధానంగా కొనసాగాయి. వాటిలో మరీ దిగజారుడుగా కొండా సురేఖ వ్యాఖ్యలున్నాయి. మంత్రి వ్యాఖ్యలపై సభ్యసమాజం నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుంటే.. కొన్ని చానళ్లు మాత్రం కనీస ప్రమాణాలు పాటించకుండా ఆ వ్యాఖ్యల్ని అలాగే ప్రసారం చేశాయి. ఇదేం నీతిమాలిన జర్నలిజం? ఇవేం పాత్రికేయ ప్రమాణాలు?

హైకమాండ్ మందలింపు

సినీ హీరోయిన్లు, నాగార్జున కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టుగా తెలిసింది. ఈ విషయం తెలియడంతోనే అధిష్ఠానం పెద్ద ఒకరు నేరుగా కొండా సురేఖకు, పీసీసీ కీలక నేతకు ఫోన్ చేసి తీవ్రస్థాయిలో మందలించినట్టుగా సమాచారం. ఇప్పటికే మూసీ, హైడ్రాతో పార్టీని నాశనం చేస్తున్నారని, ఇది సరిపోనట్టుగా ఇప్పుడు సినీ ఇండస్ట్రీని కూడా పార్టీకి దూరం చేస్తారా.. ప్రజల్లో పార్టీని పలుచన చేస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తంచేసినట్టు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. ఈ వివాదాలతో అసలు పార్టీని ఏం చేయదలుచుకున్నారో చెప్పాలని నిలదీసినట్టుగా తెలిసింది. ఒక మహిళా మంత్రి అయి ఉండి..సాటి మహిళలపై అంత అసభ్యకరంగా, సంస్కారరహితంగా మాట్లాడటమేమిటని ప్రశ్నించారని, వ్యక్తిత్వంలేని వాళ్లను కేబినెట్‌లోకి ఎలా తీసుకున్నారని మండిపడ్డారని సమాచారం.

కొండా సురేఖ మెంటల్ హాస్పిటల్‌లో చేరాలె

- అక్కా నీ మానసిక పరిస్థితి బాగాలేదు
- అన్నం తింటున్నావా? గడ్డి తింటున్నావా?
- నువ్వేం దేవాదాయ శాఖ మంత్రివి?
- కొండాపై అక్కినేని అభిమానుల ఆగ్రహం
- సోషల్‌మీడియాలో కాంగ్రెస్‌పై చెడుగుడు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సినీ నటి సమంతపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను అక్కినేని అభిమానులు తీవ్రంగా వ్యతిరేకించారు. రాజకీయాల్లో రాణించడానికి ఇంత దిగజారుతావా? నువ్వేం దేవదాయ శాఖ మంత్రివి? అంటూ సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నువ్వు దేవాదాయశాఖ మంత్రిగా ఉండటం మా దురదృష్టం' అంటూ ధ్వజమెత్తారు. 'అక్కా నీ మానసిక పరిస్థితి బాగాలేదు. వెంటనే మీరు మెంటల్ హాస్పిటల్‌లో చేరండి' అంటూ దాడికుమార్ అనే నెటిజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి వెంటనే తొలిగించాలని భగవంత్‌రావు అనే నెటిజన్ డిమాండ్ చేశారు. 'చీ నువ్వు మినిస్టర్ ఎట్ల అయినవ్' అంటూ అనిల్ కుమార్ విమర్శించారు. 'పతివ్రత పరమాన్నం వండితే తెల్లారేదాక చల్లారలేదు అంట. విలువల గురించి కొండా సురేఖ మట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్టే. ఆమె భర్త మహిళా కార్పొరేటర్లను గెస్ట్ హౌస్‌లకు తీసుకునిపోయేవారు. ఈ ఘనకార్యాలన్నీ న్యూస్‌పేపర్లో వచ్చినవే' అని వరుణ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో నెటిజన్ వాట్ ఆర్ ద ఆడ్స్ అకౌంట్‌తో 'కొండా ఈజ్ ద బిగ్గెస్ట్ పొలిటికల్ క్రిమినల్ ఆఫ్ తెలంగాణ. షేమ్ ఆన్ హర్' అంటూ తీవ్రంగా స్పందించారు.

సినిమావాళ్లను ఏపీకి తరలించే కుట్ర

'చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కలిసి సినిమావాళ్లను ఏపీకి తరలించడానికి చేస్తున్న పెద్ద కుట్ర' అని నెటిజన్ ఆకుల సాయి తేజ తన పోస్టులో రాసుకొచ్చారు. మరో నెటిజన్ ఎస్ఎస్ పోస్టులో కొండా గారు అన్నం తింటున్నారా? గడ్డి తింటున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సబిత అనే నెటిజన్ స్పందిస్తూ..'ఒక ఆడదానివై ఉండి మహిళను కించపరిచేలా వ్యాఖ్యలు ఎలా చేయాలనిపించింది? మీరు కూడా అవే పనులు చేశారా?' అని మండిపడ్డారు.

మీడియా విచక్షణ కోల్పోయిందా?

టీఆర్పీ రేటింగ్ కోసం పోటీలు పడి ప్రసారం • మంత్రి సురేఖ వ్యాఖ్యల ప్రసారంపై విమర్శలు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): మీడియా విచక్షణ కోల్పోయింది. టీఆర్పీ రేటింగ్ కోసం రెచ్చిపోయింది. ప్రభుత్వం ఇచ్చే ప్రకటనల మాయలో పడి ఏది పడితే అది ప్రసారం చేస్తున్నదనే విమర్శలను నిజం చేసింది. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో దుమారం రేపుతున్నాయి. ఆమె వ్యాఖ్యలను ఎలక్ట్రానిక్ మీడియా యథాతథంగా ప్రసారం చేసింది. కొన్ని టీవీ చానళ్లు పోటీపడి బ్రేకింగ్ న్యూస్‌గా ప్రసారం చేశాయి. కొండా సురేఖ మహిళ అయితే.. సమంత, రకుల్‌ప్రీత్‌సింగ్ మహిళలు కారా? ఒక సంచలనం కోసం మరో సంచలనాన్ని పావుగా వాడుకోవచ్చా? అన్న ఇంగితాన్ని మరచి మీడియా ప్రసారం చేసింది. ఏ విషయంలోనూ స్పందించని సినీ పరిశ్రమ ఈ విషయంలో స్పందించింది. మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది.

కేటీఆర్ లీగల్ నోటీసులు

- రాజకీయ కక్షకు నా పేరు వాడుతున్నరు
- సినిమా నటుల పేరును వాడి వారి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నరు
- 24 గంటల్లోగా సురేఖ క్షమాపణ చెప్పకుంటే పరువు నష్టం దావా వేస్తా
- కిమినల్ కేసులను కూడా పెడతా
- కొండాకు పంపిన నోటీసులో కేటీఆర్



హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): తన ప్రతిష్ఠకు భంగం వాటిల్లేలా చేసిన వ్యాఖ్యల పట్ల 24 గంటల్లోగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంత్రి కొండా సురేఖకు బుధవారం లీగల్ నోటీసు పంపారు. క్షమాపణ చెప్పని పక్షంలో చట్టప్రకారం పరువు నష్టం దావా వేయడంతోపాటు క్రిమినల్ కేసులు పెడతానని హెచ్చరించారు. తాను మంత్రిగా ఉన్న కాలంలో ఫోన్ ట్యాపింగ్ చేశానని, నాగచైతన్య-సమంత విడిపోవడానికి ప్రధాన కారణం తానేనని, కొన్ని దురుద్దేశపూర్వక వ్యాఖ్యలు చేశారని, గౌరవానికి, ప్రతిష్ఠకు భంగం కలిగించాలన్న లక్ష్యంగానే అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని లీగల్ నోటీసులో పేర్కొన్నారు. కేవలం రాజకీయ కక్షతో, రాజకీయ ప్రయోజనాల కోసం తన పేరును సురేఖ వాడుకుంటున్నారని తెలిపారు. సినిమా నటుల పేరును వాడుకొని వారి వ్యక్తిత్వ హననానికి కూడా పాల్పడటం దురదృష్టకరం అని వెల్లడించారు. అసలు తనకు సంబంధమే లేని ఫోన్ ట్యాపింగ్, ఇతర అంశాలపై సురేఖ చేసిన వ్యాఖ్యలు అసత్యపూరితమని అన్నారు. ఎలాంటి సాక్ష్యాధారాలు చూపించకుండా అడ్డగోలుగా మాట్లాడిన సురేఖ ఒక మంత్రి అని, ఆమె చేసిన వ్యాఖ్యలను సాధారణ ప్రజలు నిజాలుగా భ్రమపడే అవకాశం ఉన్నదని చెప్పారు. మంత్రిగా తన సహచర అసెంబ్లీ సభ్యుడు అని సోయి కూడా లేకుండా సురేఖ మాట్లాడటం ఆశ్చర్యానికి గురిచేసిందని తెలిపారు. గతంలో ఇవే అడ్డగోలు మాటలు మాట్లాడిన సురేఖకు ఈ సంవత్సరం ఏప్రిల్‌లో నోటీసులు పంపించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇలాంటి అవాంఛనీయ వ్యాఖ్యలు చేసిన సురేఖకు భారత ఎన్నికల సంఘం గట్టి హెచ్చరిక చేసిందని, అయినా ఇలాంటి దురుద్దేశపూర్వక వ్యాఖ్యలను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. 24 గంటల్లోగా కొండా సురేఖ క్షమాపణ చెప్పకుంటే పరువు నష్టం దావాతోపాటు క్రిమినల్ కేసులు పెడతానని హెచ్చరించారు.

సీఎం నోరు ఫినాయిల్‌తో కడగండి: మహిళా మంత్రులకు కేటీఆర్ సూచన

సీఎం నోరును ఫినాయిల్‌తో కడగాలని మహిళా మంత్రులకు కేటీఆర్ సూచించారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి కూసిన కారు కూతలు, దౌగుల్బాజీ మాటలను గుర్తుచేసుకోవాలని సూచించారు. బుధవారం తెలంగాణభవన్‌లో మీడియా ఇష్టాగోష్ఠిలో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు కేటీఆర్ స్పందిస్తూ.. కొండా సురేఖ మీద ఎవరూ ఏమీ మాట్లాడలేదని, ఆమె ఏదో ఊహించుకొని మాట్లాడుతున్నారని, ఇందులో తమకేం సంబంధం ఉన్నదని ప్రశ్నించారు. మంత్రి సీతక్క గతంలో అభ్యంతరకరంగా చేసిన వ్యాఖ్యలనూ ఉదహరించారు.

కొండా సురేఖపై భగ్గుమన్న సినీలోకం

సురేఖపై రాహుల్‌కు అమల ఫిర్యాదు • నాగార్జునకు క్షమాపణ చెప్పాలి: కోన • కొండావి జుగుప్సాకర వ్యాఖ్యలు: రోజా

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సినీ నటి సమంతపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై సినీ నటులు, ఇతర ప్రముఖులు భగ్గుమన్నారు. ఆమె జుగుప్సాకర వ్యాఖ్యలంటూ తీవ్రంగా మండిపడ్డారు.

ఏంటీ సిగ్గులేని రాజకీయాలు?:



సమంత, నాగచైతన్య విడాకులపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఏంటీ సిగ్గులేని రాజకీయాలు...సినిమాల్లో నటించే ఆడవాళ్లంటే చిన్నచూపా? జస్ట్ ఆస్కింగ్' అని ఈసడించుకున్నారు. – సినీనటుడు ప్రకాశ్‌రాజ్

కొండా సురేఖపై చర్యలు తీసుకోండి



తెలంగాణ మహిళా మంత్రి కొండా సురేఖ చేసిన ప్రతీ వ్యాఖ్యను నేను తీవ్రంగా ఖండిస్తున్నా. ఆమె చేసిన వ్యాఖ్యలు చూసి షాక్ అయ్యా. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలి. అక్కినేని నాగార్జున కుటుంబంపై బాధ్యతారహిత, గౌరవాన్ని భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన సురేఖతో తక్షణం క్షమాపణలు చెప్పించాలి. కొండా సురేఖ తెలివిలేని మాటలను సినీ పరిశ్రమలోని ప్రతిఒక్కరు ఖండించాలి.

– కోన వెంకట్, సినీ నిర్మాత



సమంతను టార్గెట్ చేయడం దారుణం

రాజకీయ మైలేజీ కోసం ఓ మహిళా మంత్రి ప్రముఖ సినీనటి సమంతపై నిరాధారమైన ఆరోపణలు, వ్యాఖ్యలు చేయడం నీచమైన రాజకీయాలకు పరాకాష్ఠ. మహిళ అయి ఉండి మరో మహిళపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం.

– అక్షితా నందగోపాల్, పాత్రికేయురాలు

కొండా సురేఖ తీరుకు సిగ్గుపడుతున్న



అధికారం అనేది ఒక బాధ్యత. కొండా సురేఖ రాజకీయ వివాదాల్లోకి వాటితో ప్రమేయం లేని వ్యక్తులను లాగారు. అభియోగాలు నిజమైతే కేటీఆర్‌పై న్యాయపరమైన చర్యలకు ఎందుకు వెళ్లడం లేదు? మీ తీరును చూసి సిగ్గుపడుతున్న.


– వేణు ఉడుగుల, సినీ దర్శకుడు

సొంత ప్రయోజనాలకు సమంత పేరు



అనేక మంది, తెలుగు యూట్యూబ్ చానెళ్లు, మీడియాలు సమంత పేరును సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. వ్యూస్ ద్వారా డబ్బు సంపాదించడానికి చూస్తున్నారు. నవరాత్రి సమయంలో వారు తమ సొంత కర్మల కారణంగా దగ్ధమవ్వాలని కోరుకుంటున్నా.

–చిన్మయి శ్రీపాద, సినీ గాయని



తోటి మహిళపై హేయమైన వ్యాఖ్యలా?

సమంత, నాగచైతన్య విడాకులపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు హేయం. మంత్రి ఒక మహిళ అయి ఉండి తోటి మహిళపై హేయమైన వ్యాఖ్యలు చేయడం అభ్యంతరకరం. అక్కినేని కుటుంబంపై, సమంతపై చేసిన జుగుప్సాకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. నిరాధారమైన ఆరోపణలు, వ్యాఖ్యలు చేయడం నీచమైన రాజకీయాలకు పరాకాష్ఠ. సురేఖపై పెట్టిన అభ్యంతరకర పోస్టులను సమాజం వ్యతిరేకించింది. దీన్ని ఆసరా చేసుకొని తోటి మహిళపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి ఆమెకు మనసెలా వచ్చింది. రాజకీయ వివాదాల్లోకి సంబంధంలేని మహిళను తీసుకురావడం దుర్మార్గం. ఆ పనిని మహిళే చేయడం మరింత బాధిస్తున్నది. ఇలాంటి వేదనాభరిత పరిస్థితి నుంచి అక్కినేని కుటుంబం, సమంత మనోధైర్యంతో అధిగమిస్తారని ఆశిస్తున్నా.

– రోజా సెల్వమణి, ఏపీ మాజీ మంత్రి



రెడ్‌మార్క్ ఇండ్ల వైపు జేసీబీలు?

- మూసీ కూల్చివేతల శిథిలాల తరలింపునకు ఏర్పాట్లు
- 3 దారులపై ఫోకస్.. ఎవరికంటా పడకుండా ప్లాన్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): మూసీ వెంట పేదల ఆర్తనాదాలు ఒకవైపు కొనసాగుతుండగా, అధికారులు.. పేదల ఇండ్ల కూల్చివేతలను మరో వైపు కొనసాగిస్తున్నారు. హిమాయత్‌నగర్, సైదాబాద్ పరిధిలో మంగళవారం అధికారులు 150 ఇండ్లను నేలమట్టం చేశారు. వివిధ ప్రాంతాల్లో మరో 940 ఇండ్లకు రెడ్‌మార్క్ కత్తి వేలాడుతున్నది. కూల్చేసిన ఆ 150 ఇండ్ల శిథిలాల తరలింపునకు అధికారులు జేసీబీలను రంగంలోకి దించుతున్నారు. హిమాయత్‌నగర్, సైదాబాద్‌లో కూల్చేసిన ఆ నిర్మాణాల వరకు జేసీబీలు వెళ్లే రోడ్లు లేవు. ఇరుకు రోడ్లతో ఆయా ప్రాంతాలు ముడిపడి ఉన్నాయి. రెడ్‌మార్క్ నిరాకరించిన ఇండ్లను సైతం కూలగొట్టినా జేసీబీలు అక్కడి వరకు వెళ్లలేని పరిస్థితి ఉన్నది. ఈ దశలో శిథిలాల తరలింపునకు జేసీబీలు మూసీలోకి ఎంట్రీ ఇస్తే నిర్వాసితులు అడ్డుకుంటారన్న అనుమానాలు బలంగా ఉన్నాయి. దీంతో అధికారులు రహస్య దారులను పరిశీలిస్తున్నారు. అందుకోసం మూడు మార్గాలను ఎంచుకున్నట్టు తెలిసింది. ఇమ్లీబన్ బస్టాండ్ నుంచి అర కిలోమీటర్ మూసీ మార్గాన్ని అధికారులు పరిశీలించినట్టు తెలిసింది. పురానాపూల్ నుంచి ఒకటిన్నర కిలోమీటరు దూరంతో మూసీ వెంట దారిని కూడా పరిశీలించినట్టు తెలిసింది. ఇంకోవైపు ముసారంబాగ్ నుంచి అంబర్‌పేట్ బ్రిడ్జి మీదుగా ఆ ప్రాంతాలకు చేరుకునేలా ప్లాన్ చేస్తున్నట్టు తెలిసింది. జేసీబీలు శిథిలాల తరలింపుతోపాటు రెడ్‌మార్క్ చేసిన ఇతర నిర్మాణాలనూ కూల్చేయనున్నట్టు ఓ అధికారి తెలిపారు. అయితే అక్కడి పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని ఆయన సెలవిచ్చారు.

మూసీది లూటిఫికేషన్

మొదటిపేజీ తరువాయి...

బ్యాంక్‌గా మార్చుకునేందుకే దీన్ని చేపట్టారని, రాహుల్ బావ రాబర్ట్ వాద్రా కూడా వచ్చి మూసీని చూసిపోయారని చెప్పారు. ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీకి డబ్బు కావాలని, కర్ణాటక డిప్యూటీ సీఎం తనకు సీఎం పదవి ఇస్తేనే డబ్బులిస్తా అంటున్నాడని, ఇక మిగిలింది తెలంగాణే కాబట్టి మూసీపై కన్నేశారని, 'ఇది బ్యూటిఫికేషన్ కాదు.. కచ్చితంగా లూటిఫికేషన్' అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసలు పేదల ఇండ్లపైకి బుల్డోజర్ పంపిస్తున్నదే రాహుల్ గాంధీ అని నిప్పులు చెరిగారు. హర్యానా, యూపీలో బుల్డోజర్ మంచిది కాదంటూనే రాహుల్ గాంధీ తెలంగాణలో బుల్డోజర్ పంపిస్తున్నాడని విమర్శించారు. మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డితో కలిసి కేటీఆర్ బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడారు. మూసీ సుందరీకరణకు 1.50 లక్షల కోట్ల ప్రతిపాదన ఎలా వచ్చిందో చెప్పాలని రేవంత్‌రెడ్డిని నిలదీశారు. ఇదివరకే ఎస్టీపీలు, బ్రిడ్జి పనులు చేపట్టామని, అయినా లక్షన్నర కోట్లు ఎందుకో చెప్పాలని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌కు రిజర్వ్ బ్యాంకు

మూసీలో పెద్ద ఎత్తున డబ్బులు లూటీ చేసేందుకు.. కాంగ్రెస్‌కు రిజర్వ్ బ్యాంక్‌గా మార్చుకునేందుకు రేవంత్‌రెడ్డి పేదల కడుపులు కొడుతూ లక్షలాది మందిని నిరాశ్రయులను చేస్తూ నిర్దయగా వ్యవహరిస్తున్న తీరును తెలంగాణ సమాజం గమనిస్తున్నదని కేటీఆర్ చెప్పారు. కాళేశ్వరం వివరాలపై అసెంబ్లీలో 3 గంటలపాటు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చామని గుర్తుచేశారు. మూసీ సుందరీకరణ వల్ల ఉపయోగాలపై కనీసం 3 నిమిషాలైనా చెప్పేటోడు ఉన్నాడా? అంటూ నిలదీశారు. అసలు ప్రాజెక్టు స్వరూపం ఎలా ఉంటుందో చెప్పేటోడు లేడని ఆగ్రహం వ్యక్తంచేశారు.

సీఎం, మంత్రులకు సయోధ్యలేదు

ముఖ్యమంత్రికి, మంత్రులకు సయోధ్య లేనట్టు ఉన్నదని కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. సీఎం, మంత్రుల ప్రకటనలు, మీడియా సమావేశాలను చూస్తే ఇదే అర్థమవుతుందన్నారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రూ.1.50 లక్షల కోట్లని ఎవరు చెప్పారని అడుగుతున్నారని, ఆ అభినవ జోసెఫ్ గోబెల్స్ ఎవరంటే ఎనుముల రేవంత్‌రెడ్డేనంటూ ఎద్దేవాచేశారు. గోపనపల్లి ఫ్లై ఓవర్ ఓపెనింగ్ రోజు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డే చెప్పారని స్పష్టం చేశారు. సీఎం ఆగస్టు 15నే రుణ మాఫీ అయిందని ప్రకటించాడని, అక్టోబర్ 1న వ్యవసాయ శాఖ మంత్రి మాత్రం ఇంకా రుణమాఫీ పూర్తి కాలేదని చెప్పాడన్నారు. సీఎం ఫార్మాసిటీ రద్దు అని ప్రకటిస్తాడని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హైకోర్టులో ఫార్మాసిటీ రద్దు కాలేదని చెప్తూ మభ్య పెడుతున్నారని విమర్శించారు. మంత్రులకు శాఖల మీద పట్టు, అవగాహన లేదని, ముఖ్యమంత్రితో సమన్వయం లేదని చెప్పారు. మంత్రివర్గ విస్తరణ కూడా పూర్తిగా చేసుకోలేని దద్దమ్మ ఈ ముఖ్యమంత్రి అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకపడ్డారు.

త్వరలో మూసీ సమగ్ర వివరాలు..

కేసీఆర్ ప్రభుత్వంలో రూ.16వేల కోట్లతో మూసీని ఎలా అభివృద్ధి చేయాలనుకున్నామో త్వరలోనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెల్లడిస్తానని కేటీఆర్ తెలిపారు. ఎస్టీపీలు కట్టాలనుకొని కొన్ని కట్టామని, నాగోల్ పరిధిలో సుందరీకరణ కూడా చేశామని చెప్పారు. రూ.1100 కోట్లతో కొండపోచమ్మ నుంచి గండిపేట జలాశయానికి గోదావరి జలాలను తెచ్చేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. మూసీ బాధితుల నుంచి 40, 50 లంచ్ మోషన్లు వచ్చినట్టు జస్టిస్ లక్ష్మణ్ స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. 1.50 లక్షల కోట్లు, లక్షల మంది నిరాశ్రయుల వ్యవహారంపై సీఎం ఎందుకు మాట్లాడటం లేదని, ఢిల్లీకి 23 సార్లు పోయి కనీసం 23 రూపాయలైనా తెచ్చావా? అని ప్రశ్నించారు. ఖమ్మం, మహబూబాబాద్ వరద బాధితులకు ఇప్పటికీ రూపాయి కూడా ఇవ్వలేదని, ప్రభుత్వం పని తీరు ఎలాఉన్నదో చెప్పేందుకు ఇదొక ఉదాహరణ అని చెప్పారు.

కిలోమీటర్‌కు 2700 కోట్లా?

'2400 కిలోమీటర్ల నమామి గంగే ప్రాజెక్టు కిలోమీటర్‌కు రూ.17 కోట్లు ఖర్చయితే మూసీకి కిలోమీటర్‌కు రూ.2700 కోట్లు అవుతాయా? ఇది స్కాం కాకపోతే మరేమిటి?' అని కేటీఆర్ ప్రశ్నించారు. దమ్ముంటే, చేతనైతే మూసీ పరీవాహక ప్రాంతంలో ఇండ్లకు అనుమతులిచ్చిన అధికారుల తాట తీయాలంటూ రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. 2048 వరకు ఈఎంఐ ఉన్నదని, తాను గర్భవతినని, తన ఇల్లు కూల్చితే ఈఎంఐ ఎవరు కట్టాలని, తన కుటుంబం, పుట్టబోయే బిడ్డ పరిస్థితి ఏమిటని ఓ మహిళ ఆందోళన వ్యక్తం చేసిందని, ఈఎంఐలపై బ్యాంకులతో ప్రభుత్వం ఏమైనా మాట్లాడుతుందా? అని ప్రశ్నించారు. మూసీపై దొంగ చాటుగా వచ్చి సర్వేలు చేసిపోతున్నట్టు ప్రజలు చెప్తున్నారన్నారు. అక్కడ కంపెనీలు పెడుతామని చెప్పిన ఒక్క కంపెనీ పేరైనా చెప్తారా? అని నిలదీశారు. హైడ్రా దెబ్బకు రియల్ ఎస్టేట్ దెబ్బతిన్నదని, రిజిష్ట్రేషన్ల ఆదాయం కుదేలైన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు.

కేంద్ర పెద్దల సమ్మతితోనే ఆమోదం

కేంద్రం సమ్మతితోనే హైడ్రాకు అధికారాలిస్తూ ప్రభుత్వం ప్రతిపాదించిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదముద్ర వేశారని కేటీఆర్ చెప్పారు. శాసనసభలో అభిప్రాయాలు తీసుకోవాలనే సంస్కారం లేకుండా, హడావుడిగా ఆర్డినెన్స్ ఎందుకు తెచ్చారని నిలదీశారు. ఇప్పటికైనా సమావేశాలు పెట్టి ప్రజలు, ప్రతిపక్షాల సందేహాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో చిన్న పిలగాడు పిలిచినా వస్తానని రాహుల్ గాంధీ చెప్పాడని, మరిప్పుడు ఏడని ప్రశ్నించారు.



మూసీ పరీవాహక ప్రాంత బాధితురాలు దుఃఖభారంతో వెళ్లబోసుకుంటున్న గోడును ఆసక్తిగా వింటున్న కేటీఆర్. చిత్రంలో మధుసూదనాచారి, జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు

> మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. కచ్చితంగా లూటిఫికేషన్.. ఈ ప్రాజెక్టు రేవంత్‌రెడ్డిది కాదు.. రాహుల్ ప్రాజెక్టు. పేదల ఇండ్లపైకి బుల్డోజర్ పంపిస్తున్నదే రాహుల్ గాంధీ.. -కేటీఆర్

దమ్ముంటే మంత్రులు మూసీ ప్రాంతాలకు వెళ్లాలి

మల్లన్న సాగర్ కట్టినప్పుడు పునరావాస కాలనీ కట్టి వారిని అక్కడికి తరలించి ప్రాజెక్టు మొదలు పెట్టామని కేటీఆర్ గుర్తుచేశారు. మూసీపై కనీసం ప్రజాభిప్రాయ సేకరణ చేయలేదని, సోషల్, పర్యావరణ సమస్యపై సర్వేలైనా చేశారా? అంటూ ప్రశ్నించారు. హైదరాబాద్‌లో కిర్లోస్కర్ కమిటీ 28వేల అక్రమణలు ఉన్నాయని నివేదిక ఇచ్చిందని, మూసీలో మరో 12 వేల అక్రమణలు ఉన్నాయని తేలిందని, వారికి పునరావాసం లేకుండా ప్రాజెక్టు చేపట్టడం సరికాదన్న ఉద్దేశంతోనే పక్కకు పెట్టామని చెప్పారు. మంత్రులు సెక్యూరిటీ లేకుండా మూసీ ప్రాంతాల్లో పర్యటించాలని సవాల్ విసిరారు. కూల్చివేస్తున్న ఇండ్ల నుంచి వసూలు చేసిన పన్నులన్నీ వాపస్ ఇస్తారా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకే లక్ష కోట్లు కాలేదని, మూసీకి రూ.1.50లక్షల కోట్లు ఎలా అవుతాయంటూ నిలదీశారు.

రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడడు?

తనకు తెలిసినంత వరకు మూసీపై ప్రభుత్వం దగ్గర ఎలాంటి రిపోర్ట్ లేదని చెప్పారు. దీనిపై కేంద్రబడ్జెట్‌లో నిధులివ్వలేదని అసెంబ్లీలో చర్చ జరిగినప్పుడు అడిగానని గుర్తుచేశారు. ఆ రోజు మాట్లాడటానికి సీఎం భయపడ్డారని, అయినా మోదీకి వ్యతిరేకంగా మాట్లాడలంటే రేవంత్‌కు భయమని, ఆ రోజే తాము సీఎం ఎందుకు మాట్లాటంలేదని అడిగినా స్పందించలేదని గుర్తుచేశారు. ఆ రోజు డిప్యూటీ సీఎం భట్టిని అడ్డంపెట్టి మాట్లాడించారని చెప్పారు. నమామి గంగేకు నిధులిస్తారు, మూసీ సుందరీకరణకు ఇవ్వలేదని భట్టి ఆరోపించారని, ఆ సందర్భంగా తాను మూసీ డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించారా? అని అడిగితే, డీపీఆర్ సమర్పిస్తే కదా డబ్బు ఇచ్చేది, డీపీఆర్ సిద్ధమవుతున్నది అని చెప్పినట్టు గుర్తుచేశారు.

> 2,400 కిలోమీటర్ల నమామి గంగే ప్రాజెక్టు కిలోమీటరుకు రూ.17 కోట్లు ఖర్చయితే.. మూసీ సుందరీకరణలో కిలోమీటరుకు రూ.2700 కోట్లు అవుతాయట! ఇది స్కాం కాకపోతే మరేంటి? దీన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలో ముఖ్యమంత్రి, మంత్రి చెప్పాలి -కేటీఆర్

పేదలంటే కాంగ్రెస్‌కు కోపమా?

- ఇండ్ల కూల్చివేతపై పునరాలోచించాలి
- అమానవీయ పాలనపై గాంధీలు స్పందించాలి
- మహాత్మాగాంధీ, శాస్త్రి జయంతి వేడుకల్లో కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పట్ల అమానవీయంగా, కర్కశంగా వ్యవహరిస్తుండటం బాధాకరమని బీఆర్‌ఎస్ వర్కింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై ఢిల్లీలో ఉన్న ప్రస్తుత గాంధీలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ స్పందించాలని, డీపీఆర్ అనేది లేకుండా ఇండ్లు కూలగొట్టే దుర్మార్గమైన ప్రయత్నాలను విరమింపచేయాలని విజ్ఞప్తి చేశారు. జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా బుధవారం తెలంగాణభవన్‌లో వారి చిత్రపటాలకు కేటీఆర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సమాజంలో ఉండే అత్యంత బలహీనమైన వ్యక్తిని, ఆ సమాజం, ఆ ప్రభుత్వం ఎట్లా ఆదరిస్తున్నాయనే దాని ని బట్టి ఆ ప్రభుత్వ గొప్పతనం తెలుస్తుందని మహాత్మాగాంధీ చెప్పారని గుర్తుచేశారు. తన సత్యాగ్రహంతో భారతజాతినే కాకుండా ప్రపంచాన్ని మేల్కొల్పిన గొప్ప మహనీయుడు మహాత్మాగాంధీ అని స్మరించుకున్నారు. అమెరికాలో మార్టిన్ లూథర్ కింగ్, దక్షిణాఫ్రికాలో నెల్సన్ మండేలా లాంటి నాయకులతోపాటు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చిన గొప్ప వ్యక్తి మహాత్మాగాంధీ అని పేర్కొన్నారు. ప్రభుత్వాలు సమాజంలోని బలహీనుల పట్ల కర్కశత్వంతో వ్యవహరించొద్దని చెప్పారు. ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించింది నిర్మాణాత్మక పనుల కోసమే కానీ, విధ్వంసం సృష్టించేందుకు కాదనే విషయాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలుసుకోవాలని హితవు చెప్పారు. పేదలంతా బాధపడుతున్నారని, ఇండ్లు కూలగొట్టలేమంటూ కూలీలు తిరిగి వెళ్ళిపోయారని పేర్కొన్నారు. తాము రెండున్నర లక్షల ఇండ్లు కడితే, మిమ్మల్ని 5 లక్షల ఇండ్లు కట్టమని ఓటేశారు తప్ప ఉన్న ఇండ్లను కూలగొట్టేందుకు కాదని కేటీఆర్ తెలిపారు. ఇండ్ల కూల్చివేతపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని, మానవత్వంతో ముందడుగు వేయాలని కోరారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రధాన ప్రతిపక్ష నేత ఎస్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, అనిల్ జాదవ్, మాజీ ఎంపీలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, భాస్కర్‌రావు, కోరుకంటి చందర్, జడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు దేవీప్రసాద్, గజ్జెల నగేశ్, చిరుమళ్ల రాకేశ్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, కిశోర్‌గౌడ్, బాలరాజు యాదవ్, వాసుదేవరెడ్డి, మేడె రాజీవ్‌సాగర్, బీఆర్‌ఎస్ నేతలు తుంగ బాలు, కడారి స్వామియాదవ్ పాల్గొన్నారు.

> గతంలో 16వేల కోట్ల అంచనాతో ప్రతిపాదనలు రూపొందించినం. మూసీ సుందరీకరణలో భాగంగా ఎస్టీపీలు కట్టాలనుకున్నం.. కొన్ని చోట్ల కట్టినం. నాగోల్ ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల పరిధిలో సుందరీకరణ చేసినం. మూసీపై మా విజన్ ఏంటో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అతి త్వరలో వివరాలు వెల్లడిస్తా. -కేటీఆర్



గానద శ్రీకుమార్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి

మూసీ ఒడ్డున ఆగిన మరో గుండె

మొదటిపేజీ తరువాయి...

కూల్చివేస్తారన్న ప్రచారం జోరుగా సాగుతుండడంతో కుమార్ మనోవేదనకు గురవుతున్నాడు. నాలుగైదు రోజులుగా తిండి మానేశాడు. తీవ్ర మనస్థాపానికి లోనయ్యాడు. బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఛాతీలో నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు చెప్పడంతో వెంటనే అంబులెన్స్‌లో దవాఖానకు తీసుకెళ్తుండా, మార్గమధ్యంలోనే గుండెనొప్పి వచ్చి చనిపోయాడు. మూసీ కూల్చివేతలు ఏమో కానీ.. ప్రభుత్వం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకున్నదని బస్తీవాసులు ఆరోపించారు.

ప్రభుత్వ హత్యే: జూలకంటి రంగారెడ్డి

న్యూతులసీరాంనగర్ (లంక)లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పర్యటించారు. మూసీ బాధితులను పరామర్శించి ప్రజల బాధలను అడిగి తెలుసుకున్నారు. శ్రీకుమార్ ఇంటికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూల్చివేతలతో ఆందోళన చెందిన శ్రీకుమార్ చనిపోయాడని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అని అన్నారు. కుమార్ కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పేదల ఇండ్ల కూల్చివేతకు వ్యతిరేకం

పేదల ఇండ్ల కూల్చివేతకు సీపీఎం వ్యతిరేకమని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి స్పష్టం చేశారు. సీపీఎం హైదరాబాద్ సౌత్‌కమిటీ ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్‌లోని మూసానగర్, శంకర్‌నగర్‌లో ప్రభుత్వం కూల్చివేతలు చేపట్టిన ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వ కండ్లుతెరచి పేదలకు న్యాయం చేయాలని, లేకుంటే పోరాటాడుతామని హెచ్చరించారు.

మూసీ బాధితులకు అండగా..

- కోర్టుల్లో మీ కోసం మా లీగల్ సెల్ న్యాయపోరాటం
- బాధితులు రూపాయి కూడా ఖర్చు చేసుకోవాల్సిన అవసరం లేదు
- బాధితులకు న్యాయం జరిగేదాకా అండగా పోరాడుతాం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా
- కిషన్‌బాగ్, బహదూర్‌పుర, లంగర్‌హౌస్ బాధితులకు హామీ
- పెద్దసంఖ్యలో తెలంగాణభవన్‌కు తరలివచ్చిన బాధితులు



బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ లీగల్ సెల్ ప్రతినిధులు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మూసీ బాధితులకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా నివాసాలు, ఇండ్లస్థలాలు కోల్పోతున్న బాధితుల పక్షాన తమ పార్టీ లీగల్ సెల్ కోర్టుల్లో న్యాయపోరాటం చేస్తుందని చెప్పారు. బాధితులు రూపాయి కూడా వ్యక్తిగతంగా ఖర్చు పెట్టుకోవద్దని చెప్పారు. మూసీ తీరం వెంట ఇండ్లు, స్థలాలు, ఆస్తులు కోల్పోతున్న కిషన్‌బాగ్, బహదూర్‌పుర, లంగర్‌హౌస్ ప్రాంతాలకు చెందిన బాధితులు బుధవారం తెలంగాణ భవన్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పలువురు బాధితులు కేటీఆర్‌కు తమ గోడును వెళ్లబోసుకొని కన్నీటి పర్యంతమయ్యారు. బాధితులను ఓదార్చిన కేటీఆర్.. బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ ఏటీఎంగా మార్చుకున్నదని, న్యాయస్థానంలో దానికి సరైన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ లీగల్ సెల్ సభ్యులు ముఖేశ్ చందా, సోఫియా, సిద్ధిఖీ, ఖుషీ తదితరులు బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం తెలంగాణ భవన్‌లోనే బాధితులకు భోజన ఏర్పాట్లుచేశారు.

> మీ తరఫున బీఆర్‌ఎస్ పార్టీ లీగల్ టీం కోర్టుల్లో కొట్లాడుతుంది. అవసరమైతే లంచ్ మోషన్ పిటిషన్ కూడా వేస్తాం. మీకు న్యాయం జరిగేవరకు మీ తరఫున మా పార్టీ పోరాడుతుంది. - కేటీఆర్

మా బతుకులు అడ్డమీది కూలీల్లా అధ్వానం



డబుల్ బెడ్రూం ఇండ్లను నలుగురికి కేటాయిస్తున్నారు. మేము అక్కడికి వెళ్తే అక్కడున్న వాళ్లు మమ్మల్ని కొట్టి బయటకు తరిమేస్తున్నరు. పురానాపూల్ నుంచి జియాగూడ వరకు మావాళ్ల ఇండ్లు ఎన్నో పోతున్నాయి. ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి. పునరావాసం కల్పించాలి. కానీ, అక్కడికెళ్లండి.. ఇక్కడికెళ్లండి అని తరుముతున్నరు. మా బతుకులు అడ్డమీది కూలీల కంటే అధ్వానమైనయి. అసలు మా పరిస్థితి ఏమిటో ప్రభుత్వం చెప్పాలి.

-ఫాతిమా బేగం, బహదూర్‌పుర



20 ఏండ్ల క్రితమే మా ఇంటికి రిజిస్ట్రేషన్

20 ఏండ్ల క్రితమే మా ఇంటికి రిజిస్ట్రేషన్ ఉన్నది. ఇంటి పన్ను, కరెంట్, నల్లా బిల్లులూ కడుతున్నాం. మున్సిపాలిటీ సహా ఇతర అన్నింటిలోనూ పన్నులు కడుతూ వస్తున్నాం. ఇప్పుడు ఆ డబ్బు ఎవరిస్తరు? బీఆర్‌ఎస్ ఉన్నప్పుడు పదేండ్లు ఏనాడూ, ఏ పరేషాన్ లేదు. నేడు రేవంత్‌రెడ్డి ఇల్లు కూల్చి మమ్మల్ని రోడ్డున పడేశాడు. మమ్మల్ని కబ్జాదారులు అంటున్నడు. రేవంత్‌రెడ్డి మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నడు. ఆయనకు కోర్టులోనే జవాబు చెప్తం. వదిలిపెట్టం.

-సాధికాబేగం, కిషన్‌భాగ్



నాలుగైదు రోజులుగా నిద్రపట్టడంలేదు

మా కండ్ల ముందే మా ఇల్లు పోతుంటే తట్టుకోలేకపోతున్నాం. నాలుగైదు రోజుల నుంచి నిద్ర కూడా పట్టడంలేదు. ఉదయం నుంచి సాయంత్రం దాకా పడిగాపులు పడుతున్నాం. మాకు ఎవ్వరూ భరోసా ఇవ్వడం లేదు. ఓట్లు వేసి గెలిపించిన ముఖ్యమంత్రి ఎవరి కోసం పనిచేస్తున్నడు. మాకు ఇంత అన్యాయం చేస్తడా? ఓట్లప్పుడు ఎంఐఎం నాయకులు ఇండ్ల చుట్టూ తిరిగారు. ఇప్పుడు ఎటుపోయారు. రూపాయి రూపాయి కూడబెట్టి బంగారం మొత్తం అమ్మి ఇల్లు కొన్నాం.

-మల్లికరజ్విక్, మొఘల్‌నగర్



మాయి పక్కా పట్టా భూములు

మూసీ నది వెంట 1940, 1976 సంవత్సరాల నాటి గ్రామాల మ్యాప్‌లు ఉన్నాయి. టీపన్లు ఉన్నాయి. డబ్బు పెట్టి మేము రిజిస్ట్రేషన్ చేసుకున్నాం. ఇండ్లు కట్టుకున్నాం. మాయన్నీ పక్కా పట్టాభూములు. మా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. ఒకవేళ ప్రభుత్వం మా భూములను తీసుకోవాలనుకొంటే సర్కారు నిబంధనల ప్రకారం మాకు పరిహారం చెల్లించాలి. పునరావాసం కల్పించాలి. కానీ, అలాంటిదేమీ చేయకుండా మమ్మల్ని కబ్జాకోరులుగా చిత్రీకరించడాన్ని మేము సహించం.

-ముస్తఫా, కిషన్‌బాగ్


ప్రభుత్వమా? ప్రైవేటు కంపెనీయా?!

- ఇల్లు ఖాళీ చేస్తే రూ.25 వేల నజరానా
- పారితోషికంతోపాటు డబుల్ బెడ్రూం ఇల్లు
- మూసీ నిర్వాసితులకు సర్కార్ దసరా ఆఫర్
- హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వెల్లడి



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): ఏండ్ల తరబడి నివాసముంటున్న ఇల్లునొదిలి వెళ్లిపోతే రూ.25వేల పారితోషికం ఇస్తాం.. అనే ప్రకటన ఎప్పుడైనా విన్నారా? చూశారా? మూసీ నిర్వాసితులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇస్తున్న దసరా ఆఫర్ ఇది. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారికంగా ప్రకటించారు. 'మూసీ పరివాహక ప్రాంతంలోని వారు స్వచ్ఛందంగా మరో ప్రాంతానికి తరలివెళ్తే.. ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లుతోపాటు రూ.25వేల పారితోషికాన్ని ప్రభుత్వం ఇస్తుంది' అంటూ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సాధారణంగా ఏదైనా ప్రాజెక్టు చేపట్టినప్పుడు జరిగే భూసేకరణకు ఒక విధానం ఉంటుంది. నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపించి వారిని ఒప్పించాలి. కానీ మూసీ విషయంలో రేవంత్ సర్కార్ బుల్డోజర్లను మాత్రమే నమ్ముకున్నది. రెడ్ మార్కింగ్ శాస్త్రీయం గా జరుగలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక నిర్వాసితులను రాత్రికి రాత్రి ఇండ్లు ఖాళీ చేయాలంటూ దౌర్జన్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వం ఒక ప్రైవేటు కంపెనీలా ఆఫర్లు ప్రకటించిందనే విమర్శలు వస్తున్నాయి. మూసీ నిర్వాసితులకు ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయంలో మౌలిక వసతులు లేవు. కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ఆ ఇండ్లకు మౌలిక వసతులు కల్పించడంలో రేవంత్ సర్కారు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించింది. ఇప్పుడు రాత్రికిరాత్రి నిర్వాసితులకు ఇండ్లు కావాల్సి ఉండటంతో వారిని అందులోకి పంపుతున్నది. ఒక్కసారి నిర్వాసితులు పట్టా పుచ్చుకొని డబుల్ బెడ్రూం ఇండ్లవైపు కదిలితే.. ఇక సర్కారు తీరు 'ఓడ మల్లన్న.. బోడి మల్లన్న'గా తయారవుతుందని పలువురు అనుమానిస్తున్నారు.


మా ఇండ్లపై కాంగ్రెస్ దిష్టి పోవాలి



మూసీ నది చుట్టూ ఇండ్ల కూల్చివేతలు చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కొత్తపేట డివిజన్‌లోని న్యూమారుతినగర్ నార్త్ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ ఇండ్లపై కాంగ్రెస్ దిష్టి పోవాలని.. బుధవారం రాత్రి ఎరుపు నీళ్లతో తమ ఇండ్లకు సామూహిక దిష్టి తీసి నిరసన వ్యక్తం చేశారు. పేదల నివాసాలపై సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ దృష్టి పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇండ్లపై నుంచి వారందరి దృష్టి తొలగిపోవాలని ఎరుపు నీళ్లు, అగ్నితో హారతి ఇచ్చామని తెలిపారు. –హయత్‌నగర్

'ఏకపక్ష నిర్ణయాలు సరికాదు'

మూసీ సుందరీకరణ చర్యలతో ప్రజల్లో భయాందోళనలు: తమ్మినేని



హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ పేరిట రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఏకపక్ష చర్యలు సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పోలీసులను, అధికారులను ప్రయోగిస్తూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఇంత హడావుడిగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని తమ్మినేని పేర్కొన్నారు.

మూసీ సుందరీకరణ పేరుతో కుట్ర: కిషన్‌రెడ్డి



గోల్నాక, అక్టోబర్ 2: మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ గోల్నాక డివిజన్ అంబేద్కర్‌నగర్‌లోని మూసీ పరీవాహక నివాసితులను కలిసి ఆయన మాట్లాడారు. పేదల ఇండ్లు కూల్చే అధికారం ఏ ప్రభుత్వానికీ లేదని, పేదల ఇండ్లపైకి బుల్డోజర్ వస్తే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పేదల జోలికొచ్చి ఇండ్లు కూల్చుతామంటే ఊరుకునే ప్రసక్తే లేదని చెప్పారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు

పశ్చిమాసియా మరోసారి ప్రత్యక్ష యుద్ధపు సుడిగుండంలోకి జారుకుంటున్నది. ఓ పక్క ఇజ్రాయెల్, మరోపక్క ఇరాన్ కలబడుతుండటం ప్రపంచాన్ని కలవరపరుస్తున్నది. హిజ్బొల్లా అగ్రనేత నస్రల్లాను వైమానిక దాడిలో ఇజ్రాయెల్ తుదముట్టించినప్పటి నుంచి ఉద్రిక్తతలు కుత కుత ఉడుకుతున్నాయి. తర్వాత ఇజ్రాయెల్ దక్షిణ లెబనాన్‌లో భూతల యుద్ధం ప్రారంభించింది. హిజ్బొల్లా స్థావరాలు, నేతలు లక్ష్యంగా దాడులు జరుపుతున్నది. ఇటీవల పలువురు ఇరాన్ సీనియర్ సైనికాధికారులనూ డ్రోన్ దాడుల్లో ఇజ్రాయెల్ చంపేసింది. ఈ పరిణామాలను జీర్ణించుకోలేకపోతున్న ఇరాన్ మంగళవారం రాత్రి సుమారు 200 క్షిపణులతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. ఇరాన్ ఇలా ప్రత్యక్ష దాడికి దిగడం పశ్చిమాసియాలో ఇప్పటికే దావానలంలా వ్యాపిస్తున్న విద్వేషాగ్నికి ఆజ్యం పోసినట్టయింది. దీనిని సాకుగా తీసుకొని ఇరాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడబోతున్నది. లెబనాన్, యెమెన్‌లో ఇరాన్ అనుకూల గెరిల్లా దళాలు ఈ సరికే ఇజ్రాయెల్‌తో క్షిపణుల యుద్ధం నెరపుతున్నాయి. ఇవన్నీ వెరసి ఎటు దారి తీస్తాయోననే ఆందోళన అంతకంతకూ పెరుగుతున్నది.

ప్రస్తుత పశ్చిమాసియా సంక్షోభం వెనుక ఏడు దశాబ్దాలకు పైగా సాగిన పరిణామాల నీడలున్నాయి. పశ్చిమదేశాల ఆధిపత్యవాదం, స్థానికంగా ఉండే మతవాదం, చమురు కలగలిసి మందుగుండుగా తయారైన పరిస్థితి. ఒకప్పుడు పాలస్తీనా సమస్య చుట్టూ పశ్చిమాసియా పరిభ్రమించినా కాలక్రమంలో అరబ్బు దేశాలు దౌత్యపరమైన పరిష్కారం వైపు మొగ్గడం మొదలుపెట్టాయి. యుద్ధోన్మాదం పట్ల ప్రజల్లో పెరిగిన వ్యతిరేకత, ప్రగతి సంక్షేమాల పట్ల పెరిగిన సానుకూలత అందుకు కారణం. ఈ నేపథ్యంలో ఇరాన్ ఒక్కటే పాలస్తీనా మద్దతుదారుగా మిగిలిపోయింది. సిరియా, లెబనాన్, యెమెన్‌లలోని తన మద్దతుదారుల ద్వారా ఇజ్రాయెల్‌పై పరోక్ష యుద్ధం కొనసాగిస్తున్నది. ఇప్పుడది ముదిరిపోయి ప్రత్యక్ష యుద్ధంగా పరిణమిస్తున్నది.

గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధంలో పదుల వేల సంఖ్యలో జనం చచ్చిపోతున్నారు. లక్షల సంఖ్యలో కాందిశీకులు గూడు చెదిరి అగచాట్లు పడుతున్నారు. మరోవైపు దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెలీ దళాలు భూతల యుద్ధం మొదలుపెట్టాయి. అవి చాలవన్నట్టుగా ఇప్పుడు పులి మీద పుట్రలా యుద్ధం వచ్చి పడుతున్నది. ఇది రెండు దేశాలకు పరిమితమైన యుద్ధంగా ఉండబోదని కచ్చితంగా చెప్పవచ్చు. అదేవిధంగా దీని ప్రభావం ప్రపంచంలోని దేశాలన్నిటిపైనా ఎంతో కొంత ఉండి తీరుతుంది. నిన్నటిదాకా నేల చూపులు చూసిన అంతర్జాతీయ చమురు ధర ఒక్కసారిగా పైపైకి ఎగబాకుతుండటమే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా నౌకా రవాణా ఇప్పటికే భయం నీడలో సాగుతున్న సంగతి తెలిసిందే.


పశ్చిమాసియా సంక్షోభమంతటికీ పాలస్తీనా సమస్య కేంద్రబిందువు లాంటిది. ఆ సమస్యకు రెండు దేశాల సూత్రమే ఏకైక పరిష్కార మార్గం. కానీ, యుద్ధంతో శాంతిని కొనుక్కోవాలని ఇజ్రాయెల్ చూస్తున్నది. పాలస్తీనా అస్తిత్వాన్ని అంగీకరించి వారి భూభాగాన్ని వారికి సంపూర్ణ సార్వభౌమాధికారంతో అప్పగించడమే అసలు సిసలు శాంతికి బాటలు వేస్తుందని ఇజ్రాయెల్ గుర్తించాలి. పాలస్తీనా సమస్య పర్యవసానంగానే ప్రస్తుత యుద్ధం రాజుకుంటున్నది. ఇది ఏ మాత్రం ఉపేక్షించదగిన విషయం కాదు. ఇజ్రాయెల్ అప్రకటిత అణ్వస్త్ర దేశమైతే ఇరాన్ అనుమానిత అణ్వస్త్ర దేశం అనేది ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి. ఈ రెండు దేశాలు కత్తులు దూసుకోవడం ప్రపంచానికి ఏమంత శ్రేయస్కరం కాదు. తక్షణమే ఐక్యరాజ్య సమితి విపత్కర పర్యవసానాలతో కూడిన ప్రస్తుత యుద్ధాన్ని ఆపేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేయాలి. ఇజ్రాయెల్, అమెరికా చిత్తశుద్ధితో సహకరిస్తేనే శాశ్వత శాంతి సాధ్యమవుతుంది.

ప్రకృతి విధ్వంసం-తక్షణ మేలుకొలుపే మార్గం

ప్రపంచ మానవాళి ఇప్పుడు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ప్రకృతి విధ్వంసం. పర్యావరణ మార్పుల ద్వారా ఎదురవుతున్న సమస్యలు, అకాల వర్షాలు, వరదలు, విపరీతమైన ఎండలు, మారుతున్న రుతువులు ఇదీ ప్రస్తుతం ప్రపంచ పరిస్థితి. ఎడారుల్లో వరదలు వస్తున్నాయి, హిమాలయాల్లో మంచు మాయమవుతున్నది. ఓ వైపు నగరాలు మునిగిపోతున్నాయి. మరోవైపు గ్రామాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. రుతువులు గతి తప్పుతున్నాయి. కరోనా వంటి కొత్త జబ్బులు భయపెడుతున్నాయి. వీటన్నింటికీ మూలం అంతరిస్తున్న అడవులు, కనుమరుగవుతున్న పచ్చదనం.



జోగినపల్లి సంతోష్‌కుమార్



జనాభా విపరీతంగా పెరగటమే కాదు, పెరుగుతున్న ప్రజల అవసరాల కోసం జరుగుతున్న అభివృద్ధి ప్రకృతికి గొడ్డలిపెట్టు అవుతున్నది. సహజ వనరులను విచక్షణారహితంగా వాడుతున్నా రు. మరి ఈ విధ్వంసానికి అంతం లేదా, పౌరులుగా మన బాధ్యత ఎంతన్నది ఒక్కసారి ప్రతీ ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. మన వంతుగా ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ఎలా నడుం బిగించామన్నది ముఖ్యం. ప్రతీ ఒక్కరు తమ వంతు బాధ్యతగా పర్యావరణ హితానికి పాటుపడాలి.

నడిచే ప్రకృతి పాఠశాల: పద్మశ్రీ జాదవ్ పయంగ్

సమాజ హితాన్ని కోరుతూ చేసే నిస్వార్థ ప్రయత్నం ఆలస్యంగానైనా గమ్యాన్ని ముద్దాడుతుంది. పద్మశ్రీ, ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన జాదవ్ మొలాయ్ పయంగ్ ప్రయాణమే ఇందుకు తిరుగులేని ఉదాహరణ. పర్యావరణ మార్పులు తద్వారా ఎదురయ్యే సమస్యలపై ఎవరూ మాట్లాడని సమయంలోనే ఆయన ఆచరణ మొదలుపెట్టారు. దేశానికి ఈశాన్య ప్రాంతం మజులీలో ఆయన చేసిన ప్రకృతి యజ్ఞం ఓ అడవినే సృష్టించింది. ఫలితం గురించి ఆశించకుండా ప్రయత్నాన్ని మాత్రమే కొనసాగించారు. ఈ అవిరళ శ్రమలో ఆయన ఎక్కడా ఫలితంపై ఆశ వీడలేదు, గుర్తింపును ఆశించలేదు. పనిచేస్తూ వెళ్తే వాటంతటవే అవార్డులు వచ్చాయి.

అమాయకపు ముఖం, బోసి నవ్వుతో కనిపించే అరువై నాలుగేండ్ల పయంగ్ ఆశయాల ప్రయాణం బ్రహ్మపుత్ర నది అంతటి విశాలమైనది. ఇటీవల నా అసోం పర్యటనలో ఆయనతో కొంత సమయం గడపటం, అత్యంత స్ఫూర్తిదాయకమైన ఆయన అనుభవాలు పంచుకోవటం అదృష్టంగా భావిస్తున్నా. స్వయంగా 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్'లో పాల్గొని మమ్మల్ని జాదవ్ పయంగ్ ఆశీర్వదించటం మా భవిష్యత్ కార్యక్రమాలకు ఆక్సిజన్‌లా భావిస్తున్నాం.

నలభై ఐదేండ్ల కింద ఆయన యుక్త వయస్సులో ఉన్నప్పుడు అసోం మజులీ తీరంలో కొన్ని పాములు, ఇతర నీటి జంతువులు చనిపోయి ఉండటాన్ని గుర్తించిన పయంగ్ అప్పుడే ప్రమాదాన్ని పసిగట్టారు. తీరం కోతకు గురికావటం, జంతువులు, సరీ సృపాలకు నిలువ నీడలేదని గుర్తించి కొన్ని వెదురు మొక్కలు నాటి సంరక్షించారు. అలా పెరిగిన వెదురువనం క్రమంగా చిన్న జంతువులకు ఆవాసంగా మారింది. ఇది గుర్తించిన జాదవ్ క్రమంగా బ్రహ్మపుత్ర నదీతీరం వెంట మొక్కలు నాటుతూ వెళ్లారు. అలా ముప్పై ఏండ్ల పాటు ఏకంగా 1,360 ఎకరాల్లో అడవిని పెంచారు. అనతికాలంలోనే సమీప మైదాన ప్రాంతాలన్నీ పచ్చదనం పరుచుకోవటం మొదలైంది. కొన్నేండ్ల తర్వాత అటుగా వచ్చిన అటవీ అధికారులే ఆశ్చర్యపోయారు. జాదవ్ కృషిని గుర్తిస్తూ ఆయన పేరు పైనే మొలాయ్ అడవిగా (మొలాయ్ రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్) అధికారికంగా నామకరణం చేశారు. జాదవ్ పెంచిన చిట్టడవి క్రమంగా చిక్కటి అడవిలా విస్తరిం చింది. ఉడతలు, జింకలు, రైనోలు, ఏనుగులు, బెంగాల్ టైగర్‌లతో పాటు వందలాది రకాల పక్షులు, జంతుజాలానికి ఆవాసంగా మారింది. ఏటా సీజన్‌లో వందకు పైగా ఏనుగుల గుంపు మొలాయ్ అటవీ ప్రాం తంలో కొన్ని నెలల పాటు సేద తీరుతాయి. అసోం అడవుల్లో వేటగాళ్ల బుల్లెట్లకు బలవుతున్న రైనోలు ఇక్కడ మాత్రం స్వేచ్ఛగా విహరిస్తాయి.

దివంగత అబ్దుల్ కలాం చెప్పినట్టు ఉడతను పెంచుకుంటే వెళ్లిపోతుంది, పక్షిని పెంచుకుంటే ఎగిరిపోతుంది. కా నీ, చెట్టును పెంచితే ఆ రెండూ మన ఆవరణలోనే వచ్చి చేరుతాయనే నానుడి మొలాయ్ అడవితో నిజమైంది.

ఒంటరి ప్రకృతి సైనికుడిలా జాదవ్ పయంగ్ చేసిన కృషిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి 2015లో దేశంలోనే అత్యున్నత 4వ పౌర పురస్కారం పద్మశ్రీతో సత్కరించింది. మాతో గడిపిన సమయంలో ఆయన జీవన పయనాన్ని నెమరువేసుకున్నారు. బ్రహ్మపుత్ర నది, అసోం, మజులీ, అడవితో తన అనుబంధాన్ని పంచుకున్నారు. పర్యావరణ మార్పులు, మానవాళికి పొంచి ఉన్న ముప్పుపై ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలకు నివాసయోగ్యమైన పరిసరాలను అందించటం ప్రతీ ఒక్కరూ తమ బాధ్యతగా గుర్తించాలని అన్నారు. పర్యావరణ విద్యను తప్పనిసరి చేయటమే కాదు, ప్రకృతి పాఠాలు తరగతి గది నుంచి బాహ్య ప్రపంచానికి మారాలని ఆకాంక్షించారు. కేవలం పుస్తకాల్లో ఉన్నది బోధించకుండా, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రకృతి విధ్వంసాన్ని నేటి పౌరులకు అర్థమయ్యేలా చేయాలని జాదవ్ పయంగ్ చెప్తున్నారు.

ప్రకృతి పునరుజ్జీవనం అనేది ఎవరో చేసేది కాదని, ప్రతీ పౌరుడూ విధిగా అనుసరించాల్సిన బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న జనాభాను, వారి అవసరాలను తీర్చే అభివృద్ధిని ప్రస్తుత పరిస్థితుల్లో కాదనలేమని, కానీ, అడవులు, సహజ వనరులపై పడుతున్న భారాన్ని మాత్రం తగ్గించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వనరులను కాపాడుతూనే అభివృద్ధి చేసే ప్రత్యామ్నాయ మార్గాలపై పరిశోధనలు జరగాలని తెలిపారు. ఈశాన్య హిమాలయాలకు పొంచి ఉన్న ముప్పుపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వరదలు, రుతువుల్లో మార్పులు, అనూహ్య వ్యాధులకు ప్రకృతి ప్రకోపమే కారణమని జాదవ్ అంటున్నారు. మన రాష్ట్రంలో వనజీవి రామయ్య వంటివారున్నారు. జాదవ్‌ను చూస్తే మన రామయ్య గుర్తుకువచ్చారు. ప్రకృతి కోసం పరితపించే ఇలాంటి మనుషులు ఇంకా పెరగాలి. ఇది కేవలం ఏ ఒక్కరి బాధ్యతనో కాదు. మనందరి సమష్టి బాధ్యత.

అడవుల విధ్వంసం- పర్యావరణహిత చర్యలు:

గ్లోబల్ ఫారెస్ట్ వాచ్ నివేదిక ప్రకారం భారతదేశం 2000-23 మధ్య 2.33 మిలియన్ హెక్టార్ల (57,57,555 ఎకరాల) అటవీ భూమిని కోల్పోయింది. విచక్షణారహితంగా కొనసాగుతున్న అడవుల నరికివేతకు తోడు, అభివృద్ధి కార్యక్రమాల పేరుతో మళ్లించిన అటవీ భూమి కూడా ఇందులో ఉన్నది. అయితే, ప్రకృతి సంపదకు నిలయమైన ఐదు ఈశాన్య రాష్ర్టాలు అసోం, మిజోరం, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్‌లో ఈ అటవీ విధ్వంసం ఎక్కువగా ఉండటం మాత్రం ఆందోళన కలిగించే విషయం.

మిగతా ప్రాంతాలతో పోలిస్తే అసోం 2050 నాటికల్లా 330 శాతం ఎక్కువ పర్యావరణపరమైన ప్రమాదాలను ఎదుర్కోబోతున్నది. రాష్ట్రంలో 60 శాతం జిల్లాలపై ఈ ప్రభావం పడుతుంది. అలాగే దేశవ్యాప్తంగా అడవుల నరికివేత ద్వారా జరుగుతున్న ప్రకృతి విధ్వంసం ఏటా 51 మిలియన్ టన్నుల కార్బన్‌డై ఆక్సైడ్ విడుదలకు సమానం. అంటే నిత్యం వివిధ కారణాలతో వెలువడే కర్బన ఉద్గారాలకు ఇది అదనం అన్నమాట. ఈ పర్యావరణ దుష్పరిణామాల వల్ల ఎదురౌతున్న భౌగోళిక పరిస్థితులను ఇప్పుడు మనమంతా ఎదుర్కొంటున్నాం. వేగంగా మారుతున్న వాతావరణం, విపరీతమైన వేడి, అకాల వర్షాలు, వరదలు, సీజన్ల మార్పు ఈ కోవలోకే వస్తాయి. క్లైమెట్ సెంట్రల్ నివేదికను ఒక్కసారి గమనిస్తే... ఈ సీజన్‌లో 21 రోజులు అత్యధిక వేడి రోజులు నమోదయ్యాయి. గడిచిన 55 ఏండ్లలో ఎన్నడూ ఈ స్థాయిలో వేడి రోజులు నమోదు కాలేదు. అలాగే ఏపీలో ఇదే సీజన్‌లో 14 రోజులు వేడి రోజులుగా నమోదయ్యా యి. అంటే, సగటును మించిన వేడిని మనం ఈ సీజన్‌లో ఎదుర్కొన్నాం. ఇది అత్యంత ప్రమాదకరమైన సంకేతం. మనం ఇప్పటికైనా మేల్కోవాలి.

అందుకే మన పరిసరాల్లో ప్రకృతిని కాపాడటం ఒక ఎత్తు అయితే, కోల్పోయిన పచ్చదనాన్ని తిరిగి వీలున్నంతగా సాధించటం మరో ఎత్తు. అదే సమయంలో ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, హిమాలయాలతో పాటు నదుల కాలుష్యం తగ్గింపు, నీటి వనరులను కాపాడుకోవటం, చిత్తడి నేలల అభివృద్ధి, పెట్రోల్, డీజిల్ వాడకం నియంత్రిస్తూ ఈవీ వాహనాలను ప్రోత్సహించటం ఇవన్నీ కూడా ప్రకృతి పునరుజ్జీవనానికి తోడ్పాటునందించే చర్యలే. అడవులపై ఆధారపడి జీవించేవారికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు, అటవీ సేకరణ ఉత్పత్తులకు తగినంత ఆదాయం ఉండేలా చేయటం నరికివేతను తగ్గించే మార్గాలు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తోడు ప్రతీ పౌరుడూ విధిగా బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే ఇది సాధ్యమవుతుంది.



పద్మశ్రీ జాదవ్ పయంగ్‌తో సంతోష్ కుమార్

గ్రీన్ లీడర్‌గా యువరాష్ట్రం-తెలంగాణకు హరిత హారం: 2014లో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన తెలంగాణ కే.చంద్రశేఖరరావు సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యాన్నిస్తూ నివాసయోగ్యమైన పరిసరాల కల్పనపై దృష్టిపెట్టింది. అందుకే, 2015లోనే తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. రానున్న తరాలకు మెరుగైన వాతావరణం అందించటం మన బాధ్యత అంటూ కేసీఆర్ చేపట్టిన హరితహారం పదేండ్లలో అద్భుత ఫలితాలను సాధించింది. సుమారు 280 కోట్ల మొక్కలు రాష్ట్రవ్యాప్తంగా నాటడంతో పచ్చదనం 24 నుంచి 31 శాతానికి పెరిగింది. (ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం) రాష్ట్ర రహదారులు పూల బాటలయ్యాయి.

అడవుల పునరుజ్జీవనంతో కొత్త కళను సంతరించుకున్నాయి. పెద్ద సంఖ్యలో అభివృద్ధి చేసిన అర్బన్ ఫారెస్ట్ పార్కులు పౌరులకు సహజ ఆక్సిజన్ వనరులుగా (లంగ్ స్పేస్‌లుగా) రూపాంతరం చెందాయి. కేసీఆర్ దూరదృష్టి, హరిత హారం కార్యక్రమమే 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' మొదలు పెట్టేందుకు స్ఫూర్తిగా నిలిచింది. తెలంగాణ ఫలితాలను దేశవ్యాప్తంగా అమలయ్యేలా చూడాలనే సంకల్పమే 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్'కు శ్వాసగా నిలిచింది.

హరిత భారత్- గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పాత్ర: హరిత భారత స్వప్నాన్ని ఆకాంక్షిస్తున్న 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' కార్యక్రమం దశలవారీగా విస్తరిస్తున్నది. ప్రకృతిని కాపాడాలి, పచ్చదనం పెంచాలనే హరిత భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయటమే మా కార్యక్రమాల లక్ష్యం. ఒక్కొక్కరు మూడు మొక్కలు నాటాలి, మరో ముగ్గురికి హరిత సవాల్ విసరటాన్ని బలంగా సమాజంలోకి తీసుకువెళ్లగలిగాం. 2018లో ప్రారంభమైన గ్రీన్ ఛాలెంజ్ ఇప్పటివరకు తెలంగాణతో పాటు వివిధ రాష్ర్టాలకు విస్తరించింది. ఏడు విడతల్లో సుమారు 19.50 కో ట్ల మొక్కలు 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' ద్వారా నాటాము. పలు రంగాలకు చెందిన ప్రముఖులను, సెలబ్రిటీలను భాగస్వామ్యం చేయటం ద్వారా వారి ని అనుసరించే అభిమానులు అందరూ 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్'లో భాగమయ్యేలా చేయగలిగాం.

అడవుల దత్తత కార్యక్రమాన్ని మొదలుపెట్టి తెలంగాణలోని కీసర, ఖాజీపల్లి, బొంతపల్లి, చెంగిచెర్ల, హరిణ వనస్థలి రక్షిత అటవీ ప్రాంతాల్లో క్షీణించిన అటవీ పునరుద్ధరణలో గ్రీన్ ఇండియా భాగస్వామ్యమైంది. హైదరాబాద్‌తో పాటు ముంబై, ఢిల్లీ, భువనేశ్వర్‌లలో పలు కార్యక్రమాలు చేపట్టాం. వీటన్నింటిలో భాగస్వామ్యులైన లక్షల మందికి వినమ్రపూర్వక కృతజ్ఞతలు. కానీ, ఈ హరిత యజ్ఞం మరింతగా కొనసాగాలి, హరిత భారత్ స్వప్నం సాకారం కావాలనేది మా బలీయమైన ఆకాంక్ష. ఈ ఏడాది అసోంలో 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' మొదలుపెట్టాం. అందమైన అసోంలో పచ్చదనం క్షీణించటం, ప్రకృతి విలయాలు పెరగటం బాధాకరం. అందుకే పద్మశ్రీ జాదవ్ పయంగ్ స్ఫూర్తితో ఆయనతో కలిసి పనిచేస్తు న్నాం.

జాదవ్ మార్గనిర్దేశంలో 2030 కల్లా అసోంలో కోటి మొక్కలు నాటి సంరక్షించాలనే బృహత్ కార్యాన్ని మొదలుపెట్టాం. దీనిలో స్థానిక సంస్థలు, ఎన్జీవోలు, పౌరులను భాగస్వామ్యం చేస్తున్నాం.ఇందులో అన్నివర్గాలనూ భాగస్వామ్యం చేస్తాం, కలిసివచ్చే చేతులతో మొక్కలు నాటిస్తాం. పార్టీలు, వర్గాలు, ప్రయోజనాలకతీతంగా 'హరిత భారత్' లక్ష్యంగా పనిచేయాలనేదే మా సంకల్పం. ఇటీవల అసోంలో జరిగిన కార్యక్రమంలో తముల్‌పూర్ ఎమ్మెల్యే జోలెన్ దోయినరీ స్వయంగా 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్'లో పాల్గొని మొక్కలు నాటడంతో పాటు, మా కృషిని కొనసాగించమని ఆహ్వానించటం అభినందనీయం.

హరిత విప్లవం మొదలుపెట్టినపుడు జాదవ్ పయంగ్ ఒక్కరే, కానీ ఆయన సాధించిన ఫలితాలు మాత్రం ప్రపంచ గుర్తింపును పొందాయి. అభివృద్ధి చెందిన దేశాలతో పాటు, లాటిన్ అమెరికా దేశాలు ఆయనను స్వయంగా ఆహ్వానించి అస్సామీ, హిందీలో కొనసాగే ఆయన ప్రసంగాలను, క్షేత్ర అనుభవాలను తమ భాషల్లోకి అనువాదం చేసుకొని మరీ వింటున్నాయి. అలాగే హరితహారంతో కేసీఆర్ లాంటి స్ఫూర్తి ప్రదాతలు ఎక్కడినుంచో రారు, మన మధ్యే ఉంటూ మార్గనిర్దేశం చేస్తారు. ఇలాంటివారు వేసిన హరిత బాటల్లో నడవటం, భరతమాతను హరితదేశంగా మలుచుకోవటం మన ముందున్న కర్తవ్యం. భవిష్యత్ తరాలు మనను నిందించక ముందే మేల్కొందాం. ప్రకృతి రక్షణకు, పచ్చదనం పెంపునకు పునరంకితమవుదాం.

(వ్యాసకర్త: మాజీ రాజ్యసభ ఎంపీ, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకులు)

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన హరితహారం కృషి ఫలితంగా హైదరాబాద్ సిగలో మరో కలికితురాయి చేరింది. 2020 సంవత్సరానికిగాను హైదరాబాద్ మహానగరం 'ట్రీ సిటీ ఆఫ్ ది వరల్డ్'గా గుర్తింపు పొందింది. ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్, అర్బోర్ డే ఫౌండేషన్ సంయుక్తంగా హైదరాబాద్‌కు ఈ పురస్కారాన్నిచ్చాయి.

సంక్షోభంలో విద్యారంగం

ప్రజాపాలన తెస్తామని ఎన్నికలకు ముందు చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటూ విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నది. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న సుమారు 30 వేలకు పైగా పాఠశాలల్లో వసతులు కల్పించి, వాటిని అభివృద్ధి చేయకుండా నియోజకవర్గానికో ఇంటర్నేషనల్ స్కూల్ స్థాపిస్తామని, మండలానికో సమీకృత గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తామంటూ కాలయాపన చేస్తున్నది. అంతేకాదు, రాష్ట్రంలోని 17 ప్రభుత్వ యూనివర్సిటీలను సమగ్రంగా అభివృద్ధి చేయకుండా స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ అంటూ విద్యా వ్యతిరేక ప్రచారార్భాటం చేస్తున్నది.



కె.వేణుగోపాల్
98665 14577



కాంగ్రెస్ సర్కార్ చర్యల వల్ల అట్టడుగు కులాలు, వర్గాల విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం పొంచి ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు సర్కారీ విద్యను ఎంతవరకు బలోపేతం చేయగలదో పరిశీలించే ముందు కేంద్ర ప్రభుత్వం విద్యా విధానాలు ఎలా ఉన్నాయో సంక్షిప్తంగా చూద్దాం. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజాస్వామిక సెక్యులర్ రాజ్యం స్థానంలో హిందూ మతం పేరిట మతోన్మాద రాజ్యాన్ని స్థాపించడానికి జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చింది. అందులో భాగంగా ఎన్టీయే లాంటి కేంద్రీకృత పరీక్షలకు ఆమోదముద్ర వేసి, పేపర్లు లీకు చేయడం, అమ్ముకోవడాన్ని ప్రోత్సహిస్తున్నది. తద్వారా 24 లక్షలకు పైగా విద్యార్థులకు అన్యాయం జరిగింది. 2014 బడ్జెట్‌లో విద్యారంగానికి మోదీ సర్కార్ ఆరు శాతం నిధులను కేటాయించగా.. 2024 నాటికి అవి 2.5 శాతానికి పడిపోయాయి. పాఠ్యాంశాల నుంచి డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం, పీరియాడిక్ టేబుల్, మొఘులుల చరిత్రను తొలగించడం, గాంధీజీని చంపిన గాడ్సే పాత్రను వక్రీకరించడం లాంటి చర్యలు శాస్త్రీయ దృక్పథాన్ని, హేతుబద్ధతను తుదముట్టించడమే. పాఠశాల విద్యను 5+3+3+4 పద్ధతిలో వ్యవస్థీకరించి, పాఠశాల విద్యావ్యవస్థను, పాఠ్య ప్రణాళికను బీజేపీ సర్కార్ ధ్వంసం చేస్తున్నది. ఇటువంటి దుష్పరిణామాలకు దారితీసిన జాతీయ విద్యా విధానం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఒక విధానమంటూ లేకపోవడం శోచనీయం.

ప్రజా పాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మూస ధోరణిని అవలంబిస్తున్నది. విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించి, ఇప్పుడు 7.3 శాతమే కేటాయించింది. విద్యారంగానికి తమిళనాడులో 13.4 శాతం, కర్ణాటకలో 12.9 శాతం, కేరళలో 14.8 శాతం, ఏపీలో 12.6 శాతం నిధులు కేటాయించారు.

ఒక్క పాఠశాలనూ మూసివేయమని ప్రకటించి, మూసివేతలను నిరాటంకంగా కొనసాగిస్తున్నది. సరిపడా తరగతి గదులు, సబ్జెక్టుకో ఉపాధ్యాయుడు, మరుగుదొడ్లు నీటి సౌకర్యం లేక పాఠశాలలు నిర్వీర్యమైపోతున్నాయి. 2022-23 విద్యా సంవత్సరంలో దాదాపు 8,500 పాఠశాలల్లో 20 మంది కంటే తక్కువ విద్యార్థులున్నారు. 1864 పాఠశాలల్లో విద్యార్థులే లేరు. విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గిపోతుందో అధ్యయనం చేయకుండా, సమస్యలకు పరిష్కారాలను కనుక్కోకుండా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని సాకు చెప్తూ పాఠశాలలను మూసివేస్తుండటం దారుణం. రాష్ట్రంలో ఒకే గది ఉన్న పాఠశాలలు 3,620, ఒకే టీచర్ ఉన్న పాఠశాలలు 4,984 ఉన్నట్టు తెలుస్తున్నది. జీవో నెంబర్ 25 ప్రకారం.. 60 మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులను కేటాయిం చి పాఠశాలలను కాంగ్రెస్ సర్కార్ మూసివేస్తున్నది. రాష్ట్రంలో 523 మండలాల్లో మండల విద్యాశాఖాధికారులు లేరు. 64 డిప్యూటీ జిల్లా విద్యా అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 8 జిల్లా విద్యా శాఖాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయులను తయారుచేసే డైట్ కళాశాలల్లో 189 ఖాళీలున్నాయి. అకడమిక్ క్యాలెండర్, పాఠ్యాంశాలను తయారుచేసే ఎస్‌సీఈఆర్‌టీలో 94 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్న పాఠశాల ల ను పటిష్ఠపరచకుండా నియోజకవర్గానికో ఇంటర్నేషనల్ స్కూ ల్ స్థాపిస్తామని పాలకులు అంటుండటం విడ్డూరం. ఐదు రకాల గురుకులాలతో పాటు, ఆదర్శ, కేజీబీవీ పాఠశాలలకు తోడు ఇంటర్నేషనల్ స్కూల్ మరొక అంతరాల దొంతర కాబోతున్న ది. అంతేకాకుండా, సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను పట్టణాలకు తీసుకురావడం, ఒకే ప్రాంగణంలో కులాలవారీగా స్కూళ్లను నిర్మించడం, 1-3 తరగతులకు ప్రీ ప్రైమరీ శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించకుండా అంగన్వాడీలలో కలపడం, పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)ల స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాలలను తీసుకురావడం లాంటి చర్యలు కొత్త సమస్యలను తీసుకొస్తున్నాయే తప్ప ఉన్న సమస్యలను పరిష్కరించవు. నూతన విద్యా విధానం మీద ఎటువంటి అభిప్రాయాన్ని వెల్లడించకుండానే ఇంటర్మీడియట్ తరగతులను సెకండరీ విద్యలో, ప్రాథమిక తరగతులను అంగన్వాడీలో విలీనం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది.

అలాగే ఉన్నత విద్యలో ప్రభుత్వ రంగంలో ఉన్న 7 సంప్రదాయ, 10 ప్రత్యేక విశ్వవిద్యాలయాలతో కలిపి మొత్తం 17 స్టేట్ యూనివర్సిటీలను, 4,036 కాలేజీలను సమగ్రంగా అభివృద్ధి చేయకుండా భూకబ్జాదారులకు, విద్యా వ్యాపారులకు, కంపెనీలకు ప్రైవేటు యూనివర్సిటీలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు ఇచ్చారు. ప్రభుత్వ రంగంలో కాకుండా ప్రభుత్వ- ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో 50 ఎకరాల భూమిలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ యూనివర్సిటీల్లో రెండు వేలకు పైగా ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. యూనివర్సిటీ వసతి గృహాలు అధ్వానంగా ఉన్నాయి. బాసర ట్రిపుల్ ఐటీ సంక్షోభంలో కూరుకుపోయింది. అధ్యాపకులు లేక విద్యాబోధన కునారిల్లింది. మారుతున్న సాంకేతిక పరిశోధనలకు అనుగుణంగా సిలబస్‌ను మార్చలేదు. ప్రభుత్వ కళాశాలలు, విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది తార్కాణం.

ప్రస్తుతమున్న యూనివర్సిటీలు, పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటీఐలను సమగ్రంగా అభివృద్ధి చేసి విద్యార్థులకు నైపుణ్యాలు నేర్పవచ్చు. అలా చేయకుండా కొత్తగా స్కిల్ యూనివర్సిటీ స్థాపించడమెందుకు? అక్కడ 30 వేల మందికి స్కిల్స్ నేర్పిస్తున్నట్టు చెప్తున్నారు. ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలో భాగంగా 19 విదేశీ కంపెనీలు హైదరాబాద్‌కు రాబోతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయా బహుళ జాతి కంపెనీలకు నైపుణ్యం కలిగిన, తక్కువ జీతానికి పనిచేసే కార్మికులను తయారు చేయడానికే ఈ స్కిల్ యూనివర్సిటీని స్థాపించారా? అనే అనుమానం కలుగుతున్నది. ఈ యూనివర్సిటీలో సిబ్బంది నియామకం, అడ్మిషన్లలో రిజర్వేషన్లు పాటిస్తారా? ఫీజులు ఎంత ఉంటాయి? తదితర వివరాలు ఇంకా అధికారికంగా తెలియవలసి ఉన్నది.

జిల్లాకో వైద్య కళాశాలలను ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలో 27 ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభమయ్యాయి. వాటిలో సరిపడా అధ్యాపకులు లేకపోవడంతో ఏటా ఎన్ఎంసీ అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. 28 ప్రైవేటు వైద్య కళాశాలల్లో బోధకులు లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన వైద్యవిద్య అందడం లేదు. అంతేకాదు, డీమ్డ్ యూనివర్సిటీ పేరిట మెడికల్ కాలేజీల నిర్వహణ వల్ల పేద, వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు, కన్వీనర్ కోటా సీట్లు తగ్గిపోయి, పేద విద్యార్థులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉంది. యూజీసీ నిర్వాకం వల్ల బలహీనవర్గాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు తీరని అన్యాయం జరగనున్నది.

వాస్తవానికి, తెలంగాణలో 30 లక్షలకు పైగా ఉన్న నిరుద్యోగులు ఏయే స్థాయి వరకు చదువుకున్నారు? వారికి ఏయే నైపుణ్యాలు నేర్పగలం? అనే సమాచారం ఎక్కడా లేదు. ప్రభుత్వానికి గాని, కంపెనీలకు గాని ఈ నిరుద్యోగులకు ఏ రకమైన నైపుణ్యాలు అందించాలనే విషయంపై స్పష్టత లేదు. ఇటువంటి పరిస్థితుల్లో హైదరాబాద్‌కు వచ్చే దేశ, విదేశీ కంపెనీలకు కావలసిన ఉద్యోగుల కోసమే రాష్ట్రంతో సంబంధం లేకుండా అందరికీ నైపుణ్యాలు నేర్పించడానికే ఈ స్కిల్ యూనివర్సిటీ వస్తున్నట్టుగా తెలుస్తున్నది. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెగించి కొట్లాడిన తెలంగాణ నిరుద్యోగ యువతీయువకుల కోసం కాదని, దాని పేరు ద్వారా తెలుస్తున్నది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ అన్నారే గాని, యంగ్ తెలంగాణ స్కిల్ యూనివర్సిటీ అని పేరు పెట్టలేదు.

పాఠశాల స్థాయి నుంచి అన్ని వసతులతో కూడిన వ్యాయామ విద్య లేకుండా స్పోర్ట్స్ యూనివర్సిటీని స్థాపించడం అర్థరహితం. రాష్ట్రంలోని వేలాది ప్రభుత్వ పాఠశాలలకు ఆటస్థలాలు లేవు. క్రీడా సామాగ్రి అందుబాటులో లేదు. అన్ని పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు మంజూరు కాలేదు. అసలు చాలా ప్రైవేట్ పాఠశాలలకు ఆటస్థలాలే లేవు. అటువంటి పరిస్థితుల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీని స్థాపిస్తామనడం పునాది లేకుండా భవనం నిర్మించడమే.

కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి గత తొమ్మిది నెలల్లో విద్యారంగంలో వచ్చిన, వస్తున్న మార్పులు ప్రభుత్వ విద్యను బలహీనపరిచేలా ఉన్నాయి. పేదలకు, మధ్యతరగతికే కాకుండా, ఎగువ మధ్య తరగతికి కూడా విద్యను దూరం చేసే విధంగా ఉన్నాయి. వీటి వల్ల అభ్యసన సంక్షోభం ఇంకా తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. విద్యారంగానికి పొంచిఉన్న ప్రమాదాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు గ్రహించాలి.

(విద్యారంగ సమస్యలపై తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నేడు హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్న సందర్భంగా)

(వ్యాసకర్త: పూర్వ అధ్యక్షులు, ఏపీటీఎఫ్)



చంచల్‌గూడ జైలు వద్ద జస్టిస్ సుజయ్‌పాల్‌కు స్వాతగం పలుకుతున్న డీజీ సౌమ్యమిశ్రా

గాంధీజీ ఆశయాలను అనుసరించాలి

హైకోర్టు జస్టిస్ సుజయ్ పాల్

నాంపల్లి కోర్టులు, అక్టోబర్, 2 (నమస్తే తెలంగాణ): అన్ని దేశాల్లో మహాత్మాగాంధీ విగ్రహాలను ప్రతిష్ఠించి ఆయన ఆశయాలను అనుసరిస్తున్నారని, ప్రతిఒక్కరూ తూచ తప్పకుండా పాటించాలని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, జస్టిస్ సుజయ్‌పాల్ స్పష్టంచేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని చంచల్‌గూడలో ఖైదీల సంక్షేమ దినోత్సవానికి హాజరయ్యారు. జైలు సూపరింటెండెంట్ శివకుమార్ గౌడ్, డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఫార్మా బాధితులకు అండగా హరీశ్‌రావు

- నేడు డప్పూరుకు రాక.. రైతులతో ముఖాముఖి
- భూసేకరణ ప్రాంతాలను పరిశీలించనున్న మాజీమంత్రి

సంగారెడ్డి, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో ఫార్మాసిటీ ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అండగా నిలవనున్నారు. ఫార్మాసిటీకి భూములిచ్చేది లేదని రైతులు తెగేసి చెప్పినా ప్రభుత్వం నిరంకుశంగా భూసేకరణకు సిద్ధమవుతుండటంతో రైతులకు బాసటగా నిలిచి వారి ఆందోళనలో పాల్గొనేందుకు హరీశ్‌రావు గురువారం న్యాల్‌కల్ మండలం డప్పూరుకు రానున్నారు. డప్పూరులో భూములు కోల్పోతున్న మూడు గ్రామాల రైతులతో సమావేశమై ముఖాముఖిగా మాట్లాడనున్నారు. సమస్యలు తెలుసుకోవటంతోపాటు ఫార్మాసిటీ కోసం సేకరిస్తున్న భూములను పరిశీలించనున్నారు. హరీశ్‌రావు వెంట ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ వెళ్లనున్నారు. మండలంలోని పచ్చని పల్లెలను కాలుష్య కాసారాలుగా మార్చేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూనుకున్నది. డప్పూరు, వడ్డీ, మాల్గి గ్రామాల పరిధిలో ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మూడు గ్రామాల పరిధిలో పేద రైతులు, దళితుల నుంచి 1983 ఎకరాల భూములను బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేస్తున్నది. భూసేకరణ కోసం ఆగస్టు 21, 23న ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫార్మాసిటీ కోసం 1983 ఎకరాల భూమి సేకరించనుండగా ఇందులో 1070 ఎకరాల పట్టాభూమి, 912 ఎకరాల అసైన్డ్‌భూమి ఉంది. 1070 ఎకరాల పట్టా భూములు కోల్పోతున్న రైతులు, 912 ఎకరాల అసైన్డ్ భూములు కోల్పోతున్న దళిత పేద రైతులు ఫార్మాసిటీకి భూములు ఇవ్వబోమని తెగేసి చెప్తున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. ముఖ్యంగా ఫార్మా కంపెనీల నుంచి వెలువడే కాలుష్య కారకాలు మంజీరా నదిలో చేరి నది అంతా కాలుష్యం అయ్యే ప్రమాదం ఉందని న్యాల్‌కల్ రైతులతోపాటు జిల్లా ప్రజలు పేర్కొంటున్నారు.

గొర్రెపోతు @ 58 వేలు



ఈ చిత్రంలో కన్పిస్తున్న ఈ కొండ గొర్రెను రికార్డు ధరకు కొనుగోలు చేశారు. నారాయణ పేట జిల్లా కేంద్రంలోని బురుడువాడి ధూల్‌పేటకు చెందిన కమలాపూర్ ప్రభాకర్ రూ.58 వేలు వెచ్చించి కర్ణాటక రాష్ట్రంలోని అమీన్‌ఘడ్‌లో కొనుగోలు చేశారు. దసరా వేడుకల కోసం ఈ పొట్టేల్‌ను తీసుకొచ్చారు.

– నారాయణపేట

పులిచింతల డ్యామ్‌పై మొసలి



సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టు డ్యామ్‌పై బుధవారం తెల్లవారుజామున మొసలి కనిపించింది. దాంతో పర్యాటకులు, జెన్‌కో అధికారులు భయాందోళనకు గురయ్యారు. కొద్దిసేపటికి మొసలి నీటిలోకి దూకింది. – చింతలపాలెం

యుద్ధం అంచున ప్రపంచం!

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో మూడో ప్రపంచ యుద్ధ భయాలు

- ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష దాడికి దిగిన ఇరాన్
- ప్రతీకారేచ్ఛతో రగులుతున్న ఇజ్రాయెల్
- ఇజ్రాయెల్‌కు అమెరికా, నాటో మద్దతు
- ఇప్పటికే ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా
- ఇరాన్‌కు సైతం మద్దతు ఇచ్చే అవకాశం!



న్యూఢిల్లీ, అక్టోబర్ 2: ఒకవైపు ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రత్యక్ష దాడితో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. మరోవైపు లాంగ్ రేంజ్ క్షిపణుల ప్రయోగిస్తామంటూ ఉక్రెయిన్, అణు విధానం మార్చుకుంటామంటూ రష్యా చేస్తున్న హెచ్చరికలతో ఉక్రెయిన్ – రష్యా యుద్ధం మరింత తీవ్రంగా మారుతున్నది. ఇజ్రాయెల్, ఉక్రెయిన్‌కు అమెరికా, నాటో దేశాల మద్దతు, ఇరాన్‌కు రష్యాతో పాటు అమెరికా వ్యతిరేక శక్తుల మద్దతు ఉంటుందనే అభిప్రాయాలు ప్రాంతీయ ఉద్రిక్తతలను ప్రపంచ యుద్ధం దిశగా నడిపిస్తున్నాయి. దీంతో మూడో ప్రపంచ యుద్ధానికి గతంలో ఎన్నడూ లేనంత సమీపానికి ప్రపంచం చేరుకున్నదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సోషల్ మీడియాలోనూ వరల్డ్ వార్ 3 అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌గా మారింది. మరోవైపు అధ్యక్ష ఎన్నికల వేడి మీదున్న అమెరికాలో ఇది ఎన్నికల అంశంగా మారింది. మూడో ప్రపంచ యుద్ధం అంచుకు చేరుకుంటున్నామని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.

ఇక ఇజ్రాయెల్ వర్సెస్ ఇరాన్

గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై పాలస్తీనా నుంచి హమాస్ జరిపిన దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మొదలయ్యాయి. హమాస్‌కు అండగా లెబనాన్ కేంద్రంగా పని చేసే హెజ్బొల్లా, యెమెన్ నుంచి పని చేసే హౌతీలు, ఇరాక్, సిరియా నుంచి మిలీషియాలు ఇజ్రాయెల్‌పై దాడులు జరుపుతున్నాయి. ఈ అన్ని సంస్థలకూ ఇరాన్ మద్దతు ఉందనేది ఇజ్రాయెల్ ఆరోపణ. ఇంతకాలం హమాస్‌ను ప్రధానంగా లక్ష్యంగా చేసుకొని గాజాపై భారీగా దాడులు చేసిన ఇజ్రాయెల్ ఇప్పుడు హెజ్బొల్లాను లక్ష్యంగా చేసుకుంది. వందలాది పేజర్ల పేల్చేయడం, హెజ్బొల్లా నేత సయ్యద్ హస్సన్ నస్రల్లాను హతమార్చడం, లెబనాన్‌పై భూతల దాడులు ప్రారంభించడం ద్వారా హెజ్బొల్లాను తుదముట్టించే పనిలో ఇజ్రాయెల్ ఉంది. అయితే, ఇంతకాలం ఇజ్రాయెల్ వ్యతిరేక సంస్థలను వెనకుండి నడిపించిన ఇరాన్ మంగళవారం ఇజ్రాయెల్‌పై 180 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించి ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగింది. దీంతో ఇప్పుడు పశ్చిమాసియాలో అధికారికంగా ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య యుద్ధం మొదలయ్యింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నది.

ఏ దేశం ఎవరి వైపు?

ఇజ్రాయెల్ – ఇరాన్ యుద్ధంలో ఏ దేశం ఎవరి వైపు నిలవనున్నది అనే అంశం కీలకంగా మారింది. ఇజ్రాయెల్‌కు ప్రధాన మద్దతు అమెరికా నుంచి ఉంది. ఇరాన్ క్షిపణులను కూల్చేయాలని ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆదేశించారు. ఇజ్రాయెల్‌కు మద్దతుగా పశ్చిమాసియాకు అమెరికా అదనపు బలగాలను మోహరిస్తున్నది. యూకే, ఫ్రాన్స్‌తో పాటు నాటో దేశాల మద్దతు కూడా ఇజ్రాయెల్‌కు ఉండనుంది. మరోవైపు పశ్చిమాసియాలో ఇప్పటికే షియా ముస్లింల కేంద్రమైన ఇరాన్, సున్నీ ముస్లింల మెజారిటీ కలిగిన సౌదీ అరేబియా మధ్య ఆధిపత్య పోరు ఉంది. అమెరికాకు సౌదీ అరేబియా మిత్రదేశంగా కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియాతో పాటు జోర్డాన్ మద్దతు కూడా ఇజ్రాయెల్‌కు ఉండే అవకాశం ఉంది. ఇక, ఇరాన్‌కు సిరియా, లెబనాన్, యెమెన్ మద్దతు ఉంది. ఈజిప్ట్, టర్కీ కూడా ఇరాన్‌కు మద్దతు ఇచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి.

రష్యా దిగితే రణరంగమే!

రష్యా – ఉక్రెయిన్ యుద్ధం మూడో ఏడాదికి చేరుకున్నప్పటీ సమీప భవిష్యత్తులో యుద్ధానికి ముగింపు కనిపించడం లేదు. ఉక్రెయిన్‌కు లాంగ్ రేంజ్ క్షిపణులు అందించాలనే యూకే నిర్ణయంపై రష్యా ఆగ్రహంగా ఉంది. తమ అణు విధానాన్ని మార్చుకుంటామని ఆ దేశం పదేపదే అమెరికా, నాటో దేశాలను హెచ్చరిస్తున్నది. రష్యాకు పరోక్షంగా చైనా, ఉత్తర కొరియా మద్దతు ఉంది. ఇరాన్‌తోనూ రష్యాకు మంచి సంబంధాలే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా, దాని మిత్ర దేశాలపై ఆగ్రహంగా ఉన్న రష్యా కనుక ఇరాన్‌కు మద్దతుగా నిలిస్తే మూడో ప్రపంచ యుద్ధానికి మరింత చేరువైనట్టే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఇజ్రాయెల్ దాడుల ధాటికి బీరుట్‌లో నేలమట్టమైన ఓ అపార్ట్‌మెంట్

ఇజ్రాయెల్-హెజ్బొల్లా భీకర పోరు

- లెబనాన్ భూభాగంలోకి ఇజ్రాయెల్ సైన్యం
- నిలువరించేందుకు హెజ్బొల్లా ప్రయత్నం
- 8 మంది ఇజ్రాయెల్ సైనికుల మృతి
- ఇజ్రాయెల్‌పై 100 రాకెట్లతో హెజ్బొల్లా దాడి
- లెబనాన్‌కు మరిన్ని ఐడీఎఫ్ బలగాలు
- గాజాపై ఇజ్రాయెల్ దాడి.. 51 మంది మృతి

బీరుట్, అక్టోబర్ 2: ఇజ్రాయెల్ దళాలు – హెజ్బొల్లా మధ్య పోరు తీవ్రమైంది. హెజ్బొల్లా లక్ష్యంగా లెబనాన్‌పై గత కొన్ని రోజులుగా గగనతల దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ ఇప్పుడు భూతల దాడులను ప్రారంభించింది. లెబనాన్ భూభాగంలోకి చేరుకొని హెజ్బొల్లాపై దాడి చేస్తున్నది. దీంతో ఇజ్రాయెల్ – హెజ్బొల్లా బలగాలు ముఖాముఖి తలపడుతున్నాయి. లెబనాన్‌లోని క్ఫర్ కిలా గ్రామంలో ఇజ్రాయెల్ సైనికులు మకాం వేసిన ఓ భవనాన్ని పేల్చేశామని హెజ్బొల్లా ప్రకటించింది. ఈ దాడిలో ఎనిమిది మంది ఇజ్రాయెల్ సైనికులు మరణించారు. హెజ్బొల్లాతో పోరులో సైనికులను కోల్పోవడం ఇజ్రాయెల్‌కు ఇదే మొదటిసారి. ఒడైస్సె, యరౌన్ ప్రాంతాల్లోనూ ఇజ్రాయెల్ బలగాలపై దాడులు చేసి, నష్టం కలిగించామని హెజ్బొల్లా తెలిపింది. దీంతో ఈ ప్రాంతాలను సైతం ఇజ్రాయెల్ సైనికులు వదిలి వెనక్కు వెళ్లిపోయినట్టు పేర్కొన్నది. సరిహద్దులో ఇజ్రాయెల్ సైనిక శిబిరాలే లక్ష్యంగా 100 రాకెట్లతో దాడి చేసినట్టు హెజ్బొల్లా మీడియా అధికారి మొహమ్మద్ అఫీఫ్ ప్రకటించారు.

సరిహద్దుకు భారీగా ఇజ్రాయెల్ దళాలు

హెజ్బొల్లాపై పోరును మరింత తీవ్రం చేసే లక్ష్యంతో లెబనాన్ సరిహద్దుకు దాదాపు 10 వేల మంది సైన్యాన్ని తరలించాలని ఇజ్రాయెల్ నిర్ణయించింది. సరిహద్దుల్లో దాడులు తీవ్రతరం చేయనున్న నేపథ్యంలో దక్షిణ లెబనాన్ సరిహద్దున ఉన్న మరో 24 గ్రామాల ప్రజలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిందిగా ఇజ్రాయెల్ మిలిటరీ హెచ్చరించింది. లెబనాన్‌పై గగనతల దాడులను ఇజ్రాయెల్ కొనసాగిస్తున్నది. తూర్పు లెబనాన్‌లోని బెకా వ్యాలీపై బుధవారం దాడి చేసింది. దక్షిణ బీరుట్‌లోనూ ఇజ్రాయెల్ ఐదు పేలుళ్లు జరిపింది.

గాజాపై మరోసారి ఇజ్రాయెల్ దాడి

కొన్ని రోజులుగా గాజా స్ట్రిప్‌పై దాడులకు విరామం ఇచ్చిన ఇజ్రాయెల్ మంగళవారం రాత్రి నుంచి మరోసారి బాంబుల వర్షం కురిపిస్తున్నది. గాజాలోని ఖాన్ యూనిస్ నగరంపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 12 మంది పిల్లలు, ఏడుగురు మహిళలు సహా 51 మంది మరణించారు. సహాయక శిబిరాలపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడిందని పాలస్తీనా వర్గాలు ఆరోపించాయి. కాగా, సిరియా రాజధాని డమాస్కస్‌పైనా ఇజ్రాయెల్ దాడి చేసింది. పశ్చిమ డమాస్కస్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో ముగ్గురు మరణించారు.

నెక్స్ట్ టార్గెట్ ఖమేనీ!

- ఇజ్రాయెల్ తదుపరి లక్ష్యం ఇరాన్ టాప్ లీడరే!
- సంచలనంగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ వీడియో సందేశం



జెరూసలెం: ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణుల దాడితో పశ్చిమాసియా మొత్తం నిప్పుల గుండంలా మారింది. ఏ క్షణాన ఏం జరగబోతున్నదో తెలియటం లేదు. ఇరాన్ దాడిపై నెతన్యాహూ స్పందిస్తూ.. 'ఇరాన్ నాయకులు మా బలాన్ని, ప్రతిదాడి సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేశారు. వారు అర్థం చేసుకొనేలా ప్రతి దాడి చేస్తాం' అని స్పష్టంచేశారు. దీంతో ఇజ్రాయెల్ టార్గెట్‌గా ఇరాన్ మారిందన్న సంకేతాలు వచ్చాయి. అటు.. టెల్‌అవీన్‌పై దాడుల వెనుక, ఆ ప్రాంతంలో అస్థిరత్వానికి ఇరాన్ సుప్రీం లీడరే కారణం అని ఇజ్రాయెల్ సైనికాధికారులు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఐడీఎఫ్ గురి ఇరాన్ టాప్ లీడర్ ఖమేనీపై ఉన్నట్టు తెలుస్తున్నది. ఇరాన్‌పై దాడిచేసే క్రమంలో ఆ దేశానికి ఆయువు పట్టులా ఉన్న ఆర్థిక, కమ్యూనికేషన్ వ్యవస్థను దెబ్బ తీసే అవకాశాలున్నాయి. చమురు, గ్యాస్, కమ్యూనికేషన్లు, బ్యాంకింగ్ తదితర రంగాలే తమ లక్ష్యం అని ఐడీఎఫ్ అధికారి ఒకరు పేర్కొన్నారు.

ఇరాన్ మూల్యం చెల్లించాల్సిందే

తమ దేశంపై క్షిపణి దాడులకు పాల్పడి ఇరాన్ పెద్ద తప్పు చేసిందని, ఇందుకు ఆ దేశం మూల్యం చెల్లించాల్సిందేనని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ హెచ్చరించారు. బుధవారం ఇజ్రాయెల్ భద్రతా బలగాల అధినేతలతో నెతన్యాహూ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇరాన్‌లోని ముఖ్యమైన లక్ష్యాలను తాము గుర్తించి, శక్తిమంతంగా దాడులు చేయగలమని ఇజ్రాయెల్ సైన్యాధ్యక్షుడు హెర్జి హలేవీ హెచ్చరించారు.



ఐరాస చీఫ్‌పై ఇజ్రాయెల్ నిషేధం

టెల్ అవీవ్: ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తమ దేశంలోకి ప్రవేశించకుండా నిషేధం విధిస్తున్నట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. తమ దేశంపై ఇరాన్ జరిపిన క్షిపణుల దాడిని నిర్ద్వంద్వంగా ఖండించడంలో గుటెరస్ విఫలమయ్యారని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ బుధవారం పేర్కొన్నారు. ఇరాన్ దాడిని ఖండించలేని ఎవరికీ ఇజ్రాయెల్ నేలపై కాలు పెట్టే అర్హత లేదని కట్జ్ పేర్కొన్నారు.

సంయమనం పాటించండి: భారత్

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. సామాన్య పౌరుల రక్షణ కోసం సంయమనం పాటించాలని పిలుపునిచ్చింది. చర్చలు, దౌత్యం ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించింది. కాగా, ఇరాన్‌లోని భారతీయులు అప్రమత్తంగా ఉండాలని, తమ కార్యాలయంతో కాంటాక్ట్‌లో ఉండాలని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం సూచించింది. ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు పెట్టుకోవద్దని భారతీయులకు సూచించింది. మరోవైపు ఇజ్రాయెల్‌లోని భారతీయులకూ టెల్ అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయం ఇవే సూచనలు చేసింది. కాగా, ఇరాన్‌లోని తమ దేశస్థులు వెంటనే తిరిగి రావాలని ఫ్రాన్స్ పిలుపునిచ్చింది. ఇరాన్ గగనతలం నుంచి రాకపోకలు వద్దని ఐరోపా ఎయిర్‌లైన్‌లకు యూరోపియన్ యూనియన్ ఏవియేషన్ సేఫ్టీ ఏజెన్సీ సూచించింది.

వీసా ఫీజుల్ని 60% పెంచిన న్యూజిలాండ్

కాన్‌బెర్రా, అక్టోబర్ 2: వృత్తి, పర్యాటకం, విద్య.. సహా అన్ని రకాల క్యాటగిరీల వీసా ఫీజుల్ని న్యూజిలాండ్ భారీగా పెంచింది. ఈ నెల 1 నుంచే ఇవి అమల్లోకి వచ్చినట్టు ఆ దేశం ప్రకటించింది. దీంతో ఉద్యోగం, పర్యాటకం, ఉన్నత విద్య కోసం ఆ దేశానికి వెళ్లే భారతీయులపై ఇది తీవ్ర ప్రభావం చూపనున్నది. స్టూడెంట్ వీసా ఫీజును 188(రూ. 15,787) నుంచి 300 డాలర్ల (రూ.25వేలు)కు, టూరిస్ట్ వీసా ఫీజును 119 డాలర్ల (రూ.10వేలు) నుంచి 188 (రూ.15,787)డాలర్లకు పెంచుతూ న్యూజిలాండ్ నిర్ణయం తీసుకుంది.

జన్ సురాజ్ పేరుతో ప్రశాంత్ కిషోర్ కొత్త పార్టీ

పాట్నా: ఎన్నికల ప్రచార వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బుధవారం జన్ సురాజ్ పార్టీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విద్య, ఉద్యోగావకాశాల కోసం బీహార్ ప్రజలు ఓట్లు వేయడం లేదని, అందుకే వారికి అవి లభించడం లేదని చెప్పారు. వీటిపట్ల వారికి అవగాహన కల్పించే ఉద్యమమే జన్ సురాజ్ అని వివరించారు. పార్టీ సంస్థాగత ఎన్నికలు మార్చిలో జరుగుతాయని ప్రశాంత్ కిశోర్ చెప్పారు. అప్పటి వరకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షునిగా మాజీ ఐఎఫ్ఎస్ అధికారి మనోజ్ భారతిని నియమిస్తున్నట్లు తెలిపారు.

'లవ్ జిహాద్'తో దేశ ఐక్యతకు ముప్పు

యూపీ కోర్టు హెచ్చరిక

బరేలీ: లవ్ జిహాద్ మన దేశానికి పెను ముప్పు అని ఉత్తరప్రదేశ్‌లోని ఓ కోర్టు హెచ్చరించింది. ఓ కమ్యూనిటీకి చెందిన సంఘ వ్యతిరేక శక్తులు భారతదేశంపై ఆధిపత్యాన్ని సాధించేందుకు దీనిని ప్రయోగిస్తున్నట్లు తెలిపింది. అంతర్జాతీయ కుట్ర, మైనారిటీల జనాభాను విపరీతంగా పెంచుకోవడం ద్వారా తమ లక్ష్యాన్ని సాధించాలనుకుంటున్నారని చెప్పింది. ఓ కేసు విచారణ సందర్భంగా అదనపు జిల్లా జడ్జి (ఫాస్ట్‌ట్రాక్ కోర్టు) రవికుమార్ దివాకర్ సోమవారం ఈ వ్యాఖ్యలు చేశారు. చట్టవ్యతిరేకంగా మతమార్పిడులకు పాల్పడటం కోసం హిందూ యువతులను ప్రేమ పేరుతో ప్రలోభాలకు గురి చేస్తున్నారని చెప్పారు. పాక్, బంగ్లాదేశ్‌లలో ఉన్న పరిస్థితులను భారత్‌లో కూడా సృష్టించాలనుకుంటున్నారని తెలిపారు. ఈ కేసులో దోషి మహమ్మద్ అలీంకు జీవిత ఖైదు, అతని తండ్రికి రెండేళ్ల జైలు శిక్ష విధించారు.

రష్యా ఆధీనంలోకి మరో ఉక్రెయిన్ పట్టణం

కీవ్: తూర్పు ఉక్రెయిన్‌లోని వుహ్లెదార్ పట్టణాన్ని రష్యా సైన్యం సంపూర్ణంగా తన నియంత్రణలోకి తెచ్చుకుంది. కొండ ప్రాంతంలోని ఈ పట్టణం వ్యూహాత్మకంగా కీలకమైనది. ఈ పట్టణం నుంచి తమ దళాలను ఉపసంహరించుకున్నట్లు ఉక్రెయిన్ సైన్యం బుధవారం ధ్రువీకరించింది. సైన్యం, పరికరాలను పరిరక్షించుకోవడానికి డొనెట్స్క్ ప్రాంతంలో ఉక్రెయిన్‌కు ఈ పట్టణం చాలా ముఖ్యమైనది. ఈ పట్టణం గుండా రష్యా, ఉక్రెయిన్‌లకు రవాణా సదుపాయాలు ఉన్నాయి. మొత్తం డొనెట్స్క్ రీజియన్‌పై పట్టు సాధించడంలో ఇది గొప్ప ముందడుగు అని రష్యా భావిస్తున్నది.

చైనా సీసీటీవీలపై కేంద్రం ఆంక్షలు?

లెబనాన్‌లో పేజర్ల పేలుళ్ల నేపథ్యంలో నిర్ణయం

సీసీటీవీలతో డాటా లీక్ అయ్యే ప్రమాదం!



న్యూఢిల్లీ, అక్టోబర్ 2: లెబనాన్‌లో ఒకేసారి వందలాది పేజర్లు పేలిపోవడం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఎలక్ట్రానిక్ పరికరాలు శత్రువుల చేతిలో ఆయుధాలుగా మారే ముప్పు ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చైనాలో తయారైన సీసీటీవీ కెమెరాలు, ఇతర నిఘా పరికరాల వినియోగంపై భారత్‌లో ఆంక్షలు విధించాలని భావిస్తున్నది. ఈ మేరకు అక్టోబర్ 8 నుంచి కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. చైనా తయారీ పరికరాలపై ఆంక్షలతో పాటు దేశంలో తయారైన వాటినే వినియోగించేలా ఈ విధానం ఉండనుంది. నిజానికి ఇందుకు సంబంధించిన గెజిట్ గతంలోనే వచ్చినప్పటికీ లెబనాన్‌లో పేజర్ల పేలుళ్ల నేపథ్యంలో ఇప్పుడు అమలులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. కీలక ప్రాంతాల్లో అమర్చే సీసీటీవీల ద్వారా ప్రజల కదలికలు, ఇతర డాటా బయటికి లీక్ అయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో భారత్‌లోనే పూర్తిస్థాయిలో తయారయ్యే పరికరాలను మాత్రమే వినియోగించేలా ఈ విధానంలో చర్యలు తీసుకోనుంది. ప్రస్తుతం భారత మార్కెట్‌లో సీపీ ప్లస్, హిక్‌విజన్, దహువా కంపెనీలు 60 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయి. వీటిల్లో సీపీ ప్లస్ భారత్‌కు చెందిన కంపెనీ కాగా, మిగతా రెండు చైనా సంస్థలు. ఇప్పటికే అమెరికా సైతం ఈ కంపెనీల పరికరాల వినియోగంపై ఆంక్షలు విధించింది.



రోజుకో పూట ఉపవాసంతో

మధుమేహ నియంత్రణ

న్యూఢిల్లీ: మధుమేహ వ్యాధిగ్రస్తులైనా, హృద్రోగులైనా సరే.. రోజుకు ఒక పూట ఉపవాసం చేస్తే మధుమేహం నియంత్రణలో ఉండటంతో పాటు గుండె ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తాజా అధ్యయనం తెలిపింది. ప్రతి 10 గంటలకు ఒకసారి తింటే.. జీవక్రియ మెరుగుపడుతుందని తేలింది. రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయని, కొలెస్ట్రాల్ తగ్గుతుందని అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్‌డియాగో, సాల్క్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడైంది. మెటబాలిక్ సిండ్రోమ్‌తో బాధపడుతున్న 108 మందిని పరీక్షించగా మెరుగైన ఫలితాలు వచ్చినట్టు పరిశోధకులు తెలిపారు.



ఢిల్లీలో 2 వేల కోట్ల డ్రగ్స్ పట్టివేత

500 కిలోల కొకైన్ స్వాధీనం.. నలుగురి నిందితుల అరెస్ట్

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరం ఢిల్లీలో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. సుమారు రూ.2 వేల కోట్ల విలువైన 500 కిలోల కొకైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అరెస్ట్ చేశారు. దీని వెనుక అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా సిండికేట్ ఉందని తెలిపారు. ఢిల్లీలో ఈ స్థాయిలో డ్రగ్స్ పట్టుబడటం ఇదే తొలిసారి. కాగా, ఢిల్లీలోని తిలక్ నగర్ ప్రాంతంలో ఆదివారం ఇద్దరు ఆఫ్ఘాన్ జాతీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి 400 గ్రాముల హెరాయిన్, 160 గ్రాముల కొకెయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదే రోజు ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడి నుంచి 1,660 గ్రాముల కొకెయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.24 కోట్లు.

సద్గురు ఏమిటీ బోధనలు?

సొంత కూతురికి పెండ్లి చేసి, ఇతరులను సన్యాసినులుగా ఎందుకు మార్చుతున్నారు?

ఈషా ఫౌండేషన్‌ను ప్రశ్నించిన మద్రాస్ హైకోర్టు

చెన్నై: సద్గురు జగ్గీ వాసుదేవ్ ఓ వైపు తన కుమార్తెకు పెండ్లి చేసి జీవితంలో స్థిరపడేట్లు చేసి, మరోవైపు ఇతర యువతులను సన్యాసినులుగా బతికేలా ఎందుకు ప్రోత్సహిస్తున్నారని మద్రాస్ హైకోర్టు ప్రశ్నించింది. తన ఇద్దరు కుమార్తెలు బాగా చదువుకున్నారని, వారు పెండ్లి చేసుకోకుండా ఈషా యోగా సెంటర్ బ్రెయిన్ వాష్ చేస్తున్నదని రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్ కామరాజ్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరుపుతున్నది. అయితే, 42, 39 సంవత్సరాల వయసుగల ఈ ఇద్దరు మహిళలు సోమవారం హైకోర్టుకు హాజరై, తాము తమ ఇష్ట ప్రకారమే, స్వీయ నిర్ణయంతోనే ఈషా యోగా సెంటర్‌లో ఉంటున్నామని చెప్పారు. ఈషా ఫౌండేషన్‌కు సంబంధించిన అన్ని కేసుల జాబితాను తయారు చేసి, నివేదికను సమర్పించాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. దీంతో దాదాపు 150 మంది పోలీసులు మంగళవారం ఈషా ఫౌండేషన్‌లో తనిఖీలు చేశారు. కాగా పెండ్లి చేసుకోవాలని కానీ, బ్రహ్మచర్యం చేపట్టాలని కానీ తాము చెప్పబోమని ఈషా ఫౌండేషన్ వివరణ ఇచ్చింది.

రైతు బిడ్డల్ని 'ఫస్ట్ రేట్' అమ్మాయిలు మనువాడరు!

మహారాష్ట్ర ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

ముంబై: వ్యవసాయం చేసే యువకులను అందమైన అమ్మాయిలు పెండ్లి చేసుకోవడం లేదని మహారాష్ట్ర ఎమ్మెల్యే దేవేంద్ర భూయర్ చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. మహారాష్ట్రలోని అమరావతి జిల్లా, వరుద్ తహశీల్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఓ అమ్మాయి అందంగా ఉంటే, ఆమె పెండ్లి చేసుకోవడానికి నీలాంటి, నాలాంటివాళ్లని ఇష్టపడటం లేదు. ఆమె ఉద్యోగస్థుడినే ఎంచుకుంటున్నది. నంబర్ 2లో, ఓ మోస్తరు అందంగా ఉండే అమ్మాయిలు కిరాణా దుకాణం, పాన్ కొట్టు నడిపే యువకులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అందంలో తక్కువ స్థాయిలో ఉన్న అమ్మాయిలు రైతుల కుమారులను చేసుకుంటున్నారు' అని అన్నారు. అలాంటివారికి అందగాళ్లు పుట్టడం లేదన్నారు. దేవేంద్ర భూయర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. ఆయన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు మద్దతిస్తున్నారు. దేవేంద్ర వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత యశోమతి ఠాకూర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



చేతిలో జాతీయ జెండాతో

సీఎం బూట్లు విప్పిన కాంగ్రెస్ కార్యకర్త

సిద్ధరామయ్యపై సర్వత్రా విమర్శలు

బెంగళూరు: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మరో వివాదంలో చిక్కుకున్నారు. గాంధీ జయంతిన జాతీయ జెండాను ఘోరంగా అవమానించారు. కాంగ్రెస్ కార్యకర్త ఒకరు ఓ చేతిలో జాతీయ జెండాను పట్టుకుని, మరో చేత్తో సీఎం సిద్ధరామయ్య బూట్లు విప్పడం వివాదాస్పదంగా మారింది. బుధవారం బెంగళూరులో గాంధీ విగ్రహానికి సిద్ధరామయ్య నివాళి అర్పిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.



బీహార్‌లో వరద సాయం కోసం వచ్చిన ఐఏఎఫ్ హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో బుధవారం ముజఫర్‌పూర్‌లో ఇలా నీళ్లలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు.




దేశానికి జాతిపితలు ఎవరూ లేరు

న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మహాత్మ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీల జయంతి సందర్భంగా ఆమె సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. 'దేశానికి జాతిపితలు ఎవరూ లేరు. కేవలం కుమారులు మాత్రమే ఉన్నారు. భారతమాతకు ఇలాంటి కుమారులు(లాల్ బహదూర్ శాస్త్రి) ఉండటం అదృష్టం' అని ఆమె వ్యాఖ్యానించారు. మహాత్మ గాంధీని ఉద్దేశపూర్వకంగా కంగనా రనౌత్ తక్కువ చేశారని కాంగ్రెస్ ఆరోపించింది.



అలాంటి వారి ఫొటోలు తీసి పేపర్‌లో వేయాలి: గడ్కరీ

నాగ్‌పూర్: పాన్ మసాలా నమిలి రోడ్లపై ఉమ్మివేసే వారి ఫొటోలు తీసి పేపర్‌లో ప్రచురించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. బుధవారం నాగ్‌పూర్‌లో నిర్వహించిన స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ప్రజలు చాలా స్మార్ట్. చాక్లెట్ తిన్న తర్వాత కవర్‌ను వెంటనే పారేస్తారు. అదే వారు విదేశాలను సందర్శించినప్పుడు మాత్రం, చాక్లెట్ తిన్నాక కవర్‌ను జేబులో పెట్టుకుంటారు. విదేశాల్లో చక్కగా ప్రవర్తిస్తారు' అని పేర్కొన్నారు.



చెత్తలో దొరికిన పెయింటింగ్ ఖరీదు రూ.54 కోట్లు!

న్యూఢిల్లీ: వాడి పారేసిన వస్తువులను కొనే జంక్ డీలర్‌కు దొరికిన పెయింటింగ్ ఆయన కుటుంబానికి అదృష్టం తీసుకొచ్చింది. ఇటలీలోని జంక్ డీలర్ రోస్సో 1962లో కాప్రిలో ఉన్న ఓ ఇంటిని శుభ్రం చేస్తుండగా ఓ పెయింటింగ్ దొరికింది. దాని మీద పాబ్లో పికాసో సంతకం కూడా ఉంది. దానిని ఆయన పొంపెయిలోని తన ఇంటికి తీసుకెళ్లి, గోడకు తగిలించాడు. దీని గురించి అధ్యయనం చేయగా ఇది పికాసో గీసిన చిత్రమని జంక్ డీలర్ కుమారుడు ఆండ్రియో గుర్తించాడు. అయితే ఈ పెయింటింగ్ పికాసో చిత్రీకరించినదేనని పికాసో ఆథెంటికేటర్స్ ఇంకా నిర్ధారించ లేదు. నిర్ధారిస్తే దీని విలువ రూ. 54.58 కోట్లు ఉంటుంది.

నేటి నుంచి శరన్న నవరాత్రోత్సవాలు

- మండపాల్లో కొలువుదీరనున్న అమ్మవారు
- తిరుచానూరులో 10 రోజులపాటు కల్యాణోత్సవం సేవ రద్దు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తేతెలంగాణ): నేటి నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు అమ్మవారి ఆలయాలు, మండపాలు ముస్తాబయ్యాయి. భక్తులు తొమ్మిది రోజులపాటు తీరొక్క అవతారంలో దర్శనమిచ్చే అమ్మవారికి భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహించనున్నారు. తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో నేటి నుంచి 12వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ మధ్యాహ్నం 3గంటలకు శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో పద్మావతి అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిస్తామని టీటీడీ అధికారులు వెల్లడించారు. 12న విజయదశమిని పురస్కరించుకొని రాత్రి 7:45 గంటలకు పద్మావతి అమ్మవారు గజ వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. కాగా, నవరాత్రి ఉత్సవాల కారణంగా 10 రోజుల పాటు కల్యాణోత్సవం సేవను రద్దు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. 4, 11వ తేదీల్లో లక్ష్మీపూజ, 12న ఊంజల సేవలను రద్దు చేసినట్టు వివరించారు.

రాష్ట్రంలో రౌడీల పాలన!

- పట్టపగటే కేటీఆర్ హత్యకు కుట్ర
- సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలో పోలీసులు పావులు
- నిందితులను ఎందుకు అరెస్టు చేయలే?
- సీఎం ధనదాహానికి హైడ్రా ఆయుధం
- మంత్రి కొండా సురేఖ వెంటనే క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పక్కన రాకేశ్‌రెడ్డి, పల్లె రవికుమార్

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రౌడీల పాలన, గూండాల పాలన, రాక్షస పాలన సాగుతున్నదని బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పట్టపగలే నట్టనడి నగరంలో ప్రధాన ప్రతిపక్ష నేత కేటీఆర్‌పై హత్యకు కుట్ర పన్నారని విమర్శించారు. ప్రపంచ బ్యాంకుతో రేవంత్‌రెడ్డి కుమ్మక్కై మూసీ సుందరీకరణ పేరుతో రూ.లక్షా 50 వేల కోట్ల అవినీతికి తెరలేపారని, ఆ కుట్రను బీఆర్ఎస్ అడ్డుకున్నది కాబట్టే కేటీఆర్ కాన్వాయ్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడిచేశారని మండిపడ్డారు. హైదరాబాద్ నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోతె రోహిత్ ఆధ్వర్యంలో కేటీఆర్ కాన్వాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. రేవంత్‌రెడ్డి ధనదాహానికి హైడ్రా ఆయుధంలా మారిందని, ఆయన బండారం త్వరలో బట్టబయలు అవుతుందని పేర్కొన్నారు. రేవంత్ రహస్య ఒప్పందాలను త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు. శ్రీలంకలో రాజపక్సే సోదరులపై ప్రజలు తిరుగుబాటు చేసినట్టు తెలంగాణలో రేవంత్‌రెడ్డిపై తిరుగుబాటు తప్పదని అన్నారు. బుధవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పట్టపగలు కేటీఆర్ కాన్వాయ్‌పై దాడికి పాల్పడితే పోలీసులు ఎందుకు అడ్డుకోలేకపోయారని, పోలీస్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఎటుపోయిందని నిలదీశారు. దాడి ఘటన వ్యవహారంలో పోలీసుల వైఖరి అనుమానాస్పదంగా ఉన్నదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి కుట్రకు పోలీసులు పావులు అవుతున్నారని చెప్పారు. దాడి జరిగి 26 గంటలైనా నిందితులను పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు. తానే కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్నట్టు ట్వీట్ చేసినా రోహిత్‌ను ఎందుకు అదుపులోకి తీసుకోలేదని ప్రశ్నించారు. పోలీసులు కాంగ్రెస్‌కు కొమ్ము కాస్తున్నారా? అని నిలదీశారు.

బీఆర్ఎస్ నేతలపై వరుస దాడులు

కాంగ్రెస్ రాక్షస పాలనతో ప్రతిపక్ష నేతల ఇండ్లు, కార్యాలయాలపై దాడులు నిత్యకృత్యంగా మారాయని, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తాము ఏనాడూ ఇలా దాడులకు పాల్పడలేదని ప్రవీణ్‌కుమార్ గుర్తుచేశారు. తాజాగా తెలంగాణభవన్ వద్దకు కాంగ్రెస్ నేతలు వచ్చి దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా, అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలపైనే పోలీసులు కేసులు పెట్టారని మండిపడ్డారు. తమ పార్టీ ఆఫీసుపై దాడికి వచ్చిన వారిపై పోలీసులు కేసు నమోదు చేయలేదని, పోలీసులు ఈ వివక్ష ఎందుకు చూపుతున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ నేతలు ఏనాడూ ఇతర పార్టీల కార్యాలయాల్లోకి వెళ్లలేదని గుర్తుచేశారు. కానీ, సిద్దిపేటలో హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై, పాడి కౌశిక్‌రెడ్డిపై ఇంటిపై కాంగ్రెస్ నేతలు దాడి చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మూసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ చేస్తున్న రూ.1.50 లక్షల కోట్ల అవినీతిని బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటున్నందునే దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి ప్రపంచ బ్యాంకు వైపు ఉంటే.. బీఆర్ఎస్ పీడిత ప్రజల పక్షాన ఉన్నదని చెప్పారు. కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలపై ఎన్ని దాడులు చేసినా ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూనే ఉంటామని స్పష్టంచేశారు. ప్రపంచ బ్యాంకు ఏజెంట్లు ఎన్ని దాడులు చేసినా ఎదుర్కొంటామని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు సంయమనంతో వ్యవహరిస్తున్నారని, ఓపికకూ ఒక హద్దు ఉంటుందని పేర్కొన్నారు.

రేవంత్‌వి అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్

రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నట్టు ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. హైడ్రాపై ప్రజల్లో వ్యతిరేకత వస్తున్నందున కొండా సురేఖతో అసంబద్ధమైన వ్యాఖ్యలు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఆమె వ్యాఖ్యలు కాంగ్రెస్ నీచ సంస్కృతికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. సురేఖ తన వ్యాఖ్యలపై మహిళాలోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమె తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సూచించారు. సురేఖకు మంత్రివర్గంలో ఉండే అర్హత లేదని, ఆమె వ్యాఖ్యలపై లీగల్‌గా ముందుకు వెళ్తామని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పల్లె రవీందర్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, తుంగ బాలు, నరేందర్, రాజు పాల్గొన్నారు.



ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జా తల్లి విజయభారతి అనారోగ్యంతో ఇటీవల మరణించగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పార్టీ నాయకులు ఉన్నారు.

గౌతమ్ అదానీతో పొంగులేటి భేటీ

> మొదటిపేజీ తరువాయి...



భేటీనా? ప్రభుత్వం తరఫున జరిగిన భేటీనా? అన్నదానిపై స్పష్టత లేదు. వీరిద్దరితోపాటు కాంగ్రెస్ పార్టీకి సోషల్ మీడియా కన్సల్టెంట్‌గా ఉన్న సునీల్ కొనుగోలు కూడా ఉన్నారని విశ్వసనీయంగా తెలిసింది. సుమారు గంటకుపైగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, గౌతమ్ అదానీ మధ్య సమావేశం జరిగినట్టు చెప్తున్నారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో సమావేశం అనంతరం అదానీ తిరిగి వెళ్లినట్టు తెలిసింది. అయితే, భేటీపై రాష్ట్రప్రభుత్వం, మంత్రి పొంగులేటి, అదానీ గ్రూప్ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. ఒకవైపు జాతీయస్థాయిలో అదానీపై కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేస్తుండగా, సీఎం రేవంత్ దావోస్‌లో అదానీలో ఒప్పందాలు చేసుకోవటం, నంబర్ 2గా చెప్పుకుంటున్న పొంగులేటి.. ఆయనతో రహస్య భేటీ కావటం రాజకీయంగా పెద్ద చర్చ జరుగుతున్నది. రాష్ట్రంలో దోస్తీ.. దేశవ్యాప్తంగా కుస్తీ ఏమిటని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అదానీతో ఎందుకు అంటకాగుతున్నారని కాంగ్రెస్ పార్టీలోనూ పలువురు సీనియర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఎందుకు కలిశారు..?

అదానీ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోబోతున్నట్టు గతంలో ప్రభుత్వం ప్రకటించింది. కానీ, విమర్శలు రావడంతో ఒప్పంద వివరాలు మాత్రం వెల్లడించలేదు. అయితే, నగర శివారులో అతి పెద్ద భూమికి సంబంధించిన అంశంపై వీరి భేటీ జరిగినట్టు ప్రచారం జరుగుతున్నది. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన ఓ కంపెనీని అదానీ సంస్థ తిరిగి కొనుగోలు చేస్తున్నదని.. ఆ కంపెనీ కొనుగోలు విషయంలో ఇద్దరు కలిశారని చెప్తున్నారు. అదానీతో తన కంపెనీకి సంబంధించిన డీల్ ఫైనల్ చేసుకోవడానికే పొంగులేటి కలిశారని, దానికోసం రాష్ట్రంలోని పలు కీలకమైన ప్రాజెక్టులు అదానీ గ్రూపునకు ఇచ్చే అంశంపైనా చర్చ జరిగినట్టు చెప్తున్నారు. సింగరేణి బొగ్గు గనులు, విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు, విద్యుత్తు ప్రాజెక్టులు తదితర వాటికి సంబంధించి కీలక చర్చలు జరిగినట్టు తెలిసింది. ప్రభుత్వం కూడా ఒక భారీ ప్రాజెక్టును అదానీకి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నట్టు చెప్తున్నారు.

రాయదుర్గంలోని 84 ఎకరాలను కట్టబెట్టేందుకేనా?: కేటీఆర్

ఐటీసీ కోహినూర్‌లోని ప్రెసిడెన్షియల్ సూట్‌లో తెలంగాణ క్యాబినెట్‌లోని నంబర్-2తో అదానీ ఎందుకు సమావేశమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. ఇదే సమావేశంలో సునీల్ కనుగోలు కూడా ఉన్నారని, ఆయన ఏం చేస్తున్నారని అడిగారు. అదానీతో కాంగ్రెస్ దోస్తీ కట్టిందా? లేదంటే రాయదుర్గంలోని 84 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని అదానీకి కట్టబెట్టే కుట్ర చేస్తున్నారా? అని నిలదీశారు.

9 నెలల్లో 842 కేసులు

దూకుడు పెంచిన ఎక్సైజ్‌శాఖ

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దూకుడు పెంచింది. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అక్రమ మద్యం రవాణా, గంజాయి మూలాలను తుదముట్టించడంలో పైచేయి సాధించింది. తొమ్మిది నెలల కాలంలో 842 కేసులు నమోదుచేసింది. 1,445 మందిని అరెస్టుచేసింది. 364 వాహనాలను సీజ్‌చేసింది. ప్రత్యేకంగా సెప్టెంబర్ మాసంలోనే 43 కేసులు నమోదుకాగా, 134 మందిని అరెస్టుచేయడమే కాకుండా 715 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జనవరి నుంచి సెప్టెంబర్ వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పనితీరుపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి బుధవారం సమీక్షించారు. మాదకద్రవ్యాల కట్టడికి కృషిచేసిన అధికారులను అభినందించారు.

9నెలల్లో పట్టుకున్నవి..

మాదక ద్రవ్యాలు	కేజీలు, గ్రాములు
గంజాయి	5214 కిలోలు
హషిష్ ఆయిల్	7.35కిలోలు
గంజాయి ఆయిల్	1.1కిలోలు
గంజాయి చాక్లెట్స్	72.66 కిలోలు
ఆల్ప్రజోలం	16.65 కిలోలు
ఆల్ప్రజోలం టాబ్లెట్స్	10.67 కిలోలు
డైజోఫాం	1.52 కిలోలు

పోలీస్‌స్టేషన్లలో దొంగలుపడ్డారు?

- ఠాణాల నుంచి బ్యాటరీ సైకిళ్లు మాయం!
- చోరీ అయ్యాయా..? చేతి వాటమా?
- ఆరా తీస్తున్న అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ): సైకిల్ పెట్రోలింగ్ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీస్‌స్టేషన్లకు అప్పగించిన బ్యాటరీ సైకిళ్లు, హెల్మెట్లు కనిపించడం లేదు. ఆ సైకిళ్లు ఎక్కడున్నాయి? దొంగలు అపహరించారా? సిబ్బంది చేతివాటం ప్రదర్శించారా? అనేది ప్రస్తుతం సిటీ పోలీసుల్లో చర్చనీయాంశంగా మారింది. పెట్రోలింగ్ వ్యవస్థ పటిష్టతకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 130కిపైగా సైకిళ్లు వివిధ పోలీస్‌స్టేషన్లకు పంపిణీ చేశారు. ఒక్కో సైకిల్‌కు హెల్మెట్, ఫస్ట్ ఎయిడ్ కిట్, మ్యాన్‌ప్యాక్, లాఠీ, సైరన్, ఎల్ఈడీ లైట్, వాటర్ బాటిళ్లతో కూడిన కిట్‌ను కూడా అందజేశారు. కార్లు వెళ్లని ప్రాంతాల్లో సిబ్బంది బైకులు, సైకిళ్ల మీదుగా వెళ్లి బస్తీ, గల్లీలో పెట్రోలింగ్ నిర్వహించారు. సౌత్‌జోన్‌లోని ఠాణాలకు 13, సెంట్రల్ 24, వెస్ట్‌జోన్ 20, ట్రాఫిక్ ఠాణాలకు 50, ఎస్బీకి 19, సీపీ కార్యాలయానికి 9 సైకిళ్లను అందజేశారు. ఆ తర్వాత చైనా నుంచి కూడా సైకిళ్లను తెచ్చి సిబ్బందికి ఇవ్వగా, కొన్ని పాడైపోయాయి. ప్రభుత్వం మారింది, అధికారులు మారుతూ వచ్చారు. ఆ క్రమంలోనే చాలా సైకిళ్లు ఠాణాల నుంచి మాయమవుతూ వచ్చాయి. సైకిళ్లు పనిచేయకపోతే సిటీ ఆర్మ్‌డ్ రిజర్వు ఫోర్స్(కార్) హెడ్ క్వార్టర్స్‌కు తరలిస్తుంటారు. తుక్కుగా అమ్మేశారా? అనే విషయం కూడా లెక్కల్లో లేదని సమాచారం.

సైకిళ్ల మాయంపై ఆరా...!

సైకిళ్లు మాయమవుతున్నాయనే విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో ఎన్ని సైకిళ్లు పీఎస్‌లో ఉన్నాయి? అవి ఎక్కడికి పోయాయి? అనే విషయాన్ని తెలుసుకుంటున్నారు. కార్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ రక్షిత మూర్తిని వివరణ కోరగా సైకిళ్లు ఎక్కడెక్కడున్నాయనే విషయంపై ఆరా తీస్తున్నామని తెలిపారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 2: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం అల్లాపూర్ గ్రామంలో ఓ చిన్నారిపై వీధి కుక్కలు దాడిచేశాయి. గ్రామానికి చెందిన విఠల్‌రావు కూతురు వాణిశ్రీ బుధవారం ఆరుబయట ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో చిన్నారి ముఖం, తలపై గాయాలయ్యాయి. తల్లిదండ్రులు వెంటనే దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. కుక్కల బెడద తప్పించాలని స్థానికులు కోరుతున్నారు.

వాణిజ్య




సింగిల్ చార్జింగ్‌తో 581 కిలోమీటర్లు


స్కోడా ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ

హైదరాబాద్, అక్టోబర్ 2: దేశీయంగా ఈవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రముఖ కార్ల తయారీ సంస్థ స్కోడా..సరికొత్త ఈవీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో పోటీని తీవ్రతరం చేయాలనే ఉద్దేశంతో ఎల్రోక్ మోడల్‌ను ప్రవేశపెట్టింది. 82 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ మోడల్ సింగిల్ చార్జింగ్‌తో 581 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. కేవలం 6.6 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. దీంతోపాటు మరో మోడల్ ఎల్రోక్ 50ని కూడా పరిచయం చేసింది. 52 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన ఈ మోడల్ సింగిల్ చార్జింగ్‌తో 375 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఈ రెండు మోడళ్లు రియర్ డ్రమ్ బ్రేక్స్ ఉన్నాయి. ఐదుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన ఈ కారులో 13 ఇంచుల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, పూర్తిస్థాయిలో డిజిటల్ స్క్రీన్, 470 లీటర్ల బూట్ స్పేస్ వంటి ఫీచర్లు ఉన్నాయి.

గిలీడ్‌తో రెడ్డీస్, హెటిరో జట్టు



న్యూఢిల్లీ, అక్టోబర్ 2: గిలీడ్ సైన్సెస్ ఐర్లాండ్ యూసీతో హైదరాబాదీ ఔషధ రంగ సంస్థలు డాక్టర్ రెడ్డీస్, హెటిరో జట్టు కట్టాయి. హెచ్ఐవీ చికిత్సలో వినియోగించే లెనకాపవిర్ డ్రగ్ తయారీ, మార్కెటింగ్ కోసం ఇరు కంపెనీలు గిలీడ్‌తో నాన్-ఎక్స్‌క్లూజివ్, రాయల్టీ-ఫ్రీ వాలంటరీ లైసెన్సింగ్ ఒప్పందాలను చేసుకున్నాయి. భారత్‌తోపాటు మరో 120 దేశాల్లో ఈ భాగస్వామ్యాలు కొనసాగుతాయి. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనల్లో రెడ్డీస్, హెటిరో కంపెనీలు తెలియజేశాయి. లెనకాపవిర్‌కు అమెరికా ఔషధ నియంత్రణ మండలి ఆమోదం ఉన్నది. అయినప్పటికీ ఎయిడ్స్‌ను నిరోధించడంలో లెనకాపవిర్ పనితీరును ఇంకా ప్రపంచ దేశాలు గుర్తించాల్సి ఉన్నది.



మదుపరిపై కాసుల వర్షం

స్టాక్స్‌లో పెట్టుబడులకు పెద్ద ఎత్తున లాభాలు

ఈ ఏడాది రూ.110.57 లక్షల కోట్లు ఎగిసిన సంపద

ఆకట్టుకున్న సెన్సెక్స్, మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 2: ఆల్‌టైమ్ హై రికార్డుల్లో పరుగులు పెడుతున్న దేశీయ స్టాక్ మార్కెట్లు.. అదే స్థాయిలో మదుపరులకు లాభాలను తెచ్చిపెడుతున్నాయి. ఈ ఏడాది ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లపై కాసుల వర్షం కురిసింది మరి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) నమోదిత సంస్థల మార్కెట్ విలువ ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా రూ.110.57 లక్షల కోట్లు ఎగిసింది. గడిచిన 9 నెలల్లో నిరంతర మార్కెట్ ర్యాలీ.. మదుపరుల సంపదను రూ.110,57,617.40 కోట్లు పెంచి రూ.4,74,86,463.65 కోట్ల (5.67 ట్రిలియన్ డాలర్లు)కు చేర్చింది. గత నెల 27న మునుపెన్నడూ లేనివిధంగా రూ.477.93 లక్షల కోట్లను తాకడం గమనార్హం.

బీఎస్ఈలో టాప్-5 కంపెనీలు

మార్కెట్ విలువ (రూ.కోట్లలో)

కంపెనీ	మార్కెట్ విలువ
రిలయన్స్ ఇండస్ట్రీస్	19,82,265.88
టీసీఎస్	15,50,820.85
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	13,16,818.45
భారతీ ఎయిర్‌టెల్	9,67,295.41
ఐసీఐసీఐ బ్యాంక్	8,98,320.22

మూడు సూచీల్లోనూ..

బీఎస్ఈలో పెద్ద, మధ్య, చిన్న శ్రేణి సూచీలుగా చెప్పుకొనే సెన్సెక్స్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు ఈ ఏడాది దుమ్మురేపాయి. సెన్సెక్స్ 12,026.03 పాయింట్లు లేదా 16.64 శాతం ఎగబాకింది. ఈ ఏడాది ఆరంభంలో 72,271.94 వద్దే ఉండగా, ఇప్పుడు 84,266.29 వద్ద ఉన్నది. ఇక సెప్టెంబర్ 27నైతే ఆల్‌టైమ్ హై 85,978.25 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సైతం 12,645.24 పాయింట్లు లేదా 34.32 శాతం పుంజుకున్నది. స్మాల్‌క్యాప్ 14,777.09 పాయింట్లు లేదా 34.62 శాతం పెరిగింది. దీంతో ఓవరాల్‌గా బ్లూచిప్, మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లలో పెట్టుబడులు పెట్టిన సగటు మదుపరికి ఈ ఏడాది లాభాలు దక్కాయనే చెప్పవచ్చు.

ఫిబ్రవరి 1 నుంచి..

వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 మొదలు క్వాలిఫైడ్ స్టాక్ బ్రోకర్లు సైతం ఏఎస్‌బీఏ సౌకర్యం మాదిరే తమ క్లయింట్లకు యూపీఐ ఆధారిత బ్లాక్ మెకానిజంను వినియోగించి సెకండరీ మార్కెట్‌లో ట్రేడింగ్ సదుపాయాన్ని కల్పించాల్సి ఉంటుంది. లేదా 3 ఇన్ 1 ట్రేడింగ్ ఖాతా (సేవింగ్స్, డీమ్యాట్, ట్రేడింగ్ అకౌంట్లు ఒకే అకౌంట్‌లో కలిసి ఉన్న) సదుపాయాన్నైనా ఇవ్వాల్సి ఉంటుంది. మదుపరుల సాధికారతే లక్ష్యంగా సెబీ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. ఇదిలావుంటే మున్సిపల్ బాండ్ల సబ్‌స్క్రైబర్స్ కోసం పన్ను ప్రోత్సాహకాలను తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సెబీ కోరింది. అప్పుడే డిమాండ్ బాగుంటుందని అభిప్రాయపడింది. మౌలికాభివృద్ధికి కావాల్సిన నిధుల కోసం ఈ బాండ్లను సర్కారు విక్రయిస్తున్న విషయం తెలిసిందే. మౌలిక రంగ ప్రాజెక్టుల కోసం బాండ్ల ద్వారా 1997 నుంచి మున్సిపాలిటీలు రూ.2,700 కోట్లను సమీకరించాయి.

> *ఈ ఏడాది దేశీయ స్టాక్ మార్కెట్లు ఇంతలా మదుపరులకు లాభాలను పంచిపెట్టడానికి కారణం మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలోకి భారీ ఎత్తున వచ్చిన పెట్టుబడులే. విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) నుంచి అమ్మకాల ఒత్తిడి కొనసాగుతున్నా.. ఈక్విటీ మార్కెట్లు రికార్డు హైలను చేరుతూపోయాయి. దేశీయ మదుపరులు కొనుగోళ్లకు పెద్ద పీట వేయడం ఇందుకు కలిసొచ్చింది. అలాగే మిడ్, స్మాల్‌క్యాప్ సూచీల్లో పెట్టుబడులు రిటైల్ ఇన్వెస్టర్లకు లాభించాయి. మొత్తంగా చూసినట్టైతే ఈ 2024 సంవత్సరం భారతీయ స్టాక్ మార్కెట్లలో ఎప్పుడూలేని ఉత్సాహాన్ని నింపింది.*
>
> **-సంతోష్ మీనా, స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్ రిసెర్చ్ హెడ్**

> *గడిచిన కొద్దివారాలుగా భారతీయ స్టాక్ మార్కెట్లలో జరుగుతున్న ర్యాలీ.. అమెరికా ఫెడ్ రిజర్వ్ తగ్గించిన వడ్డీరేట్లు, రాబోయే ద్రవ్యసమీక్షల్లోనైనా ఆర్బీఐ వడ్డీరేట్లకు కోత పెడుతుందన్న ఆశలతోనేనని చెప్పవచ్చు. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలున్నా అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో నడుస్తుండటం కూడా దేశీయ స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్‌మెంట్ సెంటిమెంట్‌ను పెంచింది. గత నెల కేవలం వారం రోజుల్లోనే సెన్సెక్స్ 2వేల పాయింట్లు పెరగడం మార్కెట్‌లో కొనుగోళ్ల ఉత్సాహానికి నిదర్శనంగా నిలుస్తున్నది.*
>
> **-ప్రశాంత్ తాప్సే, మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ సీనియర్ వీపీ**

భగ్గుమన్న క్రూడాయిల్ ధరలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 2: క్రూడాయిల్ ధరలు భగ్గుమంటున్నాయి. ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులతో దాడి చేయడంతో అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధర ఒక్కసారిగా పుంజుకున్నది. బ్యారెల్ క్రూడాయిల్ ధర బుధవారం ఒక దశలో ఏకంగా 5 శాతం వరకు పెరిగి 75 డాలర్ల పైకి చేరుకున్నది. చివరకు 73.90 డాలర్ల స్థాయిలో కదలాడుతున్నది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో ఇరాన్ నుంచి క్రూడాయిల్ ఎగుమతులు భారీగా పడిపోయాయని ఆర్‌బీసీ క్యాపిటల్ వర్గాలు వెల్లడించాయి.

ఆహార ద్రవ్యోల్బణాన్ని తీసిపారేయద్దు: రాజన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 2: వడ్డీరేట్ల నిర్ణయంలో ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోవద్దంటూ వస్తున్న సూచనల నేపథ్యంలో ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ దీనిపై స్పందించారు. ప్రధాన ద్రవ్యోల్బణం నుంచి ఆహార ధరల సూచీని విడదీయడానికి తాను వ్యతిరేకమన్నారు. ద్రవ్యోల్బణం గణాంకాల ఆధారంగానే ద్రవ్యసమీక్షల్లో కీలక వడ్డీరేట్లను ఆర్బీఐ సవరిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆహార ద్రవ్యోల్బణాన్ని చూడవద్దని, దాన్నిబట్టి వడ్డీరేట్లను నిర్ణయించవద్దన్న సూచనలు వస్తున్నాయి. కానీ ఇది సరికాదన్న అభిప్రాయాన్ని రాజన్ తాజాగా పీటీఐతో వెలిబుచ్చారు.

ఈ ఏడాది కొత్తగా 600 శాఖలు

ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి వెల్లడి



న్యూఢిల్లీ, అక్టోబర్ 2: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) విస్తరణ బాట పట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా కొత్తగా 600 శాఖలను ప్రారంభించాలనుకుంటున్నట్లు బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు, రెసిడెన్షియల్ టౌన్‌షిప్పుల్లో కొత్తగా వీటిని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ 137 శాఖలను ప్రారంభించగా, వీటిలో 59 శాఖలు గ్రామీణ ప్రాంతాల్లో నెలకొల్పింది. ప్రస్తుతం బ్యాంక్ దేశవ్యాప్తంగా 22,542 శాఖలు, 65వేల ఏటీఎంలు, 85 వేల బిజినెస్ కరస్పాండెంట్లను కలిగివున్నది. బ్యాంక్‌కు 50 కోట్ల మంది ఖాతాదారులు ఉన్నారని, ప్రతి భారతీయుడి కుటుంబానికి బ్యాంకింగ్ సేవలు అందించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. బ్యాంక్‌తో అనుబంధంతో ఉన్నవారందరి దృష్టిలో ఉత్తమ బ్యాంక్‌గాను, అత్యంత విలువైన బ్యాంక్‌గా తీర్చిదిద్దడమే తమ తదుపరి లక్ష్యమని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో శెట్టి వెల్లడించారు.

డిపాజిట్ల కోసం..

డిపాజిట్లను ఆకట్టుకోవడానికి బ్యాంక్ త్వరలో వినూత్న పథకాలను అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు ఆయన ప్రకటించారు. రికరింగ్ డిపాజిట్, సిప్ కాంబోలో వినూత్న ఉత్పత్తులను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. సహజంగా ఎవరూ రిస్క్ ఆస్తుల్లో లేదా స్పెక్యులేటివ్ ఆస్తుల్లో పెట్టుబడులు పెట్టాలనుకోరు, వీరికి బ్యాంకింగ్ పథకాలు సరైనవని, వీరికోసం నూతన ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావాలనుకుంటున్నట్లు చెప్పారు. వీటితోపాటు డిపాజిట్లను మొబిలైజేషన్ చేయడానికి ఇప్పటికే బ్యాంక్ పలు కీలక చర్యలు తీసుకుంటున్న విషయాన్ని వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఎన్నో శాఖలు ఉన్నాయని, వీటిలో డిపాజిట్లకు సంబంధించిన అన్ని వివరాలు తెలుసుకోవచ్చునని ఆయన సూచించారు.



మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌కు చెందిన మాతృ సంస్థ మలబార్ గ్రూపు..2024 సంవత్సరానికిగాను బాలికల కోసం మలబార్ జాతీయ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా 21 వేల మంది బాలికల విద్యకు తోడ్పాటునందించడానికి రూపొందించిన ఈ కార్యక్రమాన్ని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మలబార్ గ్రూపు చైర్మన్ ఎంపీ అహ్మద్, మలబార్ గ్రూపు ఎండీ (ఇండియా ఆపరేషన్స్) అషెర్ ఓ, వైస్ చైర్మన్ అబ్దుల్ సలామ్ కేపీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిషాద్ ఏకే హాజరయ్యారు.

హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ బెదుర్స్

1.26 మిలియన్ల చదరపు అడుగులకు పడిపోయిన లీజింగ్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో ముందంజలో ఉండే హైదరాబాద్ మహానగర స్థానం ఇప్పుడు అంతకంతకు దిగజారిపోతోంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ మార్కెట్ అధ్యయన సంస్థ జేఎల్ఎల్ వెల్లడించిన ప్రస్తుతేడాది మూడో త్రైమాసికపు(జూలై-సెప్టెంబర్ మధ్యకాలం) ప్రకారం ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో దేశ వ్యాప్తంగా 14 శాతం మేర వృద్ధిని నమోదు చేసుకుంటే ఇటు హైదరాబాద్‌లో మాత్రం భారీగా తగ్గింది. మెట్రో నగరాల వారిగా చూస్తే హైదరాబాద్‌లో గతేడాది ఇదే త్రైమాసికంలో 2.70 మిలియన్ల చదరపు అడుగులు లీజుకు తీసుకుంటే, తాజాగా ఈ త్రైమాసికంలో మాత్రం 1.26 మిలియన్ చదరపు అడుగులకు పడిపోయింది. ఆఫీసు స్పేస్ వినియోగం సగానికి తగ్గిందని నివేదిక వెల్లడించింది. అదే సమయంలో ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, పుణె నగరాల్లో మంచి వృద్ధిరేటు నమోదైంది. హైదరాబాద్‌కు ఐటీ రంగం పరంగా ప్రధాన పోటీగా ఉన్న బెంగళూరులో జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో 4.14 మిలియన్ చదరపు అడుగులు లీజుకు తీసుకోవడం విశేషం. రాష్టంలో ప్రభుత్వం మారడంతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ తగ్గుతూ వస్తుందనడానికి ఆఫీసు స్పేస్ లీజింగ్ అంశమే అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

అనుమతులున్న ఇండ్లను కూలుస్తారా?

- అధికారం శాశ్వతం కాదు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఫైర్



హైదరాబాద్, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ): అన్ని అనుమతులతో ఇండ్లు కట్టుకొని ఏండ్ల తరబడి ఉన్న వారిని రోడ్ల మీద వేయటంతో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిందేమిటి? అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. విపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి మాట్లాడిన దానికి, అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న దానికి పొంతన లేకుండా పోయిందని ఆయన దుయ్యబట్టారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని కాంగ్రెస్ గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఇచ్చిన హామీలను గాలికొదిలి హైదరాబాద్‌లో భయానకమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కూల్చివేతల భయంతో గంధ శ్రీకుమార్ (55)అనే వ్యక్తి గుండెపోటుతో మరణించారని, అది గుండెపోటు మరణం కాదని, సర్కారు చేసిన హత్యగా కొప్పుల ఈశ్వర్ అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు ప్రజల ప్రాణాలను తీస్తున్నాయని మండిపడ్డారు.

మున్సిపల్ కమిషనర్‌కు ముందస్తు బెయిల్

హైడ్రా ఫిర్యాదు కేసులో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు


హైదరాబాద్, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ): ఎర్రకుంట బఫర్‌జోన్‌లోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసి, వాటిని ప్రోత్సహించారంటూ హైడ్రా చేసిన ఫిర్యాదు మేరకు సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసులో నిజాంపేట మున్సిపల్ కమిషనర్‌కు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నిజాంపేట మున్సిపల్ కమిషనర్ పీ రామకృష్ణారావు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ జువ్వాడి శ్రీదేవి బుధవారం విచారించారు. బెయిల్ మంజూరు చేసిన కోర్టు.. రెండు వారాల్లో పోలీసుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది. రూ.20వేల వ్యక్తిగత పూచీకత్తుతోపాటు అంతే మొత్తానికి మరో రెండు పూచీకత్తులు తీసుకొని విడుదల చేయాలని పోలీసులకు సూచించింది. ప్రతి శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల మధ్య 8 వారాలపాటు పీఎస్‌లో హాజరు కావాలని స్పష్టంచేసింది.

- అల్లాహ్.. కైసే జీనా?



శంకర్‌నగర్ బస్తీలో తమ ఇండ్లను కూల్చివేయడంతో సమీపంలోని మసీదు వద్ద ప్రార్థనలు చేస్తున్న మహిళలు

- నిర్విఘ్నంగా కూల్చివేతలు..



చాదర్‌ఘాట్ మూసానగర్‌లో కొనసాగుతున్న ఇండ్ల కూల్చివేత

కలల సౌధం చెదిరి.. మొండి గోడలు మిగిలి..

- గూడు చెదిరె..



శంకర్‌నగర్ బస్తీలో కూల్చివేసిన ఇండ్లు

ఆశల సౌధాలను కండ్లముందే కూల్చివేస్తుండడంతో బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. చాదర్‌ఘాట్ మూసానగర్, శంకర్‌నగర్ బస్తీలో బుధవారం హృదయవిదారకమైన దృశ్యాలు కనిపించాయి. పిల్లాపాపలతో ఇన్నాళ్లు జీవించిన ఇండ్లన్నీ మొండి గోడలుగా దర్శనమిచ్చాయి. చివరిసారిగా తమ ఇండ్లను చూసుకుంటూ గత స్మృతులను మననం చేసుకుంటూ కనిపించారు. ఇండ్లు కోల్పోవడంతో సమీప బంధువులను వీడి ఇతర ప్రాంతాలకు వెళ్తుండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఒకరినొకరు పలుకరించుకుంటూ బాధను దిగమింగుకొని వెళ్లారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం తమ గూడును చెదరగొట్టిందని ఆవేదన వ్యక్తంచేశారు. తమను ఇంతలా బాధపెడుతున్న సర్కారుకు తగిన బుద్ధి చెబుతామంటూ శాపనార్థాలు పెడుతూ వెళ్తుండడం కనిపించింది.

- నేనిక్కడే ఆడుకునేది..



చాదర్‌ఘాట్ మూసానగర్‌లో కూల్చివేతలో భాగంగా కోల్పోయిన ఇంటి వద్ద నిరాశగా బాలుడు

- ఎట్ల బతుకుదాం.. ఎక్కడికి పోదాం..



చాదర్‌ఘాట్ శంకర్‌నగర్ బస్తీలో కూల్చివేతల అనంతరం చివరిసారిగా తమ ఇంటి వద్ద కూర్చున్న ఓ కుటుంబం



అమీన్‌పూర్‌లో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

హైడ్రా.. పేదల ఇండ్ల జోలికి రావద్దు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్/అమీన్‌పూర్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): హైడ్రా పేదల ఇండ్ల జోలికి రావద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. ఫామ్‌హౌస్‌లు, విల్లాలు కట్టుకున్న పెద్దల అక్రమ కట్టడాలు కూల్చడాన్ని ఏమీ తప్పు పట్టడం లేదని చెప్పారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పుర, పటేల్‌గూడ, బీఎస్సార్ కాలనీలో హైడ్రా కూల్చివేసిన పేదల ఇండ్లను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీతభత్యాల నుంచి నెలనెలా పోగుచేసిన డబ్బుతో బిల్డర్ల వద్ద కొనుగోలు చేసిన ఇండ్లను కూల్చడం అన్యాయమని పేర్కొన్నారు. దాదాపు 26 ఏండ్ల నుంచి ఉన్న ఇండ్లను కూల్చారని, వాటిలో ఇటీవలే గృహప్రవేశం చేసిన ఇండ్లు కూడా ఉన్నాయని తెలిపారు. గత 40 ఏండ్ల నుంచి ఈ భూముల క్రయ విక్రయాలు జరుగుతున్నాయని, వాటి ఈసీలు కూడా ఇప్పటికీ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఒకవేళ ఈ ఇండ్లు ప్రభుత్వ భూమిలో నిర్మించి ఉంటే 58, 59 జీవోల ద్వారా నివాసితులకు క్రమబద్ధీకరించవచ్చని సూచించారు. ఆ ఇండ్లు చెరువు ఎఫ్టీఎల్,, బఫర్ జోన్లలో లేవని తెలిపారు. తప్పుడు సర్వే నంబర్ల సమాచారంతో కూల్చివేతలు చేపడితే ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి, నిర్వాసితులకు పూర్తిగా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ బాలమల్లేశ్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటీ నరసింహ, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జల్లాలుద్దీన్, రాష్ట్ర సమితి సభ్యుడు వీ ప్రకాశ్ రావు పాల్గొన్నారు.

కొడుకుకు పదవి కోసం మైనంపల్లి తంటాలు

- గజ్వేల్‌కు వచ్చి హైడ్రా, మూసీ గురించి ఎందుకు?
- బీఆర్‌ఎస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం



హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): కొడుక్కి మంత్రి పదవి ఇప్పించడానికి, తనకు ఎమ్మెల్సీ పదవి తెచ్చుకోవడానికి కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు అనేక తంటాలు పడుతున్నారని బీఆర్‌ఎస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్‌ను తిడితే తన కొడుక్కి మంత్రి పదవి వస్తుందని అనుకుంటున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి మెప్పు కోసం కేసీఆర్ కుటుంబాన్ని మైనంపల్లి టార్గెట్ చేశారని అన్నారు. మైనంపల్లి మొన్న గజ్వేల్‌కు వచ్చి హైడ్రా, మూసీ గురించి ఎందుకు మాట్లాడారని, గజ్వేల్ ప్రజలకు హైడ్రాతో సంబంధం ఏమిటని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి అసలు ఆయనకు అవగాహనే లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా పిచ్చి ప్రేలాపనలు మానుకుంటే మంచిదని మైనంపల్లికి హితవుపలికారు. తెలంగాణభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుతో 12 జిల్లాలకు మేలు కలుగుతున్నదని, మూసీ సుందరీకరణతో ఎంతమందికి మేలు జరుగుతున్నదో మైనంపల్లి చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీని రూ.1.50 లక్షల కోట్లు పెట్టి సుందరీకరణ చేస్తే ఎంతమందికి ఉపాధి దొరుకుతుంది? అని ప్రశ్నించారు. లక్ష 50 వేల కోట్లు అంటే ఎన్ని వేల కోట్ల అవినీతి జరుగుతుందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. మల్లన్నసాగర్ బాధితులను అన్ని రకాలుగా ఆదుకున్నామని, ఆర్ అండ్ ఆర్ కాలనీలు నిర్మించి ఇచ్చామని చెప్పారు. మరి మూసీ బాధితులకు ఎలాంటి సహాయం చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. పేద ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, బాధితుల తరఫున బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీని ప్రజలు క్షమించరు!

- కేసీఆర్ పాలనలో సుభిక్షంగా నగర ప్రజలు
- కాంగ్రెస్ పాలనలో భిక్షమెత్తుకోవాల్సిన ఖర్మ
- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్
- బతుకమ్మ వేడుకల్లో హైడ్రా బాధితుల నిరసన



ఫిలింనగర్ లోతట్టు ప్రాంతంలోని షేక్‌పేట్ చెరువు వద్ద బతుకమ్మ వేడుకల్లో నిరసన తెలుపుతున్న హైడ్రా బాధితులు, చిత్రంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

జూబ్లీహిల్స్, అక్టోబర్ 2: హైడ్రా పేరిట అక్కాచెల్లెండ్లు బతుకమ్మ వేడుకలను జరుపుకోకుండా చేసిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎప్పటికీ క్షమించబోరని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ విమర్శించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఫిలింనగర్ లోతట్టు ప్రాంతంలోని షేక్‌పేట్ చెరువు వద్ద బుధవారం బతుకమ్మ వేడుకల్లో మూసీ ప్రాజెక్ట్, హైడ్రా బాధితులు ప్లకార్డులతో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో సుభిక్షంగా ఉన్న నగర ప్రజలు.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నేడు భిక్షమెత్తుకోవాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ పాలనలో పేదలకు ప్రతి పథకం ఒక పండుగలా గడిచిందని.. నేడు బతుకమ్మ చీరలు లేకపోవడమే కాదు, బతుకేలేని శ్మశానంగా మారిందని మండిపడ్డారు. బతుకమ్మ పండుగను విశ్వవ్యాప్తం చేసిన ఘనత బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏటా బతుకమ్మ చీరలు పంపిణీ చేసేదని, కాంగ్రెస్ హయాంలో చేనేత కార్మికులకు కూడా అన్యాయం జరిగిందని విమర్శించారు. కేసీఆర్ పేదల మోములో చిరునవ్వు చూడాలని కోరుకునే వారని తెలిపారు. మళ్లీ ఆ చిరునవ్వులు విరబూసేందుకు పేదలకు, హైడ్రా బాధితులకు బీఆర్‌ఎస్ పార్టీ ఎళ్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పిడుగు పడి ముగ్గురి మృతి

- ఉమ్మడి వరంగల్‌లో గాలివాన బీభత్సం
- పలు గ్రామాల్లో విరిగిన విద్యుత్తు స్తంభాలు
- కూలిన చెట్లు.. ఎగిరిపోయిన ఇండ్ల పైకప్పులు
- చాలా ప్రాంతాల్లో నేలవాలిన వరి పంటలు



లక్ష్మి (ఫైల్)



నిర్మల (ఫైల్)



రమ (ఫైల్)

న్యూస్‌నెట్‌వర్క్, అక్టోబర్ 2: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం సాయంత్రం కురిసిన గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగులు పడి ముగ్గురు మహిళలు మృతి చెందారు. వేగంగా వీచిన గాలులకు విద్యుత్తు స్తంభాలు విరిగిపడ్డాయి. పలు చోట్ల చెట్లు కూలిపోయాయి. మరికొన్ని చోట్ల వరి తదితర పంటలు నేలవాలాయి. ములుగు మండలం మల్లంపల్లి ప్రభుత్వ పాఠశాలలో చెట్టుపై పిడుగుపడి చీలిపోయింది. మంగపేట మండలంలోని పలు గ్రామాల్లో పలువురి ఇండ్లపై రేకులు ఎగిరిపోయాయి. మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో ఉన్న సుమారు 100 ఏండ్ల నాటి భారీ చింత చెట్టు నేలకూలింది.

హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం చౌళ్లపల్లికి చెందిన ఇటుకల నిర్మల (51), సోలెంక రమ (45)తోపాటు మరో ఎనిమిది మంది పత్తి తీయడానికి వెళ్లారు. ఉరుములు, మెరుపులతో వాన మొదలవ్వడంతో నిర్మల, రమ పక్కనే ఉన్న చెట్టు కింద నిలబడ్డారు. మిగతా వారు వేరే చోట ఉన్నారు. ఇదే సమయంలో చెట్టుపై పిడుగు పడి ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. నిర్మలకు ముగ్గురు కుమార్తెలు, భర్త రాజేందర్ ఉన్నారు. రమకు ఇద్దరు కుమారులు, భర్త మహేందర్ ఉన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగయ్యపల్లెకు చెందిన కారట్లుపెల్లి లక్ష్మి (49) భర్త నగేశ్‌తో కలిసి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లింది. పత్తి మొక్కలకు ఎరువులు వేస్తున్న సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో ఇంటికి వచ్చేందుకు సిద్ధమవుతుండగా ఒక్కసారిగా పిడుగు పడి లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్తతోపాటు ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితోపాటు ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

కౌలు రైతు ఆత్మహత్య

- కాలం కలిసి రాక.. అప్పులు భారమై
- నిర్మల్ జిల్లా తానూర్‌లో బలవన్మరణం



బాలాజీ (ఫైల్)

తానూర్, అక్టోబర్ 2 : కాలం కలిసి రాక.. అప్పులు భారమై ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిర్మల్ జిల్లా తానూర్ మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. తానూర్‌కు చెందిన రైతు జాదవ్ బాలాజీ (35) 20 ఎకరాల భూమి ని కౌలుకు తీసుకున్నాడు. సోయా వేయగా పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు పడ్డాయి. పంట నేలమట్టం కావడం, దిగుబడి రాదేమోనని బెంగ, తెచ్చిన రూ.12 లక్షల అప్పు ఎలా కట్టాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాలాజీకి కొడుకు, కూతురు ఉన్నారు. భార్య రూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రమేశ్ తెలిపారు.

వాగులో కొట్టుకుపోయిన ఎడ్లబండి

- బండి మీద పడటంతో రైతు మృతి
- మహిళలను రక్షించిన స్థానికులు



గాంధీ (ఫైల్)

టేకులపల్లి, అక్టోబర్ 2: వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగివస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు వాగులో ఎడ్లబండి కొట్టుకుపోగా రైతు మృతిచెందింది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని కొత్తతండా(పీ) గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు ఆంగోత్ గాంధీ (35) ఉదయం తన భార్యతోపాటు మరికొందరు మహిళలతో కలిసి ఎడ్లబండిపై లక్ష్మీపురం గ్రామం మీదుగా తన చేనుకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో లక్ష్మీపురం సమీపాన ఉన్న గంగమ్మతల్లి వాగులో ఎడ్లబండి కొట్టుకుపోయింది. ఎగువన కురిసిన వర్షానికి వరద పెరగడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. స్థానికులు వెంటనే మహిళలను రక్షించారు. ఎడ్లబండి మీదపడటంతో గాంధీ మృతిచెందాడు.

అక్కినేని కుటుంబంపై పగ!

- నాగార్జున లక్ష్యంగా ఇండస్ట్రీపై రేవంత్ సర్కార్ దాదాగిరి
- అంతర్గత ఎజెండాతో ఏఎన్నార్ ఫ్యామిలీకి ఇక్కట్లు!
- అమరావతి నుంచి ఆదేశాల మేరకే ఎన్ కన్వెన్షన్ నేలమట్టం?
- వివాదాలకు దూరంగా ఉన్నా బయటకు లాగి ఇబ్బందులు
- సర్కార్‌పై ప్రజా వ్యతిరేతను కప్పి పుచ్చేందుకు మరోసారి టార్గెట్
- కూల్చివేతలపై గట్టిగా పోరాడుతున్న కేటీఆర్‌తో ముడి
- బలం చేకూరుస్తున్న మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు!
- పలువురు కాంగ్రెస్ నేతల్లోనూ అసహనం.. ఆగ్రహం
- రగిలిపోతున్న నాగార్జున అభిమానులు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో 'హైడ్రా' అవతరించిన కొద్ది రోజులకే ప్రముఖ సినీహీరో అక్కినేని నాగార్జునకు చెందిన 'ఎన్ కన్వెన్షన్'ను నేటమట్టం చేసింది. కోర్టు ఆదేశాలు వచ్చేలోగానే 'సెలవుల అదును' చూసి కూల్చివేసింది. కొంతకాలంగా తన వెనుక జరుగుతున్న వ్యవహారాలపై నాగార్జున మౌనంగానే ఉన్నా.. మరోసారి 'అక్కినేని ఫ్యామిలీ' లక్ష్యంగా కాంగ్రెస్ మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేయడం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. తొలి నుంచి కాంగ్రెస్‌కు అనుకూలురుగా ఉన్న అక్కినేని కుటుంబాన్ని ఇప్పుడు రేవంత్ సర్కార్ టార్గెట్ చేసిందని సినీవర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం కాంగ్రెస్ పార్టీలోనే కొందరికి మింగుడు పడడం లేదని తెలుస్తున్నది. 'ఎన్ కన్వెన్షన్' కూల్చివేత వెనుక అమరావతి నుంచి వచ్చిన ఆదేశాలు ఉన్నాయనే వాదనలు ఇండస్ట్రీ వర్గాల్లో బాహాటంగానే వినిపిస్తున్నాయి. ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అనుకూలుడిగా ఇండస్ట్రీలో నాగార్జునకు పేరుందని, జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఇండస్ట్రీ పెద్దలు పలుమార్లు ఆయనను కలిసి సమస్యలపై చర్చించారని, అయితే ఓ వర్గానికి చెందిన హీరోను లక్ష్యంగా చేసుకొని జగన్ సానుకూలంగా స్పందించలేదని, ఈ వ్యవహారంలో నాగార్జున ఎవరి పక్షం లేకున్నా ఆయన జగన్‌కు అనుకూలమనే ప్రచారం జరిగిందని, ఈ కారణంగానే ఇక్కడ రేవంత్ సీఎం కాగానే 'ఎన్ కన్వెన్షన్' కూల్చివేతకు ఏపీ నుంచి ఆదేశాలు వచ్చాయని, ఇండస్ట్రీ కోణంలో ఇదో కక్షపూరిత చర్య అని సినీరంగానికి చెందిన ఓ ప్రముఖుడు వెల్లడించారు. ఉద్యోగాలు, రుణమాఫీ, ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యం కారణంగా ఆదిలోనే వచ్చిన ప్రజావ్యతిరేకతను హైడ్రా కూల్చివేతలతో కప్పిపుచ్చుకొనే ప్రయత్నం చేసిన కాంగ్రెస్ సర్కార్, తాజాగా కూల్చివేతలకు వ్యతిరేకంగా పోరాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అక్కినేని కుటుంబంతో ముడిపెట్టి 'రాజకీయం' చేస్తున్నదని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



మంత్రి సురేఖ వ్యాఖ్యలతో షాక్‌లో ఇండస్ట్రీ

అగ్ర నటుడు నాగార్జున కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఇండస్ట్రీ వర్గాలను షాక్‌కు గురిచేశాయి. రాజకీయ ప్రయోజనాల కోసం ఓ లెజెండరీ సినీ కుటుంబంపై అభాండాలు వేయడం సినీ ప్రముఖులను విస్మయానికి గురిచేసింది. కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే నాగార్జున కుటుంబాన్ని రేవంత్ ప్రభుత్వం రాజకీయ పరమైన హిడెన్ ఎజెండాతో కావాలనే ఇబ్బంది పెడుతున్నదని, ఇది ఓ రకంగా ఇండస్ట్రీపై జరుగుతున్న నైతిక దాడి అని పలువురు సినీరంగ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

హైదరాబాద్‌లో సినీరంగం స్థిరపడటానికి ప్రధాన భూమిక పోషించిన లెజెండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు కుటుంబాన్ని రాజకీయ స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని, ఇది అత్యంత బాధాకరమని వాపోతున్నారు. సినీరంగంలో వరుస పరిణామాలు భవిష్యత్తులో ఇండస్ట్రీ మనుగడపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

జగన్‌కు అనుకూలంగా ఉన్నాడనేనా?

రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఆయన కుటుంబంతో నాగార్జున సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. నాగార్జున మేనల్లుడు సుమంత్, జగన్మోహన్‌రెడ్డి పాఠశాల రోజుల్లో క్లాస్‌మేట్స్. ఈ కారణంగా కూడా నాగార్జున, జగన్మోహన్‌రెడ్డి మధ్య సఖ్యత ఏర్పడిందని చెప్తారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఇండస్ట్రీ సమస్యలపై పలువురు పెద్దలు కలిసి చర్చించినా ఆయన ఓ హీరోను లక్ష్యంగా చేసుకొని సానుకూలంగా స్పందించలేదనే అసంతృప్తి ఉండేది. ఈ కారణంగా సినీరంగంతో జగన్‌కు దూరం పెరిగింది. ఈ వ్యవహారంతో నాగార్జునకు ఎలాంటి సంబంధం, పక్షపాతం లేకున్నా జగన్ అనుకూలుడనే ప్రచారం జరిగింది. ఇక్కడ కాంగ్రెస్ సర్కార్‌లో రేవంత్‌రెడ్డి సీఎం కావడం, ఏపీలో జగన్ ఓడిపోయి చంద్రబాబు అధికారంలోకి రావడంతో ప్రతీకార రాజకీయాలు మొదలయ్యాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే అమరావతి నుంచి అందిన ఆదేశాల మేరకు 'బుల్డోజర్' ఎన్ కన్వెన్షన్ వైపు మళ్లిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇండస్ట్రీకి రేవంత్ బెదిరింపులు

పదేళ్ల కేసీఆర్ హయాంలో తెలుగు సినీ రంగానికి ఎప్పుడూ ఇబ్బందులు ఎదురుకాలేదు. ఇండస్ట్రీకి సంబంధించిన ప్రతి అంశంలో కేసీఆర్ సానుకూలంగా స్పందించేవారు. 2019 ఏపీ ఎన్నికల సమయంలో పవన్ కల్యాణ్ నాటి టీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఎన్నో విమర్శలు చేశారు. 'తెలంగాణ ఏమైనా పాకిస్తానా? అంటూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. అయినా అవేమీ మనసులో పెట్టుకోకుండా పవన్‌కల్యాణ్ 'భీమ్లానాయక్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు కేటీఆర్ ముఖ్య అతిథిగా వెళ్లారు. తాను పవన్‌కల్యాణ్ అభిమానినని పొగడ్తల్లో ముంచెత్తారు. రాజకీయాలతో ఇండస్ట్రీని ముడిపెట్టకుండా కేటీఆర్ వ్యవహరించిన తీరు అందరి ప్రశంసలందుకున్నది. అయితే రేవంత్ సర్కార్ రాకతో ఇండస్ట్రీల్లో పరిస్థితులన్నీ ఒక్కసారిగా మారిపోయాయని, తొలి నుంచీ ఆయన బెదిరింపు ధోరణిలోనే వ్యవహరిస్తున్నారని పలువురు ఇండస్ట్రీకి చెందినవారు చెప్తున్నారు. సాధారణంగా సినీ తారలు ఏదైనా ప్రభుత్వ కార్యక్రమం నచ్చితే స్వచ్ఛందంగా ప్రచారం చేసేందుకు ముందుకొస్తారు. కానీ డ్రగ్స్‌పై అవగాహన పెంచే కార్యక్రమం విషయంలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు ఇండస్ట్రీలో భయాలను రేకెత్తించాయి. సినీ నటులు తప్పకుండా డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో పాల్గొనాలని, అందుకు సంబంధించిన వీడియోలు చేయాలని, లేదంటే వారి సినిమాలకు అనుమతులు ఇవ్వబోమని ఓ సభలో సీఎం రేవంత్ హెచ్చరించడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకూ తమను ఏ ముఖ్యమంత్రి ఈ రీతిలో బెదిరించలేదని ఇండస్ట్రీవర్గాల్లో చర్చ జరిగింది. 'కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సినీ ఇండస్ట్రీని ఓ రకంగా బ్లాక్‌మెయిల్ చేసే ధోరణి కనిపిస్తోంది. నయానోభయానో మమ్మల్ని దారికి తెచ్చుకోవాలనే ధోరణి కనిపిస్తున్నది. గతంలో ఈ తరహా వైఖరిని ఏ ప్రభుత్వంలో చూడలేదు' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ సీనియర్ నిర్మాత తెలిపారు.

మరింత అగ్గిరాజేసిన సురేఖ వ్యాఖ్యలు

ఇప్పటికే సర్కార్‌పై అసహనం వ్యక్తం చేస్తున్న సినీ ఇండస్ట్రీలో కొండా సురేఖ వ్యాఖ్యలు మరింత అగ్గి రాజేశాయి. సినీ హీరోయిన్లను అవమాన పరిచేలా ఆమె వ్యాఖ్యలు ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి. అక్కినేని కుటుంబాన్ని అభాసుపాలు చేసేలా ఆమె మాట్లాడటాన్ని నాగార్జున అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. తెలుగు సినిమా వైభవానికి ఎంతగానో కృషి చేసిన లెజెండరీ అక్కినేని ఫ్యామిలీపై ఇంతలా దిగజారుడు రాజకీయాలు చేయడమేమిటని మండిపడుతున్నారు. అక్కినేని కుటుంబం నుంచి ప్రస్తుతం నాగార్జున, నాగచైతన్య, అఖిల్, సుమంత్, సుశాంత్ వంటి హీరోలున్నారు. ఇప్పటివరకు వీరంతా వివాద రహితులుగా పేరు తెచుకున్నారు. అక్కినేని కుటుంబం సేవా కార్యక్రమాలపరంగా కూడా ఎప్పుడూ ముందుంటుంది. అక్కినేని అమల బ్లూక్రాస్ ద్వారా జంతు సంరక్షణకు కృషి చేస్తున్నది. అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా కొన్ని వందల మంది సినీ కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఇండస్ట్రీ పిల్లర్స్‌లో ఒకటైన అక్కినేని కుటుంబాన్ని తొలుత ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో ఇబ్బందులు పెట్టి, ఇప్పుడు కేటీఆర్‌తో ముడిపెట్టి వివాదాల్లోకి లాగుతున్నారనే చర్చ కొనసాగుతున్నది. అటు ఏపీ డైరెక్షన్‌లో నాగార్జున, ఇటు ప్రభుత్వ కూల్చివేతల చర్యలపై గట్టిగా పోరాడుతున్న బీఆర్‌ఎస్ నేత కేటీఆర్‌ను ప్రజల్లో చులకన చేయాలనే కుట్రతోనే రేవంత్ రెడ్డి సర్కార్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని పలువురు రాజకీయ ప్రముఖులు స్పష్టం చేస్తున్నారు. ఏదేమైనా ఇలా వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ఏమాత్రం సమర్థనీయం కాదని హితవుపలుకుతున్నారు.

వివాదాలకు దూరంగా అక్కినేని కుటుంబం

తొలి నుంచీ అక్కినేని ఫ్యామిలీ రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తున్నది. ఏఎన్నార్ కాంగ్రెస్‌వాదిగా ఉన్నా ఆయన ఏనాడూ బాహాటంగా పార్టీని సమర్థించలేదు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అన్నపూర్ణ సెవెన్ ఎకర్స్ విషయంలో ఏఎన్నార్‌ను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారన్న వాదనలు ఉన్నాయి. స్టూడియో లీజును రద్దు చేయించాలని ప్రయత్నించగా కోర్టుల ద్వారా ఆ వివాదం సమసిపోయింది. అనంతరకాలంలో ఎన్టీఆర్, ఏఎన్నార్ సఖ్యతగానే ఉన్నారు. ఆ తర్వాత అక్కినేని కుటుంబానికి ఎప్పుడూ రాజకీయపరమైన ఇబ్బందులు ఎదురుకాలేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనతో అక్కినేని నాగార్జున కూడా సన్నిహిత సంబంధాలు నెరిపారు. అప్పటి ప్రభుత్వ పథకాలకు ప్రచారకర్తగా కూడా పనిచేశారు. అయితే ఎలాంటి రాజకీయపరమైన కార్యకలాపాల్లోగాని, పార్టీ ప్రచారంలో గాని నాగార్జున పాల్గొనలేదు. తొలినుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలురుగా ఉన్న అక్కినేని కుటుంబాన్ని ఇప్పుడు టార్గెట్ చేయడం ఏమిటని కాంగ్రెస్ పార్టీలోనే కొందరు నేతలు రేవంత్‌రెడ్డి తీరుపై అసహనం, ఆగ్రహం వ్యక్తంచేస్తున్నట్టు తెలిసింది.

సురేఖ వ్యాఖ్యలు అబద్ధం: నాగార్జున

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ) : 'మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు అసంబద్ధం. అబద్ధం' అని సినీ నటుడు అక్కినేని నాగార్జున స్పష్టంచేశారు. 'రాజకీయాలకు దూరంగా ఉండే సినీప్రముఖుల జీవితాలను, మీ ప్రత్యర్థులను విమర్శించేందుకు వాడుకోకండి.. సాటి మనుషుల వ్యక్తిగత జీవితాలను గౌరవించండి' అని సూచించారు. సురేఖ వ్యాఖ్యలను బుధవారం ఎక్స్ వేదికగా ఆయన ఖండించారు. బాధ్యత కలిగిన పదవిలో ఉన్న మహిళగా మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు తమ కుటుంబం పట్ల, చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధమని, అబద్ధమని తేల్చిచెప్పారు. తక్షణమే ఆమె తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాహుల్ గాంధీ స్పందించాలి: అమల

తమ కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన అసంబద్ధ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి సినీ నటుడు అక్కినేని నాగార్జున సతీమణి, నటి అక్కినేని అమల ఫిర్యాదుచేశారు. తన కుటుంబంపై సురేఖ అసత్య ఆరోపణలు చేశారని మండిపడ్డారు. రాజకీయ వివాదాల్లోకి తమను లాగవద్దని, తన భర్త గురించి నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ఘాటుగా స్పందించారు. 'రాజకీయ నాయకులే నేరస్థుల్లా ప్రవర్తిస్తే ఈ దేశం ఏమైపోతుంది? సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పేలా రాహుల్ గాంధీ చొరవ తీసుకోవాలి' అని అమల డిమాండ్ చేశారు.

అసహ్యం వేస్తున్నది: నాని



ఏ చెత్తయినా మాట్లాడి తప్పించుకోవచ్చని భావించే రాజకీయనాయకులను చూస్తే అసహ్యం వేస్తున్నదని సినీ నటుడు నాని పేర్కొన్నారు. సమంత, నాగచైతన్య విడాకుల అంశం మీద మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై నాని స్పందించారు. ఇంత బాధ్యతారహితంగా మాట్లాడేవారు ప్రజల పట్ల బాధ్యతాయుతంగా ఉంటారని ఆశించడం తమ తెలివితక్కువతనమే అవుతుందని పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ ఎటువంటి ఆధారం లేకుండా మీడియా ముందు చెత్త మాట్లాడితే చెల్లుతుందనుకోవడం చెల్లదని ఘాటుగా వ్యాఖ్యానించారు. సమాజంపై దుష్ప్రభావం చూపే ఇటువంటి ప్రయత్నాలను ఖండించాలని కోరారు.

మంత్రి బాధ్యతతో మాట్లాడాలి

▶ మొదటిపేజీ తరువాయి...

గ్రహించాలని చురక అంటించారు. ఇతరుల వ్యక్తిగత విషయాల పట్ల మాట్లాడేటప్పుడు బాధ్యతగా, గౌరవంగా ఉండాలంటూ హుందాగా హితవు చెప్పారు. విడాకులు తన వ్యక్తిగత విషయమని, దయచేసి దానిపై ఊహాగానాలు మానుకోవాలని పరోక్షంగా హెచ్చరించారు. తమ వ్యక్తిగత విషయాలను గోప్యంగా ఉంచుకోవడం అంటే ఇతరులు వాటిని తప్పుగా ప్రచారం చేయడం కాదని ఉద్బోధించారు. సమంత విడుదల చేసిన ప్రకటన పూర్తి పాఠం ఇలా ఉంది. 'మహిళగా ఉండటానికి, బయటకు వచ్చి పని చేయడానికి, గ్లామర్ పరిశ్రమంలో నిలబడి పోరాడటానికి చాలా ధైర్యం, బలం కావాలి. కొండా సురేఖ గారు.. ఈ ప్రయాణం నన్ను మార్చినందుకు గర్వపడుతున్నా. దయచేసి చిన్నచూపు చూడకండి. మంత్రిగా మీ మాటలకు ఎంతో ప్రాధాన్యముంటుందని మీరు గ్రహించారని భావిస్తున్నాను. వ్యక్తుల వ్యక్తిగత విషయాల గుర్తించి మాట్లాడేటప్పుడు బాధ్యతగా, గౌరవంగా ఉండాలని వేడుకుంటున్నా. నా విడాకులు నా వ్యక్తిగత అంశం. దానిపై ఊహాగానాలు మానుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. మా వ్యక్తిగత విషయాలను గోప్యంగా ఉంచాలని అనుకోవడం అంటే ఇతరులు దానిపై తమ ఇష్టం వచ్చినరీతిగా మాట్లాడాలని కాదు. నా విడాకులు పరస్పర అంగీకారం, సామరస్యపూరక్వంగా జరగాయని స్పష్టం చేస్తున్నా. ఇందులో ఎటువంటి రాజకీయ ప్రమేయం లేదు. మీ రాజకీయ వివాదాల నుంచి నా పేరు ను దూరంగా ఉంచగలరా? నేను ఎప్పుడూ రాజకీయాలకు అతీతంగా ఉంటాను. అలాగే ఉండాలని కోరుకుంటున్నా' అని పేర్కొన్నారు.

కొండా వ్యాఖ్యలు సిగ్గుచేటు: నాగచైతన్య

మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను సినీ నటుడు నాగచైతన్య ఖండించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. మంత్రి వ్యాఖ్యలు అసత్యమని, అవి హాస్యాస్పదం, ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. మహిళలకు మద్దతునిచ్చి, వారిని గౌరవించాలని అన్నారు. సెలబ్రిటీలు తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించి తీసుకున్న నిర్ణయాలను తమకు అనుకూలంగా మార్చుకోవడం తగదని పేర్కొన్నారు.



దీక్ష విరమించిన పవన్‌కల్యాణ్

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షను విరమించారు. కుమార్తెలు ఆద్య, పొలెనా అంజనా, దర్శకుడు త్రివిక్రమ్, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద సాయితో కలిసి శ్రీవారిని బుధవారం దర్శించుకున్నారు. అనంతరం తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రాన్ని పరిశీలించారు. వారాహి డిక్లరేషన్ బుక్‌తో ఆలయం వెలుపలకు పవన్ రావడాన్ని భక్తులు ఆసక్తిగా గమనించారు. అంతకు ముందు చిన్న కుమార్తె పొలెనా అంజనా స్వామివారి దర్శనానికి డిక్లరేషన్ ఇచ్చారు. పొలెనా మైనర్ కావడంతో ఆమె తరపున తండ్రిగా డిక్లరేషన్ పత్రాలపై పవన్ సంతకాలు చేశారు. తిరుమలలో చిరుతల నుంచి రక్షణకు అటవీ శాఖ చేపట్టిన చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గురువారం సాయంత్రం జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిర్వహించే వారాహి సభలో పవన్‌కల్యాణ్ పాల్గొననున్నారు.

దసరాకు టీజర్



రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్' చిత్రం డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురాబోతున్న విషయం తెలిసిందే. శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు రూపొందించిన ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. ప్రచార పర్వంలో భాగంగా ఇటీవలే రెండో పాటను విడుదల చేశారు. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించడంతో టీజర్ కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ నెలలోనే టీజర్‌ను రిలీజ్ చేస్తామని నిర్మాత దిల్‌రాజు కన్‌ఫర్మ్ చేశారు. తాజా సమాచారం ప్రకారం దసరా సందర్భంగా ఈ నెల 12న టీజర్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. రాజకీయ, సామాజికాంశాలను చర్చిస్తూ తనదైన శైలిలో దర్శకుడు శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కియారా అద్వాణీ, అంజలి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, సముద్రఖని కీలక పాత్రలను పోషిస్తున్నారు.

వేట్టయాన్ యాక్షన్ హంగామా



సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన తాజా చిత్రం 'వేట్టయాన్-ది హంటర్' ట్రైలర్ బుధవారం విడుదలైంది. ఈ సినిమాలో రజనీకాంత్ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా కనిపించనున్నారు. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం దసరా సందర్భంగా ఈ నెల 10 ప్రేక్షకుల ముందుకు రానుంది. ట్రైలర్ ఆద్యంతం యాక్షన్ అంశాలతో సాగింది. 'క్రైమ్ క్యాన్సర్‌లాంటిది. దానిని పెరగనివ్వకూడదు' 'నన్ను ఏ పోస్టులో తిప్పి కొట్టినా నేను మాత్రం పోలీస్ వాడినే సార్. నా నుంచి వాడిని కాపాడటం ఎవరి వల్లా కాదు' అంటూ రజనీకాంత్ చెప్పిన డైలాగ్స్ హైలైట్‌గా నిలిచాయి. ట్రైలర్‌లో అమితాబ్‌బచ్చన్, రానా, ఫహద్ ఫాజిల్ పాత్రలను పరిచయం చేసిన తీరు, వారు చెప్పిన డైలాగ్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. రజనీకాంత్ తనదైన స్టైల్, మేనరిజమ్స్‌తో మెప్పించారు. పోలీస్ వ్యవస్థకు, సంఘ విద్రోహక శక్తులకు మధ్య జరిగే పోరు నేపథ్యంలో సినిమాను తెరకెక్కించారని ట్రైలర్‌ను చూస్తే అర్థమవుతున్నది. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్నందించారు.

ఆ వార్తల్లో నిజం లేదు!



'యానిమల్' చిత్రంతో ఓవర్‌నైట్‌లో స్టార్‌డమ్‌ను సంపాదించుకుంది కథానాయిక త్రిప్తి డిమ్రి. ప్రస్తుతం ఈ భామ వరుస సినిమాలతో బిజీగా ఉంది. తాజాగా ఆమె ఓ వివాదంలో చిక్కుకుంది. వివరాల్లోకి వెళితే..ఇటీవల జైపూర్‌లో మహిళా పారిశ్రామిక వేత్తలు ఓ సదస్సును నిర్వహించారు. దీనికి పలువురు బాలీవుడ్ స్టార్స్‌ను కూడా ఆహ్వానించారు. వారిలో త్రిప్తి డిమ్రి కూడా ఉంది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి నిర్వాహకులు ఆమెకు ఐదు లక్షల రూపాయలను అందించారని తెలిసింది. అయితే తన తాజా చిత్రం 'విక్కీ విద్య కా వోవాలా వీడియో' ప్రమోషన్‌లో బిజీగా ఉండటం వల్ల త్రిప్తి డిమ్రి మహిళా పారిశ్రామికవేత్తల సదస్సుకు హాజరుకాలేక పోయింది. దీంతో నిర్వాహకులు ఆమె వ్యవహార శైలిని తప్పుబడుతూ, ఈవెంట్‌లో ఏర్పాటు చేసిన ఆమె పోస్టర్లను ధ్వంసం చేశారు. ఈ వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ వ్యవహారంపై త్రిప్తి డిమ్రి వ్యక్తిగత టీమ్ స్పష్టత నిచ్చింది. జైపూర్ ఈవెంట్‌లో పాల్గొనడానికి త్రిప్తి డబ్బులు తీసుకుందనే వార్తలు పూర్తి అవాస్తవమని, సినిమా ప్రమోషన్‌లో బిజీగా ఉండటం వల్లే అక్కడకు వెళ్లలేకపోయిందని వివరణ ఇచ్చారు. 'వృత్తిపరంగా త్రిప్తి చాలా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుంది. ప్రైవేట్ ఈవెంట్స్‌కు కూడా ఆమె డబ్బులు తీసుకోదు. దయచేసి ఈ పుకార్లకు పుల్‌స్టాప్ పెట్టండి' అని ఆమె టీమ్ స్పష్టం చేసింది.



ఇప్పటివరకు రాని కథ

పరుచూరి సుదర్శన్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'మిస్టర్ సెలబ్రిటీ'. రవికిషోర్ దర్శకత్వం వహించారు. ఆర్‌పీ సినిమాస్ పతాకంపై చిన్న రెడ్డయ్య, ఎన్.పాండురంగారావు నిర్మించారు. ఈ నెల 4న విడుదలకానుంది. ఈ చిత్ర ట్రైలర్‌ను హీరో రానా విడుదల చేశారు. సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో ట్రైలర్‌ను తెరకెక్కించారని, ఆద్యంతం ఉత్కంఠను పంచిందని రానా చిత్ర యూనిట్‌ను అభినందించారు. ఇప్పటివరకు రాని ఓ ఇంట్రెస్టింగ్ పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, కథ, కథనాలు ఆసక్తికరంగా ఉంటాయని దర్శకుడు తెలిపారు. వరలక్ష్మీ శరత్‌కుమార్, నాజర్, రఘుబాబు తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య, రచన-దర్శకత్వం: చందిన రవికిషోర్.

నాని సరసన శ్రీనిధి

నాని కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. ప్రస్తుతం వైజాగ్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమాలో నాని సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నది. కథానుగుణంగా ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని, వైజాగ్ షెడ్యూల్‌లో శ్రీనిధి శెట్టి పాల్గొంటున్నదని చిత్ర బృందం పేర్కొంది. నాయకానాయికలపై కీలక ఘట్టాలను చిత్రీకరిస్తున్నామని, పోలీస్ ఆఫీసర్‌గా నాని పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తారని చిత్ర బృందం పేర్కొంది. 2025 మే 1న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, రచన-దర్శకత్వం: శైలేష్ కొలను.



చాలా రోజులు గుర్తుండిపోతుంది



'వంశాలు, తరాల నేపథ్యంలో జరిగే పెద్ద కథ ఇది. దీనిని తెరపై తీసుకురావడం అంత సులభం కాదు. ఇప్పటివరకు ఏ సినిమాలో నేను డబుల్ యాక్షన్ చేయలేదు. అలాంటిది ఇందులో నాలుగు పాత్రల్ని పోషించాను' అన్నారు హీరో శ్రీవిష్ణు. ఆయన నటించిన తాజా చిత్రం 'శ్వాగ్'. హసిత్ గోలి దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ నెల 4న విడుదలకానుంది. మంగళవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవిష్ణు మాట్లాడుతూ 'ఈ సినిమా కథలో కామెడీతో పాటు హృదయాల్ని కదిలించే ఎమోషన్స్ ఉంటాయి. చాలా రోజుల పాటు గుర్తుండిపోతుంది. కుటుంబ సమేతంగా చూసి ఆనందించేలా సినిమాను తీర్చిదిద్దాం' అన్నారు. ఈ సినిమాలో శ్రీవిష్ణు పోషించిన నాలుగు పాత్రలు వేటికవే ప్రత్యేకంగా కనిపిస్తాయని, కమల్‌హాసన్ తరహాలో నాలుగు పాత్రల్ని ధైర్యంగా చేశారని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. దర్శకుడు హసిత్ గోలి మాట్లాడుతూ 'శ్రీవిష్ణు నాలుగు పాత్రల్లో అద్భుతమైన నటన కనబరిచాడు. వివేక్‌సాగర్ మ్యూజిక్ ప్రధానాకర్షణగా నిలుస్తుంది. ఇంటర్వెల్, క్లైమాక్స్ ఘట్టాలు ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి' అన్నారు. ఈ సినిమాలో తాను పోషించిన మహారాణి పాత్ర చాలా కొత్తగా ఉంటుందని కథానాయిక రీతూవర్మ చెప్పింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

'ఫణి' వెనకున్న రహస్యం



కేథరిన్ ట్రెసా ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఫణి'. వీఎన్ ఆదిత్య దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందిస్తున్నారు. ఓఎంజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై డాక్టర్ మీనాక్షి అనిపిండి నిర్మిస్తున్నారు. ఈ సినిమా బ్యానర్ లోగో, టైటిల్ ఆవిష్కరణ కార్యక్రమం యూఎస్‌లోని డల్లాస్‌లో జరిగింది. బ్యానర్ లోగోను నిర్మాత అనిల్ సుంకర, టైటిల్‌ను తోటకూర ప్రసాద్ లాంచ్ చేశారు. లేడీ ఓరియెంటెడ్ మూవీ ఇదని, థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కించామని దర్శకుడు వీఎన్ ఆదిత్య తెలిపారు. ఈ కథ తనను ఎంతగానో ఇంప్రెస్ చేసిందని, కెరీర్‌లో తొలిసారి మోస్ట్ ఛాలెంజింగ్ రోల్ చేశానని కథానాయిక కేథరిన్ ట్రెసా పేర్కొంది. మొత్తం షూటింగ్ అమెరికాలోనే జరుపుతున్నామని, ఇప్పటికి యాభైశాతం చిత్రీకణ పూర్తయిందని, పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని విడుదల చేస్తామని చిత్ర నిర్మాత, సంగీత దర్శకురాలు డాక్టర్ మీనాక్షి అనిపిండి తెలిపారు. ఈ చిత్రానికి రచన పద్మావతి మల్లాది, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వీఎన్ ఆదిత్య.



బుధవారం గాంధీభవన్ వద్ద రోడ్డుపై బైఠాయించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న జీవో నంబర్ 317 బాధితులు

స్వరాష్ట్రంలో స్థానికులకు అన్యాయమా?

- **48 గంటల్లోనే సమస్యను పరిష్కరిస్తానన్న సీఎం ఎక్కడ?**
- **గాంధీ భవన్‌ను ముట్టడించి, బైఠాయించిన జీవో 317 బాధితులు**

హైదరాబాద్/సుల్తాన్‌బజార్,అక్టోబర్ 2: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే జీవో నంబర్ 317 బాధితులకు న్యాయం చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి పది నెలలు గడిచినా.. పట్టించుకోవడం లేదంటూ బాధితులు బుధవారం గాంధీభవన్‌ను ముట్టడించారు. రోడ్డుపై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ సందర్భంగా 317 బాధితులు మాట్లాడుతూ.. స్థానికత మీద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో స్థానికులకు అన్యాయం చేస్తారా..? అని ప్రశ్నించారు. 'నా కంటే ముందు ఉద్యోగం పొందిన వారు స్థానికులు, నా తరువాత డీఎస్సీ-2024 ఉద్యోగం పొందబోయే వారూ స్థానికులే మరి నా స్థానికత ఎక్కడ సీఎం' అని ఓ 317 బాధితుడు బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించాడు. గాంధీ జయంతి రోజున గాంధీ సాక్షిగా జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని బాధితులు కోరారు.

• కొత్త పింఛన్లు ఇస్తలేరు బాపూ..



'కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలవుతున్నా కొత్తగా ఆసరా పింఛన్లు మంజూరు చేయట్లేదు బాపూ' అంటూ ఖమ్మంలోని పలువురు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి వినతిపత్రం అందజేసి వినూత్న నిరసన తెలిపారు. దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. – ఖమ్మం



• పంచాయతీ సిబ్బందికి పాద పూజ

గాంధీ జయంతి సందర్భంగా బుధవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో ఖాజామొహీనుద్దీన్ పంచాయతీ సిబ్బంది పాదాలు కడిగి సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు.

– చిగురుమామిడి

వైభవంగా ఎంగిలిపూల బతుకమ్మ

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బుధవారం బతుకమ్మ వేడుకలు అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల్లోని అన్ని గ్రామాల్లో మహిళలు మధ్యాహ్నం ఎంగిలిపూల బతుకమ్మను పేర్చారు. సాయంత్రం బతుకమ్మలతో స్థానికంగా ఉన్న ఆలయాలు, ప్రధాన కూడళ్ల వద్దకు చేరుకొని పాటలు పాడుతూ వేడుకలు జరుపుకొన్నారు. హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయానికి వేలాదిమంది మహిళలు బతుకమ్మలతో తరలివచ్చి ఆడిపాడి సందడి చేశారు. వర్షం కురిసినా ఆడపడుచులు తడుస్తూనే వేడుకలు నిర్వహించారు. – వరంగల్

నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్



చీకట్లోనే బతుకమ్మ సంబురాలు

- **వీధి దీపాలు వెలుగక అవస్థలు**
- **మంత్రి సీతక్క ఇలాకాలో ఈ దుస్థితి**

ములుగు, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ సంబురాలను ఆడబిడ్డలు చీకట్లోనే జరుపుకోవాల్సి వచ్చింది. ఈ ఘటన ములుగు నియోజకవర్గ పరిధిలోని వెంకటాపూర్ మండలం చింతలపల్లిలో చోటు చేసుకున్నది. దాదాపు 40 మంది మహిళలు గ్రామ ప్రధాన కూడలి వద్ద బుధవారం ఎంగిలిపూల బతుకమ్మను చీకట్లోనే ఆడుకోవాల్సి వచ్చింది. 15 రోజులుగా వీధి లైట్లు వెలుగడం లేదని పంచాయతీ కార్యదర్శి కవితకు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా బతుకమ్మ వేడుకలను మహిళలు మొబైల్ లైట్లు, ద్విచక్రవాహనాల హెడ్‌లైట్లు, బతుకమ్మలపై వెలిగించిన దీపాల వెలుగులోనే 2 గంటలపాటు ఆడాల్సి వచ్చింది. ఈ గ్రామం నియోజకవర్గ పరంగా మంత్రి సీతక్క పరిధిలో ఉండగా జిల్లాపరంగా జయశంకర్ భూపాలపల్లి పరిధిలోకి వస్తుంది. ఇదిలావుండగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం పెద్దంపల్లి గ్రామంలోనూ మహిళలు చీకట్లోనే బతుకమ్మ ఆడాల్సి వచ్చింది. 'కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరలు ఇవ్వలేదు.. కనీసం బతుకమ్మ ఆడుకునేందుకు లైట్లు కూడా వేయలేదు' అంటూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు చేసి ప్రభుత్వానికి చురకలు అంటించారు.



వెంకటాపూర్ మండలం చింతలపల్లిలో చీకట్లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బతుకమ్మ ఆడుతూ మహిళ మృతి



స్వరూప (ఫైల్)

ముత్తారం, అక్టోబర్ 2: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన మాదాసి స్వరూప (45) బుధవారం సాయంత్రం బతుకమ్మ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందింది. స్వరూప గతంలో మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడినట్టు స్థానికులు తెలిపారు. అదే వ్యాధితో చనిపోయిందా? లేక గుండెపోటు వచ్చి మృతి చెందిందా? అనేది తెలియాల్సి ఉంది. స్వరూప ఇద్దరు కూతుళ్లు వివాహాలు జరిపించగా.. భర్త పదేండ్ల క్రితమే మృతిచెందినట్టు స్థానికులు తెలిపారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల జాబితాలేవి ?

- **ఇంకా విడుదల చేయని విద్యాశాఖ**
- **ఆందోళనలో అభ్యర్థులు**

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ ఫలితాలు ప్రకటించిన రోజే జాబితాలు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించగా, అధికారులు మాత్రం విడుదల చేయలేదు. ఓవైపు సర్టిఫికెట్ వెరిఫికేషన్ గడువు సమీపిస్తుండగా, బుధవారం వరకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల 1:3 జాబితా విడుదల కాలేదు. మంగళవారం రాత్రి ఎస్జీటీ 1:3 జాబితా విడుదల కాగా, బుధవారం రాత్రి స్కూల్ అసిస్టెంట్, భాషాపండితులు, పీఈటీ పోస్టుల జాబితాలను అధికారులు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

తొలిరోజు ముగిసిన వెరిఫికేషన్

కొన్ని జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు తొలిరోజు సర్టిఫికేషన్ వెరిఫికేషన్ నిర్వహించారు. అధికారుల సమన్వయ లోపంతో అభ్యర్థులకు ఇబ్బందులు ఎదురయ్యారు. కొంత మంది అభ్యర్థులకు అకనాలెడ్జ్‌మెంట్ సర్టిఫికెట్ ఇవ్వగా మరికొన్ని జిల్లాల్లో ఇవ్వలేదు.

రైల్వేలో జాబ్స్ ఇప్పిస్తామని మోసం

- **87లక్షలు వసూలు చేసిన ముఠా**
- **సీసీఎస్‌లో కేసు నమోదు**

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ): రైల్వేలో ఉద్యోగాలిప్పిస్తామంటూ నమ్మించిన ఒక ముఠా రూ.87 లక్షలు వసూలు చేసి బాధితులను మోసగించింది. సీసీఎస్ పోలీసుల కథనం ప్రకారం.. తెలంగాణ సీఎంవోలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న బాగ్‌అంబర్‌పేట్‌కు చెందిన మధుకు దగ్గరి బంధువు ప్రశాంత్ ద్వారా కృష్ణానగర్‌లో నివాసముండే బండారు రామ్‌కుమార్‌తో పరిచయమైంది. రైల్వేలో క్లర్కు, కమర్షియల్ క్లర్క్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ రామ్‌కుమార్ నమ్మించాడు. మధుతోపాటు బంధువులు ఉద్యోగాల కోసం రామ్‌కుమార్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులకు పలు దఫాలుగా 87లక్షలు అందజేశారు. క్లర్కు పోస్టులకు ఎంపికైనట్టు ఈమెయిల్, పోస్టు ద్వారా బాధితులకు అపాయింట్‌మెంట్ లెటర్లు పంపించారు. అవన్నీ నకిలీవంటూ రైల్వే అధికారులు తేల్చడంతో బాధితులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీలో అన్ని ఎలక్ట్రిక్ వాహనాలే

- **ఫ్యూచర్ సిటీలో ఫ్యూయల్ సెల్ పరిశ్రమ**
- **తోషిబా సంస్థను కోరిన డిప్యూటీ సీఎం భట్టి**

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రికల్ బస్సులుగా రూపుదిద్దుతామని, ఇందుకు తోషిబా సంస్థ సహకరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. జపాన్ పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు ఇతర ప్రతినిధి బృందం ఎలక్ట్రానిక్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి సంస్థ తోషిబా ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. ఫ్యూచర్ సిటీలో ఫ్యూయల్‌సెల్ టెక్నాలజీ యూనిట్ ఏర్పాటుకు ముందుకురావాలని తోషిబా ప్రతినిధులను భట్టి కోరారు. లిథియం బ్యాటరీల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న తోషిబా సింగరేణి సంస్థతో కలిసి ముందుకు సాగాలని సూచించారు. తెలంగాణలో తోషిబాను మరింత విస్తరిస్తామని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

సీపీఎస్‌ఈయూ అధ్యక్షుడిగా దర్శన్

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగుల సంఘం(టీజీ సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడిగా లింగమొల్ల దర్శన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పరి విజయ్‌భాస్కర్ ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో గౌరవాధ్యక్షుడిగా రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడిగా సందీప్, ఎస్ రామదాసు, కోశాధికారిగా మారం లింగారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎల్ వీరేశం, వీ నర్సింహులు, భూలక్ష్మి, జాయింట్ సెక్రటరీగా ఎన్ ఉపేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా తిరుపతి, శోభన్, శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

భాషాపండితులకు పదోన్నతులు కల్పించాలి

ఎస్‌ఎల్‌టీఏ డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): పదోన్నతుల్లో భాగంగా మిగిలిపోయిన భాషాపండితులకు సైతం పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ తెలంగాణ స్టేట్ (ఎస్‌ఎల్‌టీఏ టీఎస్) ప్రభుత్వాన్ని కోరింది. సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇకపై భాషా సేవకు అంకితమై పనిచేస్తామని అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కే గౌరిశంకర్‌రావు తెలిపారు.

రైతు తరహాలో కార్మిక బీమా ఇవ్వండి

- **అసంఘటితరంగ కార్మికులకు అమలు చేయాలి**
- **ప్రభుత్వానికి పరిశ్రమ వర్గాలు, కార్మికుల వినతి**

హైదరాబాద్, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ): చిన్న పరిశ్రమల్లో పనిచేస్తున్న అసంఘటితరంగ కార్మికులకు రైతు బీమా తరహాలో బీమా సౌకర్యం కల్పించాలని పరిశ్రమ వర్గాలు, కార్మికవర్గ నేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. హైదరాబాద్ శివార్లలోని వేలాది పరిశ్రమల్లో లక్షలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు లేవని ఎంఎస్‌ఎంఈ సంఘం నాయకులు తెలిపారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు సహజంగా తాత్కాలిక పద్ధతిలో కార్మికులను నియమించుకుంటాయి. వీరిలో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఎక్కువగా పనిచేస్తున్నారు. మార్కెట్‌లో ఎదురయ్యే పోటీ, వ్యాపారం సరిగా సాగకపోవడం వంటి కారణాలతో కార్మికులకు వేతనాలు కూడా అంతంత మాత్రంగానే ఇస్తారు. వీరిలో బీహార్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి పొట్టచేత పట్టుకొని వచ్చేవారే ఎక్కువ. పరిశ్రమలో కానీ, బయట రోడ్డుపై కానీ ఎటువంటి ప్రమాదం జరిగినా, ఆరోగ్య సమస్యలు తలెత్తి మరణించినా వారిని ఆదుకునే నాథుడే లేడు. దీంతో కార్మికులకు బీమా సౌకర్యం వర్తింపజేయాలని, ఒకవేళ ప్రీమియం ప్రభుత్వం చెల్లించకపోతే ఆయా పరిశ్రమల ద్వారా చెల్లించేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

22 మంది మైనారిటీలకు మెడికల్‌లో ఫ్రీ సీటు

గురుకుల విద్యార్థులకు సీఎం రేవంత్ అభినందనలు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): మైనారిటీ గురుకులాలకు చెందిన 22 మంది విద్యార్థులు నీట్-2024లో ఉత్తమ ర్యాంకులు సాధించి ఓపెన్ మెరిట్‌లో ఎంబీబీఎస్‌లో ఉచిత సీట్లు సాధించారని మైనారిటీ గురుకుల సొసైటీ సెక్రటరీ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు. బుధవారం ప్రకటన విడుదల చేశారు. గురుకులంలో ఉచిత శిక్షణ, అత్యుత్తమ సౌకర్యాలు, ఉచిత హాస్టల్ సౌకర్యం ఏర్పాటుతో విద్యార్థులు ఎంబీబీఎస్‌లో సీట్లు పొందినట్టు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషి విద్యార్థులకు అభినందనలు తెలిపినట్టు పేర్కొన్నారు.

డెంగ్యూతో యువతి మృతి



కల్యాణి (ఫైల్)

చెన్నారావుపేట, అక్టోబర్ 2: డెంగ్యూతో యువతి మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లిలో బుధవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన సంగెం దేవేందర్-రమ దంపతుల కూతురు కల్యాణి (20) పీజీ చదువుతున్నది. కొద్దిరోజుల క్రితం జ్వరం రావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా పరీక్షలు నిర్వహించి డెంగ్యూగా నిర్ధారించారు. జ్వరం తీవ్రమై ప్లేట్‌లెట్స్ తగ్గడంతో బుధవారం ఉదయం మృతి చెందింది.

పెండ్లి కుదరడం లేదని

ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆత్మహత్య



దేవేందర్‌రెడ్డి (ఫైల్)

వీణవంక, అక్టోబర్ 2: పెండ్లి కావడం లేదని, సంబంధాలు కుదరడం లేదని ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ఎలుబాకలో జరిగింది. ఎలుబాకకు చెందిన బొల్లం దేవేందర్‌రెడ్డి (27) నాలుగేండ్లుగా హుజూరాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఉద్యోగం వచ్చినా పెండ్లికాకపోవడం, సంబంధాలు కుదరకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. జీవితంపై విరక్తిచెంది మంగళవారం రాత్రి గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు, తర్వాత ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ఈఆర్సీలో 11 ఉద్యోగాల భర్తీ

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి(ఈఆర్సీ)లో 11 ఉద్యోగాలను భర్తీచేశారు. ఈ ఉద్యోగాల భర్తీకి మార్చిలో నోటిఫికేషన్ జారీచేయగా, నియామక ప్రక్రియను పూర్తిచేసిన కమిషన్ పోస్టులకు ఎంపికైన వారి జాబితా విడుదల చేసింది. మిగతా ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతున్నట్టు ఈఆర్సీ వెల్లడించింది.

తెలుగు అకాడమీ పుస్తకాలను ప్రామాణికంగా తీసుకోలేం!

- **అవి రన్నింగ్‌నోట్స్ మాత్రమే.. రెఫరెన్స్ పుస్తకాలేం కావు**
- **ఎలాంటి రీసెర్చ్ చేయకుండా రాశారు.. అవి గైడ్ మాత్రమే**
- **హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో టీజీపీఎస్సీ**

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): తెలుగు అకాడమీ ముద్రించిన పుస్తకాల్లో పసలేదని.. అంతా డొల్లేనని టీజీపీఎస్సీ తేల్చింది. ఈ పుస్తకాలు పోటీపరీక్షలకు పనికిరావని, వీటిని ప్రామాణికంగా తీసుకోలేమని పేర్కొన్నది. అకాడమీ ముద్రించిన పుస్తకాలు రన్నింగ్ నోట్స్‌లా ఉన్నాయని, ఎలాంటి రీసెర్చ్ చేయకుండా రాశారని, ఇవి కేవలం గైడ్‌లా మాత్రమే ఉపయోగపడతాయని స్పష్టంచేసింది. ఈ అంశాలను పేర్కొంటూ ఇటీవలే టీజీపీఎస్సీ హైకోర్టులో అఫిడవిట్ సమర్పించింది. ఒక ప్రభుత్వ రంగ సంస్థ ముద్రించిన పుస్తకాలను ఒక చట్టబద్ధమైన సంస్థ అంగీకరించబోమని చెప్పడంతో నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొన్నది. ఇప్పటికే తెలుగు అకాడమీ పుస్తకాలను చదివిన వారు ఏం చేయాలో తోచక తలలుపట్టుకుంటున్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫైనల్ 'కీ'లోని నాలుగు ప్రశ్నల ఆన్సర్లపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఐదుగురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. 68,79, 106, 112 ప్రశ్నల సమాధానాలపై వారు అభ్యంతరాలు వ్యక్తంచేశారు. ఇందుకు తెలుగు అకాడమీ ప్రచురించిన తెలంగాణ హిస్టరీ-కల్చర్ 2016, తెలంగాణ రీజినల్ జాగ్రఫీ, పుస్తకాలను రెఫరెన్స్‌గా పేర్కొన్నారు. ఈ పుస్తకాల్లోని అంశాల ఆధారంగా ఫైనల్ 'కీ'లో మార్పులు చేయాలంటూ కోర్టు మెట్లెక్కారు. దీంతో తెలుగు అకాడమీ ముద్రించిన పుస్తకాల్లో ఎలాంటి రెఫరెన్స్‌లు లేవని, రీసెర్చ్‌వర్క్ చేయలేదని పలు అభ్యంతరాలతో టీజీపీఎస్సీ ఇటీవలే హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. తెలంగాణ హిస్టరీ-కల్చర్ 2016 పుస్తకంలో 33 చాప్టర్లతో.. పూర్వ చారిత్రక కాలం నుంచి ఆధునిక కాలం వరకు అనేక వాస్తవాలను స్ఫురించారు. 16 మంది అకాడమిషన్లు రూపొందించగా, ముగ్గురు సీనియర్ అకాడమిషన్లు ఎడిట్ చేశారు. ఏ పాఠాన్ని ఏ అకాడమిషన్ రచించారో వ్యక్తపరచలేదని అఫిడవిట్‌లో పేర్కొన్నది.

టీజీపీఎస్సీ అభ్యంతరాలివే..

- పాఠ్యాంశాల్లో ప్రస్తావించిన అంశాలకు రెఫరెన్స్ పేర్కొనలేదు. ప్రామాణిక మూలాలేంటో(సోర్స్) వెల్లడించలేదు.
- మొత్తం పుస్తకంలో, పేజీల్లోనూ అధికారమైన మూలాలను ఉదహరించలేదు. ఫుట్‌నోట్స్ లేవు.
- పుస్తకంలో ముద్రించిన అంశాలు పరిశోధన (రీసెర్చ్‌వర్క్) ఆధారంగా లేవు.
- ఈ పుస్తకాల్లో ఎక్కువగా రన్నింగ్ నోట్స్ రూపంలో రాశారు. వివిధ మూలాల నుంచి సేకరించిన అంశాలను, విషయాలను సంకలనం చేసి వివిధ అధ్యాయాల కింద కూర్చుచేశారు.
- ఈ పుస్తకం డిగ్రీ, పీజీ ఏ కోర్సుల్లోనూ పాఠ్యపుస్తకాలుగా సూచించబడలేదు.
- ఈ పుస్తకం ప్రామాణిక పాఠ్యపుస్తకం, రెఫరెన్స్‌బుక్‌లా కాకుండా కేవలం గైడ్‌గా మాత్రమే ఉపయోగపడుతుంది.

బిడ్డర్లతో అధికారుల మిలాఖత్?

- **పౌరసరఫరాల సంస్థపై ఆరోపణల వెల్లువ**
- **బిడ్డర్లకు గడువు పొడగింపులో ఆంతర్యమేమి?**
- **ధాన్యం ఎత్తకపోయినా ఎందుకా ఉదాసీనత?**
- **35 లక్షల టన్నుల ధాన్యంలో ఎత్తింది 10 లక్షలే**
- **ప్రతి నెలా 50 కోట్ల చొప్పన 500 కోట్లు వడ్డీలకే!**

ధాన్యం అమ్ముకున్న మిల్లర్లు?

పలువురు మిల్లర్లు కూడా ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు బడా మిల్లర్లు బాయిల్డ్‌రైస్‌ను తమిళనాడులో విక్రయించగా, మరికొంత భాగాన్ని విదేశాలకు దొడ్డిదారిన ఎగుమతి చేశారనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం విచారణ చేపట్టినట్టు సమాచారం. వరంగల్ జిల్లాకు చెందిన మణికంఠ కన్వేయర్స్ ద్వారా ఈ వ్యవహారం సాగినట్టు విజిలెన్స్ విభాగం గుర్తించింది. దీనిపై ఆయా మిల్లర్లకు నోటీసులు జారీ చేసింది.

హైదరాబాద్, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ): టెండర్లలో ధాన్యం దక్కించుకున్న బిడ్డర్లకు ధాన్యం ఎత్తేందుకు ఇచ్చిన గడువును పదేపదే పొడగిస్తుండటంతో పౌర సరఫరాల సంస్థపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సకాలంలో ధాన్యం ఎత్తకుండా, నిబంధనలను అతిక్రమిస్తున్న బిడ్డర్లపై ఉదాసీనంగా వ్యవహరించాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రెండుసార్లు గడువు పొడగించిన సంస్థ.. మరోసారి పొడగించడంపై విమర్శలకు తావిస్తున్నది. అదే సమయంలో మిల్లర్లపై వివిధ రకాల తనిఖీల పేరుతో పౌరసరఫరాల సంస్థ ఉక్కుపాదం మోపుతున్నది. ఈ విధంగా మిల్లర్లు, బిడ్డర్లపై పౌరసరఫరాల సంస్థ ద్వంద్వ వైఖరిని అవలంభించడం అనుమానాలకు తావిస్తున్నది.

గడువించిన ధాన్యం ఎత్తని బిడ్డర్లు

2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించిన దాదాపు రూ.ఏడువేల కోట్ల విలువైన 35 లక్షల టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ గత జనవరిలోనే వేలం వేసింది. ఇందులో నాలుగు కంపెనీలు ధాన్యాన్ని దక్కించుకున్నాయి. ఫిబ్రవరి 23న ఈ కంపెనీలకు కన్ఫర్మేషన్ లెటర్లు జారీ చేసిన సంస్థ... 90 రోజుల్లో మొత్తం ధాన్యాన్ని తీసుకెళ్లాలని పేర్కొన్నది. కానీ, కంపెనీలు గడువులో ధాన్యాన్ని ఎత్తకపోవడంతో మరోసారి రెండు నెలల గడువు పొడగించింది. అయినప్పటికీ ఎత్తకపోవడంతో మరో రెండు నెలల గడువు ఇచ్చింది. ఇది కూడా సెప్టెంబర్ 23తో ముగిసింది. అప్పటికీ కంపెనీలు ధాన్యం ఎత్తలేదు. దీంతో డిసెంబర్ ఆఖరు వరకు మరోసారి గడువు పొడగించింది. ఇప్పటివరకు సదరు కంపెనీలు కేవలం రూ.రెండు వేల కోట్ల విలువైన 10 లక్షల టన్నులు మాత్రమే ఎత్తినట్టు తెలిసింది.

బిడ్డర్లపై ఈగ వాలనిస్తలేరా?

నిర్ణీత గడువులో టెండర్‌దారులు లక్ష్యాన్ని చేరుకోకపోతే వారిపై చర్యలు తీసుకోవడమనేది టెండర్ ప్రక్రియలో సాధారణ నిబంధన. కానీ, ధాన్యం ఎత్తడంలో విఫలమైన బిడ్డర్లలో ఏ ఒక్కరిపై కూడా పౌరసరఫరాల సంస్థ చర్యలు తీసుకోలేదు. దీంతో బిడ్డర్లతో అధికారులు కుమ్మక్కయ్యారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పౌర సరఫరాల సంస్థలోని పలువురు అధికారులు బిడ్డర్లపై ఈగ వాలకుండా చూసుకుంటున్నారని, బిడ్డర్లు ఎలా చెప్తే అలా వింటున్నారనే ప్రచారం జరుగుతున్నది. అధికారుల నిర్లక్ష్యం, బిడ్డర్లపై ఉదాసీనత కారణంగా పౌరసరఫరాల సంస్థపై ఆర్థిక భారం పడుతున్నది. ధాన్యం విక్రయం వల్ల మూడు నెలల్లో రూ.ఏడు వేల కోట్లు వస్తాయని సంస్థ అధికారులు చెప్పారు. కానీ, ఇప్పుడు అసలు 7వేల కోట్లు రాకపోగా.. వడ్డీ భారం పడుతున్నది. ప్రతి నెలా సుమారు రూ.50 కోట్ల వరకు పౌరసరఫరాల సంస్థ వడ్డీ చెల్లించాల్సి వస్తున్నది. ఇప్పటివరకు రూ.350 కోట్ల వరకు వడ్డీ చెల్లించినట్టు తెలిసింది. ఇప్పుడు డిసెంబర్ వరకు గడువు పొడగించడంతో ఈ భారం రూ.500 కోట్లకు చేరుతుందని ఆ సంస్థ అధికారులు అంచనా వేస్తున్నారు.

బిడ్డర్ల వసూళ్ల పర్వం

బిడ్డర్లు ధాన్యం ఎత్తకపోగా, ధాన్యానికి బదులు డబ్బులు ఇవ్వాలని మిల్లర్లను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. టెండర్‌లో సగటున క్వింటాల్‌కు రూ.రెండు వేల చొప్పున దక్కించుకోగా, ధాన్యం బదులుగా తమకు రూ.2,230 చొప్పున చెల్లించాలని మిల్లర్లను బిడ్డర్లు బెదిరిస్తున్నట్టు తెలిసింది.

వీసీ పదవులెవరిని వరించేనో?

- **నేడు, రేపు సెర్చ్ కమిటీ సమావేశాలు**
- **ఆశావాహుల ముమ్మర ప్రయత్నాలు**
- **అన్ని సామాజికవర్గాలకు ప్రాధాన్యం**

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రధాన వర్సిటీల్లో కొత్త వీసీల పేర్లను ఖరారు చేసేందుకు సెర్చ్ కమిటీ సమావేశాలు షురూ కావడంతో ఆ పోస్టులెవరిని వరిస్తాయోనన్న చర్చలు జోరుగా నడుస్తున్నాయి. బుధవారం తెలంగాణ వర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. గురువారం పాలమూరు, ఉస్మానియా, బీఆర్‌ఏవోయూ, తెలంగాణ వర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశాలు జరగనున్నాయి. శుక్రవారం శాతవాహన, కాకతీయ, జేఎన్టీయూ సెర్చ్ కమిటీ సమావేశాలు జరగనున్నాయి. సచివాలయంలోని సీఎస్ చాంబర్‌లో సమావేశాలు జరగనుండగా, ప్రభుత్వవర్గాలు అత్యంత గోప్యతను పాటిస్తున్నాయి. రాష్ట్రంలోని 10 వర్సిటీల వీసీల పదవీకాలం మే 21తో ముగిసింది. ప్రస్తుతం ఇన్‌చార్జి వీసీలతోనే నెట్టుకొస్తున్నారు. పది వర్సిటీలున్నా ప్రధానంగా ఉస్మానియా, జేఎన్టీయూ వీసీ పోస్టులపైనే అత్యధికులు గురిపెట్టారు. కీలకమైన జేఎన్టీయూ వీసీ పోస్టుకు ఉత్తరాదిలోని ఓ ఎన్ఐటీకి చెందిన ప్రొఫెసర్ ప్రయత్నిస్తున్నట్టుగా ప్రచారం జరుగుతున్నది. ఓసీ సామాజికవర్గానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ సీఎం ఆశీస్సులతో ఓయూ వీసీ పోస్టుకు పోటీపడుతున్నారు. ఓ యువ ఎమ్మెల్సీ సైతం తనకు కావాల్సిన వారికి ఇప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉత్తర తెలంగాణకు చెందిన ఓ మంత్రి తనకు సన్నిహిత ప్రొఫెసర్‌కు ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. కేయూకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ తన నియోజకవర్గం మంత్రి ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. ఏపీలోని ఓ ప్రైవేట్ వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రి ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నట్టు తెలిసింది. మైనార్టీ వర్గానికి చెందిన మరో ప్రొఫెసర్ కామారెడ్డి జిల్లాకు చెందిన కీలక నేతతోపాటు ఎంఐఎం కీలక నేతల ఆశీస్సులు కోరినట్టు తెలుస్తున్నది. పలువురు ప్రొఫెసర్లు సామాజిక అస్త్రాన్ని వాడుతున్నారు. తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

పీసీసీఎఫ్ వినయ్ కుమార్‌కు అశోక అవార్డు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): డెహ్రాడూన్‌లోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్‌లో ఇంటర్నేషనల్ కార్పొరేషన్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్, పీసీసీఎఫ్ వినయ్‌కుమార్‌కు ప్రతిష్ఠాత్మక పౌరసేవల అశోక అవార్డు-2024 దక్కింది. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ 1992 బ్యాచ్‌లో తెలంగాణ క్యాడర్‌కు చెందిన వినయ్‌కుమార్ ప్రస్తుతం కేంద్ర సర్వీసులో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. బుధవారం ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ గవర్నర్ శేఖర్‌దత్తా, డాక్టర్ ఆర్‌కే రంజన్‌సింగ్, మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీపీసింగ్ సమక్షంలో ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ దీపక్‌కపూర్ ఈ అవార్డును ప్రదానం చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జాతీయ కమిటీ నాయకులు

జాతీయ సంస్థగా పీడీఎస్‌యూ

13 రాష్ట్రాల విద్యార్థి సంఘాల విలీనం

ముషీరాబాద్, అక్టోబర్ 2: దేశంలోని 13 రాష్ట్రాలకు చెందిన ప్రగతిశీల, విప్లవ విద్యార్థి సంఘాలు ఏకతాటిపైకి వచ్చి ఉమ్మడి పీడీఎస్‌యూ ఆలిండియా ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులుగా నామాల ఆజాద్, రామకృష్ణ(తెలంగాణ), తిమ్మన్న(కర్ణాటక), భవానీ(ఒడిశా), రాకేశ్, పవిత్ర(ఏపీ), నయన్, మనోజ్(అస్సాం), తిరుపతి(ఢిల్లీ), హన్మంత్‌హండే(మహారాష్ట్ర), నరసింహరావు(తెలంగాణ), అహిర్, అనిందిత(పశ్చిమబెంగాల్)లు ఎంపికైనట్టు కన్వీనర్ ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రగతి శీల విప్లవ, విద్యార్థి సంఘాల విలీనంతో కేంద్ర, రాష్ట్రస్థాయిలో విద్యార్థి సమస్యలపై ఉద్యమాలు చేపడతామని, విద్య ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు.


భారత్ పసిడి జోరు



లిమా (పెరూ): ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ షూటర్లు పతకాల పంట పండిస్తున్నారు. టోర్నీ నాలుగో రోజు భారత్‌కు ఏకంగా 5 స్వర్ణాలు, రెండు రజతాలు దక్కాయి. పురుషుల 25 మీటర్ల జూనియర్ పిస్టల్ ఫైనల్‌లో ముకేశ్ స్వర్ణం గెలవగా భారత్‌కే చెందిన సూరజ్ శర్మకు రజతం దక్కింది. ఇదే విభాగపు టీమ్ ఈవెంట్‌లో ముకేశ్, సూరజ్, ప్రద్యుమ్న్ పసిడి గెలుచుకున్నారు. మహిళల 25 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో దివ్యాన్షి, తేజస్విని, విభూతి బంగారు పతకం సాధించారు. ఇదే విభాగం వ్యక్తిగత ఫైనల్‌లో దివ్యాన్షి అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం ముద్దాడింది. ఈ టోర్నీలో భారత్ ఇప్పటికే 10 స్వర్ణాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతున్నది.

అల్కారజ్‌దే చైనా ఓపెన్

ఫైనల్‌లో సిన్నర్‌కు పరాభవం



బీజింగ్: హోరాహోరీగా సాగిన చైనా ఓపెన్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్స్‌లో స్పెయిన్ కుర్రాడు కార్లొస్ అల్కారజ్ విజేతగా నిలిచాడు. ఫైనల్‌లో రెండో సీడ్ అల్కారజ్ 6-7 (6/8), 6-4, 7-6 (7/3) తో డిఫెండింగ్ చాంపియన్ జన్నిక్ సిన్నర్ (ఇటలీ)ను ఓడించి టైటిల్ గెలిచాడు. ఇరువురి మధ్య సుమారు మూడున్నర గంటల పాటు రసవత్తరంగా సాగిన పోరులో విజయం కోసం కుర్రాళ్లిద్దరూ నువ్వానేనా అన్నట్టుగా తలపడ్డారు. తొలి సెట్‌ను టైబ్రేక్‌తో సిన్నర్ గెలుచుకోగా రెండో సెట్ ఒక దశలో 4-3తో వెనుకబడ్డా అల్కారజ్ అనూహ్యంగా పుంజుకుని ఆ సెట్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక నిర్ణయాత్మక మూడో సెట్ కూడా టై బ్రేక్‌కు వెళ్లగా అందులో అల్కారజ్.. 0-3తో ఉన్నా వరుసగా ఏడు పాయింట్లు గెలిచి సెట్‌తో పాటు మ్యాచ్‌నూ గెలుచుకున్నాడు. ఈ ఏడాది సిన్నర్‌పై అల్కారజ్‌కు ఇది వరుసగా మూడో విజయం. ఈ టోర్నీ మహిళల సింగిల్స్‌లో కోకో గాఫ్, అరీనా సబలెంక, ఆండ్రీవా వంటి టాప్ సీడ్ ప్లేయర్లు క్వార్టర్స్ చేరారు.

సర్ఫరాజ్ డబుల్ సెంచరీ

ఇరానీ కప్



సర్ఫరాజ్ (221*)

లక్నో: రంజీ చాంపియన్ ముంబై, రెస్టాఫ్ ఇండియా జట్ల మధ్య లక్నో వేదికగా జరుగుతున్న ఇరానీ కప్‌లో యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ ద్విశతకం (276 బంతుల్లో 221 నాటౌట్, 25 ఫోర్లు, 4 సిక్సర్లు)తో మెరిశాడు. 237/4 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండో రోజు ఆరంభించిన ముంబై.. సర్ఫరాజ్ దూకుడుతో భారీ స్కోరు సాధించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 9 వికెట్ల నష్టానికి 536 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ అజింక్యా రహానే (97) తృటిలో శతకం కోల్పోగా తనుష్ కొటియాన్ (64), శార్దూల్ ఠాకూర్ (36) రాణించారు.

పొట్టిపోరుకు సై

నేటి నుంచి మహిళల టీ20 వరల్డ్ కప్.. బరిలో పది జట్లు

టైటిల్ ఫేవరేట్‌గా టీమ్ఇండియా.. ఏడోసారి కప్ కొట్టేందుకు ఆసీస్ తహతహ

మహిళల టీ20 ప్రపంచకప్ పోరుకు రంగం సిద్ధమైంది. యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) వేదికగా 10 జట్లు మెగాటోర్నీలో తలపడబోతున్నాయి. గురువారం నుంచి మొదలయ్యే పొట్టి ప్రపంచకప్‌లో రసవత్తర పోరాటాలకు తెరలేవనుంది. అభిమానులను మునివేళ్లపై నిలబెడుతూ బౌండరీలు చిన్నబోయేలా అమ్మాయిలు అదరగొట్టేందుకు సర్వశక్తులు ఒడ్డనున్నారు. క్షణకాలంలో ఫలితం మారే టీ20ల్లో ప్రపంచ చాంపియన్‌గా నిలిచేందుకు పక్కా ప్రణాళికతో కదంతొక్కనున్నారు. ఆరుసార్లు విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా 'ఏడో'సారి కన్నేస్తే..ఈసారైనా కప్ ముద్దాడాలన్న కసితో భారత్ కనిపిస్తున్నది. కరీబియన్ గడ్డపై చరిత్ర సృష్టించిన రోహిత్‌సేనను స్ఫూర్తిగా తీసుకుంటూ సత్తా చాటాలని టీమ్ఇండియా పట్టుదలతో ఉన్నది.



స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

దుబాయ్: మూడు నెలల క్రితం యూఎస్ఏ, వెస్టిండీస్ వేదికలుగా ముగిసిన ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ తర్వాత క్రికెట్ అభిమానులను మరోసారి అలరించేందుకు మరో టీ20 విందు సిద్ధమైంది. గురువారం (అక్టోబర్ 3) నుంచి యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వేదికగా మహిళల పొట్టి ప్రపంచకప్‌నకు తెరలేవనుంది. వాస్తవానికి ఈ టోర్నీకి బంగ్లాదేశ్ ఆతిథ్యమివ్వాల్సి ఉన్నా ఆగస్టులో అక్కడ నెలకొన్న రాజకీయ అనిశ్చితితో ఐసీసీ ఈ మెగా పోరును యూఏఈకి తరలించింది. 9వ ఎడిషన్‌గా జరుగబోయే తాజా టోర్నీలో ఏడోసారి టైటిల్ కైవసం చేసుకునేందుకు ఆస్ట్రేలియా భావిస్తుండగా కంగారుల ఆధిపత్యానికి గండి కొట్టేందుకు భారత్, ఇంగ్లండ్, సౌతాఫ్రికా, న్యూజిలాండ్, వెస్టిండీస్ వంటి జట్లు పూర్తిస్థాయి అస్త్రశస్త్రాలతో సన్నద్ధమయ్యాయి. ఈ టోర్నీలో ఇంతవరకూ గ్రూప్ దశను దాటని పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంకతో పాటు అరంగేట్ర జట్టు స్కాట్లాండ్ సత్తా చాటేందుకు సిద్ధమయ్యాయి. గురువారం జరిగే డబుల్ హెడర్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను స్కాట్లాండ్ ఢీకొననుండగా రెండో మ్యాచ్‌లో పాకిస్థాన్.. శ్రీలంకతో తలపడనుంది.

టోర్నీ ఫార్మాట్ ఇలా..

అక్టోబర్ 3 నుంచి 20 దాకా యూఏఈలోని దుబాయ్, షార్జా వేదికలుగా జరుగబోయే ఈ మెగా టోర్నీలో మొత్తం 23 మ్యాచ్‌లు ఉన్నాయి. గ్రూప్ దశలో 20 మ్యాచ్‌లు, రెండు సెమీస్‌లు, ఫైనల్ జరుగనుంది. పది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ దశలో భాగంగా ఒక్కో జట్టు గ్రూపులోని మరో జట్టుతో ఒక మ్యాచ్ (మొత్తం నాలుగు) ఆడనుంది. గ్రూప్ దశలో టాప్-2 జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. అక్టోబర్ 17, 18న సెమీస్ మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా 20న దుబాయ్ వేదికగా ఫైనల్ జరుగుతుంది.

ఆసీస్ ఆధిపత్యాన్ని నిలువరించేనా?

తొమ్మిదో ఎడిషన్‌గా జరుగుతున్న ఈ టోర్నీలో ఆస్ట్రేలియా ఏకంగా ఆరుసార్లూ టైటిల్ నెగ్గి ఒకసారి రన్నరప్‌గా నిలిచిందంటేనే ఆ జట్టు ఆధిపత్యం ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్న కంగారూలు ఈసారి అలిస్సా హీలి నేతృత్వంలో ఆడనున్నారు. దిగ్గజ సారథి మెగ్‌లానింగ్ సారథ్యంలో గత ఎడిషన్ (2022) ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను వారి సొంతగడ్డపైనే చిత్తుచేసిన ఆసీస్.. యూఏఈలోనూ అదే మ్యాజిక్‌ను రిపీట్ చేయాలని పట్టుదలతో ఉంది. హీలితో పాటు ఆష్లే గార్డ్‌నర్, ఎల్లీస్ పెర్రీ, తహిలా మెక్‌గ్రాత్, బెత్ మూనీ వంటి ప్రపంచ స్థాయి ఆటగాళ్లు ఆ జట్టు సొంతం. అయితే ఈసారి ఆసీస్‌కు టైటిల్ నెగ్గడం అంత సులభమైతే కాదు. గత రెండేండ్ల కాలంలో భారత్, ఇంగ్లండ్, సౌతాఫ్రికా వంటి జట్లు నిలకడగా రాణిస్తుండగా న్యూజిలాండ్ సైతం మెరుగైన ఆటతీరుతో కంగారూలకు కళ్లెం వేసేందుకు సిద్ధమైంది.

భారత్ ఈసారైనా?

సుమారు దశాబ్దకాలం తర్వాత భారత ఐసీసీ ట్రోఫీ కలను నెరవేర్చిన పురుషుల జట్టు ఇచ్చిన గెలుపు స్ఫూర్తితో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన టోర్నీకి సిద్ధమైంది. టీ20 వరల్డ్‌కప్ తొలి ఎడిషన్ (2009) నుంచి ఆడుతున్నా భారత్ ఇప్పటిదాకా టైటిల్ నెగ్గలేదు. 2020 ఎడిషన్ ఫైనల్‌లో ఆసీస్ చేతిలోనే ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. గత ఎడిషన్‌లోనూ సెమీస్‌లో కంగారూలే మన టైటిల్ వేటకు అడ్డుపడ్డారు. గెలుపు దిశగా సాగుతున్న ఆ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ రనౌట్‌తో భారత అభిమానుల గుండె పగిలింది. కానీ గత రెండేండ్లలో ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వల్ల భారత్ బాగా మెరుగైంది. హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, దీప్తి శర్మ వంటి సీనియర్లతో పాటు షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, శ్రేయాంక పాటిల్ వంటి మెరికల్లాంటి ఆటగాళ్లు మన సొంతం. యూఏఈ పిచ్‌లు స్పిన్నర్లకు అనుకూలంగా ఉండనున్న నేపథ్యంలో దీప్తి, శ్రేయాంక, రాధా యాదవ్ కీలకం కానున్నారు. అయితే ఈ ఏడాది పొట్టి ఫార్మాట్‌లో భారత్ ఏడు మ్యాచ్‌లు మాత్రమే ఆడటం గమనార్హం. గ్రూప్-ఏలో ఉన్న భారత్.. ఈనెల 4న న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌తో టైటిల్ వేటను మొదలుపెట్టనుంది. అక్టోబర్ 6న దాయాది పాకిస్థాన్‌తో ఆడుతుంది. 2018 నుంచి జట్టును నడిపిస్తున్న హర్మన్‌ప్రీత్‌పై ఈసారి ఒత్తిడి అధికంగా ఉంది. కీలక మ్యాచ్‌లలో ఒత్తిడి నుంచి బయటపడగలిగితే టైటిల్‌ను సొంతం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు.

భారత్ షెడ్యూల్

అక్టోబర్ 04	భారత్ X న్యూజిలాండ్	దుబాయ్	రా. 7:30 గం.
అక్టోబర్ 06	భారత్ X పాకిస్థాన్	దుబాయ్	మ. 3:30 గం.
అక్టోబర్ 09	భారత్ X శ్రీలంక	దుబాయ్	రా. 7:30 గం.
అక్టోబర్ 13	భారత్ X ఆస్ట్రేలియా	షార్జా	రా. 7:30 గం.

గ్రూప్ - ఏ: భారత్, పాకిస్థాన్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక

గ్రూప్- బీ: ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, బంగ్లాదేశ్, స్కాట్లాండ్

పల్లె ప్రతిభను ప్రోత్సహించేలా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: పల్లెల్లో దాగున్న ప్రతిభను ప్రోత్సహించేలా సీఎం కప్-2024 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా దాదాపు రెండు నెలల పాటు గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడాపోటీల నిర్వహణకు సమాయత్తమైంది. ఇందులో భాగంగా బుధవారం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి పలు అంశాలపై మాట్లాడుతూ 'గ్రామీణ యువతలో దాగున్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ నిర్వహిస్తున్నాం. పల్లె క్రీడాకారులను ప్రపంచ చాంపియన్లుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకెళుతున్నాం. గురువారం సీఎం కప్ టోర్నీ లోగో, మస్కట్‌ను రేవంత్‌రెడ్డి ఆవిష్కరిస్తారు' అని అన్నారు.

భారత్‌లో ఖో ఖో వరల్డ్ కప్

ఢిల్లీ: వచ్చే ఏడాది భారత్ వేదికగా 'ఖో ఖో ప్రపంచకప్'ను నిర్వహించనున్నట్టు భారత ఖో ఖో సమాఖ్య (కేకేఎఫ్ఐ) బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ టోర్నీలో ఆరు ఖండాల నుంచి 16 పురుషుల, 24 మహిళల జట్లు పాల్గొననున్నాయి. '2032 ఒలింపిక్స్‌లో ఖో ఖో ను క్రీడాంశంగా చేర్చే దిశగా ఈ ప్రపంచకప్ ఎంతగానో ఉపయోగపడుతుంది' అని కేకేఎఫ్ అధ్యక్షుడు సుధాన్షు మిట్టల్ తెలిపాడు.

బాబర్ మళ్లీ..

పరిమిత ఓవర్ల సారథ్యానికి రాజీనామా



లాహోర్: పాకిస్థాన్ పరిమిత ఓవర్ల క్రికెట్ జట్టు సారథి బాబర్ ఆజమ్ మరోసారి కెప్టెన్సీ బాధ్యతలకు గుడ్‌బై చెప్పాడు. వన్డే, టీ20 కెప్టెన్సీకి రాజీనామా చేస్తున్నట్టు బుధవారం ఎక్స్ వేదికగా ప్రకటించాడు. అతడు ఇలా చేయడం ఏడాదికాలంలో ఇది రెండోసారి. గతేడాది భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో పాక్ గ్రూప్ దశకే పరిమితమవడంతో అతడు కెప్టెన్సీని వదులుకున్నా కొద్దిరోజుల తర్వాత పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మళ్లీ అతడికి ఆ బాధ్యతలను అప్పజెప్పింది.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



ప్రీంకారాసన గర్భితానల శిఖాం సౌఃక్లీం కళాంబిభ్రతీం
సౌవర్ణాంబర ధారిణీం వరసుధాదౌతాం త్రినేత్రోజ్జ్వలాం।
వందే పుస్తక పాశమంకుశ ధరాం స్రగ్భూషితాముజ్జ్వలాం
త్వాం గౌరీం త్రిపురాం పరాత్పర కళాం శ్రీచక్ర సంచారిణీం॥

బాలాత్రిపుర సుందరీదేవి

నేటి అలంకారం

త్రిపురుని భార్య త్రిపురసుందరీ దేవి. అంటే పరమేశ్వరుని భార్య అయిన గౌరీదేవి అని అర్థం. త్రిపురాత్రయంలో బాలాత్రిపుర సుందరీ దేవి తొలి దేవత. అందుకనే నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని మొదటి రోజున బాలాత్రిపురసుందరీ దేవిగా అలంకరణ చేస్తారు. మనస్సు, బుద్ధి, అహంకారం ఈ తల్లి అధీనంలో ఉంటాయి. ఈ తల్లి అభయహస్తం, వరదముద్ర ప్రదర్శిస్తూ అక్షమాల ధరించి ఉంటుంది. ఈమెను ఆరాధించటం వల్ల నిత్య సంతోషం కలుగుతుంది. శ్రీచక్ర సంప్రదాయంలో షోడశీ విద్యకు ఈమె అధిదేవత. రెండు నుంచి పదేండ్లు వయసులోపు బాలికలను బాలాత్రిపురసుందరీ దేవి స్వరూపంగా అర్చించి, సకల సుమంగళ ద్రవ్యాలు, నూతన వస్త్రాలు ఇవ్వాలి. ఇందువల్ల ఆ తల్లి అనుగ్రహం కలుగుతుంది. బాలా త్రిపురసుందరీ దేవి అనుగ్రహం వల్ల సత్సంతానం కలుగుతుంది. అమ్మవారికి పాయసం నివేదనగా సమర్పించాలి.

అటుకుల బతుకమ్మ

మనిషి సంఘజీవి. 'సంఘేశక్తి కలియుగం' అన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీచక్రార్చన విశేషంగా చేసుకుంటారు. వేదోక్తంగా పూజాధికాలు చేయలేని వారు పూలతో బతుకమ్మను కొలువుదీర్చి శ్రీచక్రంగా భావన చేస్తారు. శతాబ్దాలుగా వస్తున్న సదాచారం ఇది. నవరాత్రుల్లో ఆ తల్లి మహాకాళిగా మూడు రోజులు, మహాలక్ష్మిగా మూడు రోజులు, మహాసరస్వతిగా మూడు రోజులు కొలువుదీరి దుష్ట శిక్షణ (రాక్షస సంహారం) చేస్తుంది. యుద్ధంలో పోరాడుతున్న అమ్మకు తోడుగా మేమున్నామంటూ స్త్రీశక్తికి సంకేతంగా మహిళలంతా చప్పట్లు కొడుతూ, హుషారైన పాటలు పాడుతూ ఉంటారు. అలసిపోయిన అమ్మకు అటుకుల్లో బెల్లం గానీ, చక్కెర గానీ కలిపి నైవేద్యంగా సమర్పిస్తారు. బతుకమ్మ ప్రసాదంగా వాటిని అందరూ పంచుకుంటారు. పసుపు, కుంకుమలు ఇస్తూ సౌభాగ్యవతిగా ఉండాలని కోరుకుంటారు. అలా అటుకుల బతుకమ్మ సందడిలో అందరూ ఆనందంగా పాలుపంచుకుంటారు.

• డా॥ ఆర్.కమల



నేటి బతుకమ్మ

చూపు తిప్పకోలేనంత అందగత్తె కాదు. ఆకట్టుకునేంత రూపమూ లేదు. కానీ, సునీతా రాజ్వర్‌లో ఏదో ఉంది. అందుకే, ఓటీటీలో ఆమె అదరగొడుతున్నది. తన అభినయంతో హిందీ ప్రేక్షకుల మనసు దోచుకుంటున్నది. లారీ డ్రైవర్ బిడ్డగా జీవితంలో ఎన్నో ఒడుదొడుకులను చూసిందామె. ప్రతి ప్రతికూల పరిస్థితినీ ఓపికగా ఎదుర్కొన్నది. సోపానంగా మలుచుకుంది. విజయ తీరాలకు చేరుకుంది. సునీత కథ చదివితే.. జీవితంలో గెలవడానికి ప్రతిభే కాదు దానికి తగ్గ సహనమూ ఉండాలని తెలుస్తుంది.



సహనమే.. విజయ సోపానం



హిందీ చిత్రం 'సంతోష్'లో సునీతా రాజ్వర్ నటనకు ఎన్నో ప్రశంసలొచ్చాయి. కేన్స్ ఆహ్వానం అందుకున్నది. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ మెట్లెక్కిన ఆమె ఒకప్పుడు సినిమాలపై అసంతృప్తితో ఆ రంగాన్నే వదిలిపోయింది. కానీ, పోయిన చోటే తిరిగి వెతుక్కుంది. అంతర్జాతీయ సినిమా వేడుక ఆహ్వానం అందుకున్న సునీత జీవితం వడ్డించిన విస్తరి కాదు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ వాళ్ల సొంతూరు. తండ్రి ఓ ట్రక్ డ్రైవర్. ముగ్గురు సంతానంలో ఆమె ఒకరు. పిల్లల్ని చదివించడమే ఆ తండ్రికి గగనంగా ఉండేది. అయినా కష్టపడి పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు చదివింది సునీత. కానీ, ఆమెకు ఉద్యోగం చేయాలన్న ఆసక్తి ఉండేది కాదు. సినిమాల్లో నటించాలని కలలు కనేది. సునీత తండ్రికి సినిమాలంటే ఎంతో ఇష్టం. సినిమాల్లో నటించాలన్నది ఆయన కోరిక. కానీ, సంసార భారంతో ఆయన తన కోరికను మొగ్గలోనే తుంచేశాడు. కానీ, సినిమాలు తెగ చూసేవాడు. తండ్రి ప్రభావంతో సునీత సినిమాల్లోకి రావాలనుకుంది.

తండ్రితో సినిమాలకు వెళ్లినప్పుడల్లా.. తనను తాను వెండితెరపై ఎప్పుడు చూసుకుంటానా అని అనుకునేది సునీత. ఆమెతో పాటు ఆమె పట్టుదలా పెరిగింది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ)లో చేరింది. బిడ్డ కోరికను తండ్రి కాదనలేకపోయాడు. అప్పు చేసి ఓ ముప్పయ్‌వేల రూపాయలు కూతురి చేతిలో పెట్టాడు. జూనియర్ ఆర్టిస్టులతో కలిసి ఇరుకైన గదుల్లో ఉంటూ సినిమా అవకాశాల కోసం తిరుగుతూ ఉండేది సునీత. తెచ్చుకున్న డబ్బులన్నీ అయిపోయినా.. ఆమెకు అవకాశాలు రాలేదు. అయినా వెనక్కి తగ్గలేదు. మురికివాడలో ఉంటూ రోజులు వెళ్లదీసింది. చివరికి చిన్న అవకాశం వచ్చింది. 'మైం మాధురీ దీక్షిత్ బన్‌నా చాహ్తీ హూం' సినిమాలో చాన్స్ దక్కింది. 'ఏక్ చాలీస్‌కి లాస్ట్ లోకల్' సినిమాతో మరో విజయం అందుకుంది. ఇందులో చక్లీ అనే ముంబయి గ్యాంగ్‌స్టర్ పాత్ర పోషించి ప్రేక్షకులను మెప్పించింది. ఇందులో ఆమె నటనకు గానూ మ్యాక్స్ స్టార్‌డస్ట్ అవార్డు అందుకుంది. ఇంత గుర్తింపు వచ్చినా.. తర్వాత అవకాశాలు మళ్లీ ముఖం చాటేశాయి. తానేమిటో నిరూపించుకున్నా.. వరుసగా పనిమనిషి పాత్రలే ఆమెను పలకరించసాగాయి.

సినిమాల్లో రాణించాలంటే 'గుమ్మడికాయంత ప్రతిభ ఉన్నా.. ఆవగింజంత అదృష్టం కూడా ఉండాల'ని చెబుతుంటారు. అవకాశం రూపంలో అదృష్టం పలకరించినా.. అంతగా ప్రాధాన్యం లేని పాత్ర ఎదురై దురదృష్టం వెక్కిరించేది. మరోవైపు టీవీ సీరియళ్లలో కూడా చేసింది సునీత. సినిమాల్లో నటించాలన్న కోరిక నెరవేర్చుకోవడం కోసం ఇంతలా కష్టపడాలా? అని ఎన్నోసార్లు అనుకునేది. చివరికి విసుగెత్తి ఇండస్ట్రీకి దూరమైంది. సినిమాలకు ఎంత దూరంగా ఉన్నా.. ఆ రంగుల కలలు ఆమెను స్థిమితంగా ఉండనీయలేదు. మరోసారి ప్రయత్నించి చూద్దామని మనసును దృఢపరుచుకుంది. అదే సమయంలో కొన్ని పాత్రలు ఆమెను వెతుక్కుంటూ వచ్చాయి. ఆంచి, ఉర్ఫ్ గంట, సంతోష్ లాంటి సినిమాల్లో నటనకు స్కోప్ ఉన్న పాత్రలు చేసింది. 'పంచాయత్' వెబ్‌సిరీస్‌లో క్రాంతి దేవిగా, 'గుల్లాక్స్'లో బిట్టు వాళ్ల అమ్మగా చేసి.. ఓటీటీలో ఓవర్‌నైట్ స్టార్ అయిపోయింది. 'సంతోష్' సినిమాలో సహనటి పాత్రలో జీవించిన సునీత 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆహ్వానం అందుకుంది. దర్బన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ నుంచి కూడా ఆమెకు పిలుపు వచ్చింది. ఒక్కసారిగా సునీత దశ తిరిగింది. ఇప్పుడు ఆమెకు చేతినిండా పని ఉంది. సినిమాలు, వెబ్‌సిరీస్‌లతో బిజీ అయిపోయింది. ఆశించిన దానికన్నా ఎక్కువ గుర్తింపు, గౌరవం అందుకుంటున్నది. కష్టపడే తత్వం ఉన్నవాళ్ల ప్రతిభకు గుర్తింపు ఎప్పటికైనా వస్తుంది. కానీ, ఆ కష్టానికి తగినంత సహనమూ ఉండాలని సునీత అనుభవం చెబుతుంది.

మనిషికి అసలైన బలం.. ఆత్మవిశ్వాసమే! ఎంత ప్రతిభ ఉన్నా.. తనపై తనకు నమ్మకం లేకపోతే ఏమీ లేనట్లే! ఆత్మవిశ్వాసం.. మనిషిని నడిపించే దివ్యౌషధం కూడా! అయితే.. కొందరు మహిళా ఉద్యోగులు ఊరికే ఆత్మన్యూనతకు గురవుతున్నారట. ఆత్మవిశ్వాసాన్నీ కోల్పోతున్నారట. దీనికే 'ఇంపోస్టర్ సింగ్రోమ్' అనిపేరు. 1978లోనే ఈ పరిస్థితిని గుర్తించిన సైకాలజిస్టులు.. ఇదేం మానసిక రుగ్మత కాదనీ, మనుషుల్లో సహజంగానే ఉంటుందనీ తేల్చారు. నిన్న మొన్న ఉద్యోగంలో చేరిన జూనియర్లలో ఈ సమస్య ఎక్కువగా ఉంటే.. తమతమ వృత్తుల్లో తలపండిన వారూ ఇందుకు మినహాయింపేం కాదు! చాలామంది ఈ సమస్యతో సతమతం అవుతున్నారు. బయటపడే మార్గం కోసం అన్వేషిస్తున్నారు. ఇలాంటి ఆలోచనల నుంచి బయటపడేందుకు మానసిక నిపుణులు కొన్ని సలహాలు సూచనలు ఇస్తున్నారు.

ఇంపోస్టర్.. ఎంతో ఇంపార్టెంట్!



లక్షణాలు..

- 'ఇంపోస్టర్ సింగ్రోమ్'తో బాధపడేవారికి తమ నైపుణ్యాలు, ప్రతిభపై వారికే నమ్మకం తక్కువగా ఉంటుంది. వారు సాధించిన విజయాలను వారే నమ్మలేరు. ఆ విజయానికి తాము అనర్హులమని భావిస్తారు. అదృష్టం కొద్దో.. ఇతరుల సాయం కారణంగానో పని పూర్తయిందని సర్దిచెప్పుకొంటారు.
- ఓడిపోతామేమో అన్న భయంతో కొత్త సవాళ్లను స్వీకరించడానికి వెనకడుగు వేస్తుంటారు. తమకు తాముగా విజయాలను సాధించలేమన్న అపోహలో ఉంటారు.
- ఎప్పుడూ సహోద్యోగులతో పోల్చుకుంటారు. తమకన్నా వారే అన్నిటికీ అర్హులనీ, సమర్థులనీ భావిస్తుంటారు.
- ఉన్నత స్థానాల్లో ఉన్నవారు కూడా.. తాము చెబితే కింది ఉద్యోగులు ఆ పని చేస్తారో? లేదో? అని అనుమానపడుతుంటారు. తమ మాటకు విలువ ఉండదనే భావనలో కూరుకుపోతారు.
- అధికారుల అంచనాలకు తగ్గట్టుగా రాణించలేకపోతున్నామని భావిస్తుంటారు.



కారణాలు..

మహిళల్లో 'ఇంపోస్టర్ సింగ్రోమ్' ఎక్కువగా ఉండటానికి కారణాలు అనేకం. చాలామందికి ఈ సమస్య ఇంట్లో నుంచే ప్రారంభం అవుతుంది. బాల్యంలోనే వారిపై వివక్ష మొదలవుతుంది. అబ్బాయిలను ఎక్కువగా గారాబం చేయడం.. వారు ఏం చేసినా తల్లిదండ్రులు సమర్థించడం మనం ఇప్పటికీ చూస్తుంటాం. అదే అమ్మాయిల విషయంలో కొంచెం కఠినంగా వ్యవహరించడం కూడా సర్వసాధారణం. దాంతో అమ్మాయిల్లో తెలియని ఆత్మన్యూనతా భావం పెరుగుతూ వస్తుంది. చదువు, ఉద్యోగాల్లోనూ కొనసాగుతుంది. పురుషాధిపత్యం, సాంకేతిక నైపుణ్యాల లోపం, మహిళలను తక్కువగా అంచనా వేయడం, ప్రోత్సహించేవారు లేకపోవడం లాంటివన్నీ అగ్నికి ఆజ్యం పోసేవే! ఇవన్నీ కలిసి చివరికి మహిళల్లో 'ఇంపోస్టర్ సింగ్రోమ్'గా స్థిరపడతాయి. దాంతో ఈ భావన నుంచి బయటపడేందుకు అతిగా పనిచేస్తుంటారు. శక్తికి మించి ఎక్కువ కష్టపడుతుంటారు. అయితే, దీనివల్ల ఆరోగ్యం దెబ్బతినడం తప్ప.. కొత్తగా ఒరిగేదేం ఉండదు. పైగా.. డిప్రెషన్‌లోకి వెళ్లిపోయే ప్రమాదం కూడా ఉంటుందట.

జయించాల్సిందే..

కొన్ని సలహాలు, సూచనలు పాటిస్తే.. 'ఇంపోస్టర్ సింగ్రోమ్'ను ఈజీగా జయించొచ్చని మానసిక నిపుణులు చెబుతున్నారు.

- ముందుగా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి. అంతకుముందే.. మీలో ఇంపోస్టర్ సింగ్రోమ్ సమస్య ఉన్నదని గుర్తించాలి. మీకున్న అనుమానాలకు సమాధానాలను వెతుక్కోవాలి.
- మీరు సాధించిన విజయాలకు ప్రాధాన్యం ఇవ్వడం అలవాటు చేసుకోవాలి.
- ఏవైనా అనుమానాలు ఉంటే.. సహోద్యోగులతో, మెంటర్లతో మాట్లాడాలి. సందేహాలను నివృత్తి చేసుకోవాలి.
- ఎప్పుడూ నెగెటివ్‌గా ఆలోచించకూడదు. 'నేను చేయగలను!' అనే నమ్మకంతో ఉండాలి.
- నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకోవాలి. శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాపులకు హాజరవుతూ ఉండాలి.
- ఒత్తిడిని తగ్గించుకోవడానికి ధ్యానం, యోగాను ఆశ్రయించాలి.
- మీరు ఒంటరి కాదనీ.. చుట్టూ మీలాంటివారు, మిమ్మల్ని ప్రోత్సహించేవారు ఎందరో ఉన్నారనే భావనతో ఉండాలి.
- ప్రతిసారీ విజయం వరించదనే దృక్పథంతో ఉండాలి. ఓటమి ఎదురైనా హుందాగా స్వీకరించాలి.
- ఎప్పుడూ నలుగురిలో ఉంటూ, నలుగురితో మాట్లాడుతూ ఉంటే.. 'ఇంపోస్టర్ సింగ్రోమ్' నుంచి సులభంగా బయటపడొచ్చు.

ఇద్దరక్క చెల్లెండ్ల ఉయ్యాలో

ఇద్దరక్క చెల్లెండ్లు ఉయ్యాలో
ఒకదారి నడువంగ ఉయ్యాలో
అక్కకు దొరికింది ఉయ్యాలో
కుచ్చుల దండ ఉయ్యాలో
అక్క నీకెక్కడిదె ఉయ్యాలో
ఈ కుచ్చులదండ ఉయ్యాలో
కూడెల్లి మల్లన్న ఉయ్యాల్లో
పంపిన దండ ఉయ్యాలో
పర్వతాల మల్లన్న ఉయ్యాలో
పంపిన దండ ఉయ్యాలో
వేములవాడ రాజన్న ఉయ్యాలో
వేసిన దండ ఉయ్యాలో
వేములవాడ రాజన్న ఉయ్యాలో
ఎక్కడుంటాడో ఉయ్యాలో
గుండంలో స్నానమాడి ఉయ్యాలో
గుళ్లె ఉంటాడు ఉయ్యాలో
పేదరాసి పెద్దమ్మ ఉయ్యాలో
చిన్న కోడలిని ఉయ్యాలో
చిన్న కోడలు వయితె ఉయ్యాలో
ఎందుకొచ్చినావు ఉయ్యాలో
సంతానము లేక ఉయ్యాలో
వచ్చినాను స్వామి ఉయ్యాలో
ఇచ్చెటోడు ఈశ్వరుడు ఉయ్యాలో
రాసేది బ్రహ్మ ఉయ్యాలో
శివుని దగ్గరకు పోయి ఉయ్యాలో
చిట్టి రాయించి ఉయ్యాలో
చిట్టిల ఉన్నడే ఉయ్యాలో
నా చిన్ని బాలుడు ఉయ్యాలో
నా చిన్ని బాలునికి ఉయ్యాలో
పాలు లేవాయె ఉయ్యాలో
వసుదేవుడిచ్చిండు ఉయ్యాలో
ఈ వరద కాలువ ఉయ్యాలో
పరమాత్ముడిచ్చిండు ఉయ్యాలో
పాడి ఆవుల మంద ఉయ్యాలో.

మహిళలకు అండగా.. పింక్ బెల్ట్

దేశంలో మహిళలకు రక్షణ కరువైంది. ఇంటా, బయటా.. ఎక్కడ చూసినా ఆడవాళ్లపై అఘాయిత్యాలు జరగడం సర్వసాధారణమై పోయింది. సగటున ప్రతి గంటకు నలుగురు మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నట్లు అధికారిక లెక్కలే చెబుతుండటం.. కలవరపాటుకు గురిచేస్తున్నది. ఈ క్రమంలో మహిళలపై అత్యాచారాలు, గృహహింసకు వ్యతిరేకంగా ఎందరో గొంతెత్తుతున్నారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా పోరాడుతున్నారు. అలాంటివారిలో ఒకరు.. అపర్ణా రజావత్!



ఈమె స్థాపించిన 'పింక్ బెల్ట్' మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నది. ఈ సంస్థ గురించి అమెరికాకు చెందిన జాన్ మెక్‌క్రిట్ అనే దర్శకుడు ఓ డాక్యుమెంటరీ తీయగా.. అనేక అవార్డులు గెలుచుకున్నది. 'పింక్ బెల్ట్' పేరుతో తీసిన ఈ చిత్రం.. అమెరికాలోని పామ్ స్ప్రింగ్స్‌లో ప్రదర్శితమైంది. తాజాగా చికాగో సౌత్ ఏషియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్‌గా జ్యూరీ అవార్డును గెలుచుకున్నది. ఆగ్రాకు చెందిన అపర్ణ రజావత్.. మార్షల్ ఆర్ట్స్‌లో 16 సార్లు నేషనల్ చాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత లండన్‌కు వెళ్లిపోయింది. అయితే, 2012లో జరిగిన 'నిర్భయ ఘటన'.. అపర్ణను ఎంతగానో ప్రభావితం చేసింది. అప్పుడే మహిళల రక్షణ కోసం పోరాడాలని సంకల్పించింది. భారత్‌కు తిరిగివచ్చి 'పింక్ బెల్ట్'ను స్థాపించింది. ఇందులో చేరిన మహిళలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పించడంతోపాటు ఆర్థికంగా అండగా నిలుస్తున్నది. ఈ క్రమంలో 2020లో పింక్ బెల్ట్ నిర్వహించిన ఓ శిక్షణా కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులోనూ స్థానం సంపాదించుకున్నది. ఆ కార్యక్రమంలో 7401 మంది మహిళలు పాల్గొనడం ఓ మైలురాయిగా నిలిచిపోయింది. తాజాగా తమ సంస్థ గురించి వచ్చిన చిత్రానికి ప్రతిష్ఠాత్మక అవార్డు రావడంపై సంతోషం వ్యక్తం చేసింది అపర్ణ. 2030 నాటికి దేశంలో కనీసం 20 లక్షల మందికి 'పింక్ బెల్ట్'లో శిక్షణ ఇవ్వడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెబుతున్నది. ఇందుకోసం ప్రధాన నగరాల్లో హెల్ప్‌లైన్‌లను ప్రారంభించి, వృత్తిపరమైన శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తానని అంటున్నది.

కలువ కళ్లకు కాటుకే అందం! నయనాలకు నల్లరంగు పులిమితేనే.. అతివ అలంకరణ పరిపూర్ణం అవుతుంది! అయితే, ఈ అందమైన కాజల్ వెనక అపాయం పొంచి ఉందని చెబుతున్నారు నిపుణులు. మార్కెట్‌లో లభ్యమవుతున్న కాటుకల్లో చాలావరకు రసాయనాలతో నిండినవే ఉంటున్నాయి. ఫలితంగా అందాన్నిచ్చే కాటుక కంటగింపుగా మారుతున్నది.

అందం చాటున.. అపాయం!

కళ్లు ఎంతో సున్నితమైనవి. వాటి చుట్టూ ఉండే కణాలు మరింత నాజూకుగా ఉంటాయి. ఇక ప్రస్తుతం మార్కెట్లో ఎన్నో రకాల కాటుకలు దొరుకుతున్నాయి. వాటిలో ఎక్కువ శాతం రసాయనాలు, నూనెలు, వ్యాక్స్ వాడి తయారుచేస్తున్నారు. అలాంటి కాటుకను కళ్లకు తరచుగా పెట్టుకోవడం, రోజంతా అలాగే ఉంచుకోవడం ఎంతో ప్రమాదకరం. కాటుకలో ఉండే రసాయనాల వల్ల కళ్లు పొడిబారతాయి. కంటి చుట్టూ దురద పుడుతుంది. చేతులతో రుద్దడం వల్ల కళ్లు ఎరుపు రంగులోకి మారుతాయి. ఈ సమస్య ఎక్కువ రోజులు కొనసాగితే.. కళ్లు దెబ్బతింటాయి కూడా. కాటుకలో వాడే వ్యాక్స్ వల్ల అలెర్జీలు వచ్చే అవకాశం ఎక్కువ. కళ్ల వాపు, దద్దుర్లు వంటి లక్షణాలూ కనిపిస్తాయి. కాటుకను రెగ్యులర్‌గా పెడితే.. కళ్ల చుట్టూ మచ్చలు రావడం, కళ్లలోంచి నీరు కారడం లాంటి సమస్యలు ఎదురవుతాయి. అన్నిటికన్నా ముఖ్యంగా.. కాటుక వాడేముందు ఎక్స్‌పైరీ తేదీని తప్పకుండా చూసుకోవాలి. గడువు దాటిన కాజల్‌ను పెట్టుకుంటే.. కొన్నిసార్లు కంటిచూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉంటుంది. అయితే, కళ్ల అందాన్ని రెట్టింపు చేసే కాటుకను సహజసిద్ధంగా తయారుచేసుకోవచ్చు. అలాంటివి వాడుకుంటే ఎలాంటి ఇబ్బందీ రాదు.



ముందే పసిగట్టేద్దాం..

మెనోపాజ్.. మహిళల్లో రుతుక్రమ ముగింపును సూచించే సహజమైన దశ. ప్రతి మహిళ జీవితంలో జరిగే ఓ సాధారణ ప్రక్రియ. అయితే, ఈ సమయంలో మహిళల శరీరంలో ఎన్నో మార్పులు వస్తాయి. మానసికంగానూ తీవ్రమైన సంఘర్షణలు తలెత్తుతాయి. వాటన్నిటినీ సమర్థంగా ఎదుర్కొన్నప్పుడే.. ఆ తర్వాతి జీవితం సాఫీగా సాగుతుంది. లేకుంటే.. అనేక ఒడుదొడుకులకు గురవుతుంది.

సాధారణంగా మహిళలకు 45 నుంచి 50 ఏళ్ల మధ్య.. మెనోపాజ్ దశ మొదలవుతుంది. ఈ దశలో ప్రొజెస్టిరాన్, ఈస్ట్రోజెన్ హార్మోన్ స్థాయిలు తగ్గుతాయి. ఫలితంగా జీవక్రియలో క్షీణత, ఒత్తిడి ఎక్కువ అవుతుంది. కొలెస్ట్రాల్, ఇన్సులిన్ నిరోధకత పెరిగే ప్రమాదం కూడా ఉంటుంది. ఈ హార్మోనల్ మార్పులవల్ల చాలామందికి సరిగ్గా నిద్ర పట్టదు. ఎప్పుడూ చికాకుగా ఉంటారు. చిన్నచిన్న పనులకే అలసిపోతారు. శరీరం ఎక్కువగా వేడికి గురవ్వడం, చెమటలు పట్టడం లాంటి లక్షణాలూ కనిపిస్తాయి. కాల్షియం స్థాయిలు తగ్గిపోవడం వల్ల ఎముకలు బలహీనపడతాయి. ఈ ప్రభావాలన్నీ మహిళల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. మానసికంగానూ ఇబ్బంది కలిగిస్తాయి. అయితే.. మెనోపాజ్ దశకన్నా ముందు వచ్చే పెరిమెనోపాజ్ దశ నుంచే ఈ మార్పులన్నీ ఒక్కొక్కటిగా బయటపడతాయి. అప్పుడే జాగ్రత్తపడితే.. మెనోపాజ్ దశలో ఈ ఇబ్బందులను సులభంగా అధిగమించే అవకాశాలు ఉంటాయి.



అలవాట్లు మార్చుకోవాలి..

40 ఏండ్లు దాటిన మహిళలు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. మొదటగా శారీరక శ్రమ చేయడం అలవాటు చేసుకోవాలి. వాకింగ్, యోగాతో రోజంతా చురుగ్గా ఉండొచ్చు. మెటబాలిజాన్ని పెంచుకోవచ్చు. రోజువారీ ఆహారంలో కాల్షియం ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. తక్కువ కార్బొహైడ్రేట్లు, ఎక్కువ ప్రొటీన్ ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. అంతేకాకుండా నిద్రకు కచ్చితమైన సమయాన్ని కేటాయించాలి. రోజూ నిర్ణీత సమయంలోగా నిద్ర పోవడం అలవాటుగా మార్చుకోవాలి. ఇలాంటి చిట్కాలు పాటిస్తే.. మెనోపాజ్ దశలో వచ్చే సమస్యలను సమర్థంగా ఎదుర్కోవచ్చు.